# పాత నిబంధన
# యందలి ప్రవక్తల
# చిన్న గ్రంథముల పరిచయము

రచయిత

**టి.పి. వరప్రసాద రెడ్డి**

ప్రచురణ

**టి. పి. వరప్రసాద రెడ్డి**

**షాలోమ్ చర్చి,**

**జె.యన్.టి.యు. పోస్టాఫీస్**

**అనంతపురము - 515 002**

✆ : 9440285883, 9440669494

# Minor Prophets

***Bro. T.P. Vara Prasada Reddy***

1st Edition - September 2016

© All Rights Reserved

Price : Rs. 40 /-

Copies available at:

1. T.P. Varaprasada Reddy, Shalom Church, J.N.T.U. Post
   Ananthapur - 515 002, Cell: 9440285883
2. Logos Book Centre, 10/1, Arandulpet, Guntur - 522 002
   Phone: (0863) 2336927; Cell: 9866296843

3, Jeevan Jyothi Press & Publishers
   Mission High School Road, Royapeta,
   Narsapur - 534 275

Printed & Published by

***T.P. Varaprasada Reddy***

Shalam Church, J.N.T.U.C. Post Office

ANANTAPUR - 515 002

Andhra Pradesh, India,

✆ : 9440285883, 9440669494

# పుస్తకముల నామక్రమములు

పాత నిబంధనయందలి ప్రవక్తల చిన్న గ్రంథములను పరిచయం ..............4

**1.** హోషేయ ..............11

**2.** యోవేలు ..............28

**3.** ఆమోసు ..............35

**4.** ఓబద్యా ..............45

**5.** యోనా ..............49

**6.** మీకా ..............54

**7.** నహూము ..............62

**8.** హబక్కూకు ..............66

**9.** జెఫన్యా ..............71

**10.** హగ్గయి ..............75

**11.** జెకర్యా ..............78

**12.** మలాకీ ..............92

# ప్రవక్తల చిన్న గ్రంథముల పరిచయం

ఇశ్రాయేలు 12 గోత్రముల వారిని సౌలురాజు (క్రీ.పూ. 1050–1010), దావీదు రాజు (క్రీ.పూ. 1010–970), సొలొమోను రాజు (క్రీ.పూ. 970–930) పరిపాలించిన తదుపరి రాజైన రెహబాము కాలమందు రాజ్యము రెండు భాగములై యూదా, బెన్యామీను గోత్రములవారు యూదావారని పిలువబడ్డారు. యూదా ప్రజలను 20 మంది ఒకే కుటుంబానికి చెందిన రాజులు క్రీ.పూ. 930–586 వరకు పరిపాలించారు. వారిలో 8 మంది మంచివారు, 12 మంది చెడ్డవారు. మిగిలిన 10 గోత్రాల ప్రజలు ఇశ్రాయేలీయులు అని పిలువబడి 19 మంది రాజులచే 9 కుటుంబాల వారిచే క్రీ.పూ. 930–721 వరకు పాలించబడ్డారు. వారందరూ చెడ్డవారు. వారి రాజుల వివరాలు తదుపరి యూదావారిని పాలించిన ఇతర అన్యరాజుల వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి.

**యూదా రాజ్యాన్ని పాలించిన 20 మంది రాజులు (క్రీ.పూ. 930–586)**

| | | | |
|---|---|---|---|
| 1. | రెహబాము | (క్రీ.పూ. 930–916) | చెడ్డవాడు |
| 2. | అబీయా | (క్రీ.పూ. 915–913) | చెడ్డవాడు |
| 3. | ఆసా | (క్రీ.పూ. 913–874) | మంచివాడు |
| 4. | యెహోషాపాతు | (క్రీ.పూ. 874–850) | మంచివాడు |
| 5. | యెహోరాము | (క్రీ.పూ. 850–843) | చెడ్డవాడు |
| 6. | అహజ్యా | (క్రీ.పూ. 843) | చెడ్డవాడు |
| 7. | అతల్యా | (క్రీ.పూ. 843–837) | చెడ్డవాడు |
| 8. | యోవాషు | (క్రీ.పూ. 837–798) | మంచివాడు |
| 9. | అమజ్యా | (క్రీ.పూ. 798–770) | మంచివాడు |
| 10. | ఉజ్జియా | (క్రీ.పూ. 770–736) | మంచివాడు |
| 11. | యోతాము | (క్రీ.పూ. 749–734) | మంచివాడు |
| 12. | ఆహాజు | (క్రీ.పూ. 741–726) | చెడ్డవాడు |
| 13. | హిజ్కియా | (క్రీ.పూ. 726–697) | మంచివాడు |
| 14. | మనష్షే | (క్రీ.పూ. 697–642) | చెడ్డవాడు |
| 15. | ఆమోను | (క్రీ.పూ. 641–640) | చెడ్డవాడు |

| | | |
|---|---|---|
| 16. యోషీయా | (క్రీ.పూ. 639-608) | మంచివాడు |
| 17. యెహోయాహాజు | (క్రీ.పూ. 608) | చెడ్డవాడు |
| 18. యెహోయాకీము | (క్రీ.పూ. 608-597) | చెడ్డవాడు |
| 19. యెహోయాకీను | (క్రీ.పూ. 597) | చెడ్డవాడు |
| 20. సిద్కియా | (క్రీ.పూ. 597-586) | చెడ్డవాడు |

క్రీ.పూ. 606, 597, 586 లలో మూడు విడతలుగా బబులోను చెఱకు కొనిపోబడ్డారు. క్రీ.పూ. 536 లో తిరిగివచ్చారు.

**గమనిక:** ఉజ్జియా, యోతాము, ఆహాజు రాజుల పాలనలు తమ తండ్రుల పాలన కాలంలోనే ప్రారంభమయ్యాయి.

## ఇశ్రాయేలును పాలించిన 9 కుటుంబాలకు చెందిన 19 మంది రాజులు (అందరూ చెడ్డవారు) (క్రీ.పూ. 930-721)

| కుటుంబము | | రాజులు | పాలించిన కాలము |
|---|---|---|---|
| **A.** | 1) | యరోబాము | 930-911 |
| | 2) | నాదాబు | 911-910 |
| **B.** | 3) | బయెషా | 910-887 |
| | 4) | ఏలా | 887-886 |
| **C.** | 5) | జిమ్రీ | 886 |
| **D.** | 6) | ఒమ్రీ | 886-875 |
| | 7) | ఆహాబు | 875-855 |
| | 8) | అహజ్యా | 855-785 |
| | 9) | యరోబాము | 854-843 |
| **E.** | 10) | యెహూ | 843-816 |
| | 11) | యెహోయాహాజు | 820-804 |
| | 12) | యహోయాషు | 806-790 |
| | 13) | యెరోబాము | 790-749 |
| | 14) | జెకర్యా | 748 |

| | | | |
|---|---|---|---|
| **F.** | 15) | షల్లూము | 748 |
| **G.** | 16) | మెనహేము | 748-738 |
| | 17) | పెకహ్యా | 738-736 |
| **H.** | 18) | పెకహు | 748-730 |
| **I.** | 19) | హోషేయ | 730-721 |

**గమనిక:** యెహోయాహాజు, పెకహు రాజుల పాలన ముందున్న రాజుల పాలనలోనే ప్రారంభమైనది. క్రీ.పూ. 732, 721 లో రెండు విడతలుగా అష్షూరు దేశానికి చెఅగొనబడ్డారు.

ఇశ్రాయేలు రాజులు, ప్రజలు చెడ్డవారై దాను, బేతేలులోనున్న దూడల విగ్రహాలను పూజించడంవల్ల దేవుడు 10 గోత్రములవారిని క్రీ.పూ. 732, 721లలో అష్షూరుకు బందీలుగా పంపించాడు. వారు నేటికీ తిరిగి రాలేదు. యూదావారి రాజులలో 8 మంది మంచివారు. మిగిలినవారు, ప్రజలు విగ్రహారాధికులై చెడ్డవారైనందువల్ల వారిని క్రీ.పూ. 606, 597, 586 లలో మూడు విడతలుగా బబులోను చెఅకు పంపించాడు. సొలొమోను రాజు క్రీ.పూ. 967-960 వరకు యెరూషలేములో కట్టించిన మందిరము క్రీ.పూ. 586 లో ధ్వంసం చేయబడింది. యెరూషలేము పట్టణ ప్రాకారము కాల్చబడింది (2దిన 36:11-21). 70 సంవత్సరాల తరువాత బబులోను నుండి క్రీ.పూ. 536 లో తిరిగి వచ్చినప్పటికీ వారు క్రింద కనపరచిన అన్యులగు మాదీయ, పారశీకులచే (క్రీ.పూ. 536-331 వరకు గ్రీకులచే, క్రీ.పూ. 330-30 వరకు, రోమీయులచే క్రీ.పూ. 30 నుండి క్రీ.శ. 485 వరకు పరిపాలించబడియున్నారు. మతపరమైన రోమా రాజ్యము క్రీ.శ. 485 నుండి నేటివరకు మతపరముగా (ప్రపంచములో కాథలిక్కుల జనాభా అధికము) రోములో ఉన్న పోప్‌గారి ద్వారా ఆధిక్యత కలిగియున్నది.

మాదీయ పారశీక రాజుల దినములలో క్రీ.పూ. 535 నుండి 515 వరకు జెరుబ్బాబెలు, యెహోషువల నాయకత్వంలో మందిరము కట్టబడెను. క్రీ.పూ. 457లో శాస్త్రియైన ఎజ్రా కాలములో మందిరము అలంకరించారు. క్రీ.పూ. 445 లో అధిపతియైన నెహెమ్యా కాలములో యెరూషలేము పట్టణ ప్రాకారము కట్టబడినది. క్రీ.పూ. 397 వరకు ప్రవక్త మలాకీ కాలమువరకు వారి జీవితాలు కట్టబడెను.

**ప్రపంచాన్ని ఏకచక్రాధిపత్యముగా ఏలిన ఏడు సామ్రాజ్యములు గమనించండి.**

**I.** ఐగుప్తు సామ్రాజ్యము (క్రీ.పూ. 1800–1400)

**II.** అష్షూరు సామ్రాజ్యము (క్రీ.పూ. 900–606)

**బైబిలునందున్న రాజుల పాలన**

1) తిగ్లత్పిలేసరు – పూలు (క్రీ.పూ. 745–727)

2) షల్మనేసరు (క్రీ.పూ. 726–721)

3) సన్హెరీబు (క్రీ.పూ. 721–715 వరకు)

**III.** బబులోను సామ్రాజ్యమును 70 సంవత్సరములు పరిపాలించిన రాజులు (క్రీ.పూ. 606–536)

| **రాజులు** | **పాలించిన కాలము** |
|---|---|
| 1) నెబుకద్నెజరు | 606–561 |
| 2) ఎవీల్మెరోదకు | 561–560 |
| 3) నెరిగ్లిసర్ | 559–556 |
| 4) లాబెష్మొర్దెక్ | 556 |
| 5) నెబోనిడాస్, బెల్సస్సరు | 556–536 |

**IV.** మాదీయ పారశీక సామ్రాజ్యమును సుమారు 200 సంవత్సరములు పాలించిన రాజులు (క్రీ.పూ. 536–330). మాదీయుడగు దర్యావేషు (దానియేలు 6:6) కాలములోనే తన అల్లుడైన పారశీకుడైన కోరెషు పాలించాడు.

| **పారశీక రాజులు** | **పాలించిన కాలము** |
|---|---|
| 1) కోరెషు | 536–529 |
| 2) క్యాంబిసిస్ | 529–522 |
| 3) దర్యావేషు – **I** | 521–485 |
| 4) అహష్వేరోషు – **I** | 485–465 |
| 5) అర్తహషస్త – **I** | 465–425 |
| 6) అహష్వేరోషు – **II** | 424 |
| 7) దర్యావేషు – **II** | 424–405 |
| 8) అర్తహషస్త – **II** | 465–425 |
| 9) అర్తహషస్త – **III** | 465–425 |
| 10) అర్తహషస్త – **IV** | 465–425 |
| 11) అర్తహషస్త – **V** | 465–425 |

**V.** గ్రీకుల రాజ్యము సుమారు 300 సంవత్సరములు (క్రీ.పూ. 330-30).

అలెగ్జాండర్ 330-323 వరకు పరిపాలించి మరణించగా అతని నలుగురు సైన్యాధిపతులు :

| | | |
|---|---|---|
| 1) | తూర్పు రాజ్యమును (ఆసియా) | లిసిమెకస్ |
| 2) | పడమర రాజ్యమును (థెస్సలొనిక) | కస్సెండరు |
| 3) | ఉత్తర రాజ్యమును (సిరియా) | అంటియొకస్ |
| 4) | దక్షిణ రాజ్యమును (ఈజిప్టు) | టాలమీలు పరిపాలించారు. |

ఉత్తర రాజ్యము క్రీ.పూ. 30 వరకు ఉన్నది.

**VI.** రోమా రాజ్యము (క్రీ.పూ. 30- క్రీ.శ. 485). క్రీ.పూ. 30 నుండి క్రీస్తు జీవించిన దినములలోను, తరువాత క్రీ.శ. 485 వరకు రోమీయులు పరిపాలించుచుండిరి.

**VII.** మతపరమైన రోమా రాజ్యము (క్రీ.శ.485 - నేటివరకు). మతపరమైన రోమా రాజ్యము నేటికిని ప్రపంచమందున్న అధిక జనాభా గల క్యాథలిక్కుల ద్వారా, పోప్ ద్వారా ప్రపంచమును పరిపాలించుచున్నది.

**ప్రవక్తల చిన్న గ్రంథములు వ్రాసినవారి పేరులకు గల అర్థమును గమనిద్దాం.**

| | | | |
|---|---|---|---|
| 1. | హోషేయ | - | యెహోవా రక్షకుడు |
| 2. | ఓబద్యా | - | యెహోవా దాసుడు |
| 3. | జెఫన్యా | - | యెహోవా దానము |
| 4. | మీకా(యా) | - | యెహోవాను పోలిన వాడెవడు |
| 5. | జెకర్యా | - | యెహోవా చూచుకొనును |

**గమనిక :** పేరు చివర 'యే' అను అక్షరమున్నచో 'యెహోవా' అని భావము.

| | | | |
|---|---|---|---|
| 6. | యోవేలు | - | యెహోవా దేవుడు (యేలు అనగా దేవుడు) |
| 7. | యోనా | - | పావురము |
| 8. | నహూము | - | ఆదరణ |
| 9. | హబక్కూకు | - | హత్తుకొనుట |
| 10. | ఆమోసు | - | భారము భరించువాడు |
| 11. | హగ్గయి | - | పండుగ |
| 12. | మలాకీ | - | నా దూత |

# ప్రవక్తల చిన్న గ్రంథముల విభజన

| వ.సం. | గ్రంథము | ఎవరి కొరకు | ఎప్పుడు క్రీ.పూ. | వివరము |
|---|---|---|---|---|
| | | **మొదటి భాగము** | | |
| 1. | హోషేయ | ఇశ్రాయేలు | 760–735 | పదిగోత్రముల ఇశ్రాయేలు ప్రజలు అష్షూరు చెఱకు వెళ్ళకమునుపు |
| 2. | ఆమోసు | ఇశ్రాయేలు | 750 | |
| 3. | మీకా | ఇశ్రాయేలు | 750–735 | |
| | | **రెండవ భాగము** | | |
| 4. | యోవేలు | యూదా | 750 | రెండు గోత్రముల యూదా ప్రజలు బబులోను చెఱకు వెళ్ళకమునుపు |
| 5. | హబక్కూకు | యూదా | 607 | |
| 6. | జెఫన్యా | యూదా | 625–608 | |
| | | **మూడవ భాగము** | | |
| 7. | హగ్గయి | యూదా | 520 | యూదావారు బబులోను చెఱనుండి తిరిగి వచ్చిన పిదప |
| 8. | జెకర్యా | యూదా | 520–518 | |
| 9. | మలాకీ | యూదా | 397 | |
| | | **నాలుగవ భాగము** | | |
| 10. | ఓబద్యా | ఎదోము | 582 | ఎదోమీయుల నాశనమును గూర్చినది |
| 11. | యోనా | నీనెవె | 730 | అష్షూరీయులకు నాశనమును గూర్చినది |
| 12. | నహూము | నీనెవె | 700 | |

పై పట్టికలో 12 ప్రవక్తల చిన్న గ్రంథములు 3 + 3 + 3 + 3 అను నాలుగు భాగములుగా చేయబడినవి. రెండవ భాగమునందలి యోవేలు, హబక్కూకు, జెఫన్యా అను మూడు గ్రంథములలో రెండు గోత్రముల యూదావారు బబులోను చెరకు మూడు విడతలుగా వెళ్ళకముందు వారి పాపమును చూపుతూ, పశ్చాత్తాప పడమని హెచ్చరించుచూ, లేనియెడల శిక్షింతునని తెలిపెను. మూడవ భాగమునందలి మూడు గ్రంథములైన హగ్గయి, జెకర్యా, మలాకీ గ్రంథములలో బబులోను చెరనుండి

తిరిగి వచ్చిన యూదావారు మందిరము కట్టనారంభించారు (ఎజ్రా 3:8). కాని తమ ఇళ్ళు కట్టుకోవడంచేత (ఎజ్రా 4:12) పారశీక రాజాజ్ఞనుబట్టి మందిర నిర్మాణము ఆపిరి (ఎజ్రా 4:24). మందిర నిర్మాణమునకై ప్రోత్సహించుచూ అంత్యకాలములో యూదావారిని ఆశీర్వదించు విధమును హగ్గయి, జెకర్యాలు తమ గ్రంథములలో తెలిపారు. మలాకీ గ్రంథములో వారి జీవితములను దిద్దుటను గూర్చిన వివరాలు ఉన్నాయి.

మొదటి భాగములోని హోషేయ, ఆమోసు, మీకా గ్రంథములందు పది గోత్రముల ఇశ్రాయేలు వారి పాపములు, రానున్న శిక్షలను తెలుపుతూ అంత్యకాలమందలి ఆశీర్వాదములను, రానున్న మెస్సీయ మొదటి రాకడ, రెండవ రాకడ, విమోచన, పాలన వివరములు కూడా తెలుపబడెను. రెండు గోత్రముల యూదావారిని గూర్చి మీకా గ్రంథములో కొద్దిగా తెలియజేయబడినది. యెరూషలేము గూర్చి, యూదావారిని గూర్చిన వర్తమానము కూడా ఉన్నది.

నాలుగవ భాగములో ఇశ్రాయేలు, యూదావారిని హింసించిన శత్రువులను శిక్షించడంలో సహకరించిన ఎదోమీయులను నాశనం చేస్తానని ఓబద్యా ద్వారా గ్రంథంలో తెలుపబడింది. ఇశ్రాయేలును అష్షూరుకు చెఱకు పంపకముందు అష్షూరు వారిని దిద్దుటను గూర్చిన వివరాలు యోనా గ్రంథములో వ్రాయించెను. తాత్కాలికంగా నీనెవెవారు మారుమనసు పొందినప్పటికీ తరువాత కఠినులై, విగ్రహారాధికులై తమ యొద్దకు వచ్చిన ఇశ్రాయేలీయులను కష్టపెట్టినందువల్ల అష్షూరును శిక్షిస్తానని నహూము గ్రంథం ద్వారా తెలుపబడింది. నీనెవె అష్షూరు రాజ్యమునకు ముఖ్య పట్టణము. బబులోను పట్టణము బబులోను సామ్రాజ్యమునకు ముఖ్య పట్టణము. షూషను పట్టణము పారశీక సామ్రాజ్యమునకు ముఖ్యపట్టణము. దమస్కు సిరియా దేశము యొక్క ముఖ్యపట్టణము. గాజా ఫిలిష్తీయుల ముఖ్య పట్టణము. రెండు గోత్రముల యూదావారికి యెరూషలేము, పదిగోత్రముల ఇశ్రాయేలువారికి షోమ్రోను, తిర్సా ముఖ్యపట్టణాలు.

మోయాబీయులు, అమ్మోనీయులు: లోతు అబ్రాహాము సహోదరుని కుమారుడు. లోతు తన కుమార్తెలతో శయనించగా వారికి మోయాబు, బెన్నమ్మి అనే ఇద్దరు కుమారులు జన్మించారు. వీరు వరుసగా మోయాబీయులకు, అమ్మోనీయులకు మూల పురుషులు. వీరు ఇశ్రాయేలీయులకు బంధువులైనప్పటికీ ఎల్లప్పుడూ శత్రువులుగా వ్యవహరించారు. కనుక తరువాతి కాలంలో దేవుడు వీరిని కూడా శిక్షించాడు.

# 1. హోషేయ

**గ్రంథకర్త : హోషేయ** **కాలం : క్రీ.పూ. 780-700**

**ముఖ్యాంశం : ఇశ్రాయేలీయుల పాపములు (1-7 అధ్యా.)**
**దేవుని శిక్ష - ప్రేమ - సమకూర్పు (8-14 అధ్యా.)**

**గ్రంథ ఉద్దేశం :** హోషేయ బేరి కుమారుడు. 'యెహోవా రక్షకుడు' అనే అర్థముగల పేరు గలవాడు. పేరుకు తగినట్టు అంత్యకాలంలో ఇశ్రాయేలుకు కలుగబోయే రక్షణను గూర్చి ప్రకటించాడు. ఇశ్రాయేలువారు విగ్రహారాధికులై, పాపములు చేస్తున్నందున అందుకు సూచనగా ఈ ప్రవక్తను వ్యభిచారియైన గోమెరును వివాహం చేసుకోమనీ, పుట్టిన బిడ్డలలో ఒకరికి 'నా జనులు కారు' అనే అర్థమిచ్చే లోఅమ్మీ అనే పేరు పెట్టమనీ దేవుడు సూచించాడు (1 అధ్యా.). ప్రవక్త భార్య ప్రవక్తను విడిచిపెట్టి తిరిగి వ్యభిచారిణిగా ఉన్నప్పుడు (2 అధ్యా.) ప్రవక్త వెళ్ళి డబ్బులిచ్చి ఆమెను కొని, ఆమెను ప్రేమించి, నిబంధన చేసుకొనమని దేవుడు సెలవియ్యగా ప్రవక్త ఆ విధంగా చేశాడు (3 అధ్యా,). ఇక్కడ మానవుల పట్ల దేవుని ప్రేమ కనబడుతున్నది. 1) దేవుని శాశ్వత ప్రేమ (యిర్మీయా 31:3), 2) విడువక కృప చూపే ప్రేమ (యిర్మీయా 31:32), 3) అంతమువరకు ఉండే ప్రేమ (యోహాను 13:1), 4) ప్రాణము పెట్టే ప్రేమ (1యోహాను 3:16), 5) పాపానికి ప్రాయశ్చిత్తము చేసే ప్రేమ (1యోహాను 4:10), 6) మనము ప్రేమించితిమని కాదు తానే మనలను ప్రేమించాడు (1యోహాను 4:10).

**ప్రవచన నెరవేర్పు :** పది గోత్రాల ఇశ్రాయేలు ప్రజలు, రాజులు యెహోవాను విడిచి విగ్రహాలను పూజించడంవల్ల వారు అనేక దినాలు రాజు లేకుండా, వారొక రాజ్యంగా ఉండలేక చెదరిపోయి (క్రీ.పూ. 721లో) నేటివరకూ అదే స్థితిలో ఉన్నారు. అంత్యకాలంలో శ్రమల కాలంలో ఇశ్రాయేలుపై దేవుడు తన ప్రేమను కనుపరచగా ఇశ్రాయేలు పశ్చాత్తాపంతో దేవునివైపు తిరిగినపుడు దేవుని ప్రేమను పొందగలరు. దేవుడు వారితో నిబంధన చేసికొని వారిమధ్య విగ్రహారాధనను తొలగించి వారిని పవిత్రపరచుట, అంత్యకాలంలో తిరిగి సమకూర్చుట అనేవి ఈ గ్రంథంలోని ముఖ్య అంశాలు. హోషేయ ప్రవక్త యెరోబాము అనే ఇశ్రాయేలు రాజు కాలంలోనూ, ఉజ్జీయా, యోతాము, ఆహాజు, హిజ్కియా వంటి యూదా రాజుల కాలంలోనూ ప్రవచించాడు.

యెషయా, మీకా ప్రవక్తలు ఈ కాలంలోనే యూదా, ఇశ్రాయేలు ప్రజలకు ప్రకటించారు. యిర్మీయా యూదా ప్రజలకు ప్రవచించాడు. ఈ గ్రంథంలోని 14 అధ్యాయాలను రెండు సమాన భాగాలుగా, అంటే 7 + 7 గా విభజించి ధ్యానించవచ్చు.

1-7 అధ్యాయాలలోని మొదటి మూడు అధ్యాయాలలో (1-3) ప్రవక్త, అతని భార్యల జీవితాల ద్వారా ఇశ్రాయేలీయుల పాప జీవితాలను, దేవుని యెడబాయని ప్రేమను చూస్తాం. తరువాతి 4 అధ్యాయాలలో (4-7) ఒక్కొక్క అధ్యాయంలో వారి ఒక్కొక్క పాపాన్ని, దానికి రాబోయే శిక్షను చూస్తాం. రెండవ భాగమైన 8-14 అధ్యాయాలలో దేవుడు వారికి పంపనున్న నాలుగు శిక్షలను వివరిస్తూ, వాటిని గూర్చిన మూడు ఉపమానాలు హోషేయ వివరిస్తాడు. 11-14 అధ్యాయాలలో అవిధేయులైన ఇశ్రాయేలీయులపట్ల దేవుని ప్రేమను కనుపరిచే మూడు ఉపమానాలు (11-13 అధ్యా), అంత్యకాలంలో వారిని సమకూర్చడం గూర్చి హోషేయ ప్రవచించాడు. ఇశ్రాయేలీయులకు 1948 లో స్వాతంత్ర్యము వచ్చినది మొదలు ప్రపంచమంతటా చెదరిపోయిన ఇశ్రాయేలీయులు కొద్దికొద్దిగా తమ స్వదేశానికి చేరుకుంటున్నారు.

## అధ్యాయాల విభజన : 3 + 4 + 3 + 4 = 14 అధ్యాయాలు

### A. 1-7 అధ్యా - ఇశ్రాయేలీయుల పాపములు

### I. 1-3 అధ్యా.: ఇశ్రాయేలీయుల పాపములు - ప్రవక్త జీవితం ద్వారా బోధ

**1 అధ్యా.** హోషేయ ముగ్గురు పిల్లల పేర్ల ద్వారా ఇశ్రాయేలు పాపం, రానున్న శిక్షను చూపించడం - ఇశ్రాయేలు పునరుద్ధరణ గూర్చిన వాగ్దానం.

**2 అధ్యా.** హోషేయ భార్య వ్యభిచార జీవితం, అపనమ్మకం నుండి రానున్న తీర్పు సూచించడం - ఇశ్రాయేలుకు రానున్న ఆశీర్వాదం గూర్చిన ప్రవచనం.

**3 అధ్యా.** హోషేయ తన భార్యను తిరిగి తెచ్చుకోవడం ద్వారా ఇశ్రాయేలును దేవుడు చేర్చుకుంటాడని సూచించడం.

### II. 4-7 అధ్యా.: ఇశ్రాయేలీయుల పాపములు - రానున్న శిక్షలు

**4 అధ్యా.** దేవుణ్ణి మరచిపోయి విగ్రహారాధికులై పాపములు చేయడం (వ. 6) - శిక్ష

**5 అధ్యా.** అపవిత్రత అనే పాపం (వ. 3) - శిక్ష

**6 అధ్యా.** భక్తి నిలుపకపోవడం అనే పాపం (వ. 4) - శిక్ష

**7 అధ్యా.** అన్యజనులతో కలిసిపోవడం అనే పాపం (వ. 8) - శిక్ష

### B. 8-14 అధ్యా - దేవుని శిక్ష - ప్రేమ - సమకూర్పు

### III. 8-10 అధ్యాయాలు: దేవుని శిక్షలు

**8 అధ్యా.** శిక్షను గూర్చిన మొదటి హెచ్చరిక - శ్రమ వస్తుందన్న హెచ్చరిక.

**9 అధ్యా.** శిక్షను గూర్చిన రెండవ హెచ్చరిక - సంతోషించకూడదన్న హెచ్చరిక.

**10 అధ్యా.** ఇశ్రాయేలు పాపం - రానున్న శిక్షను సూచించే 3 ఉపమానాలు

1) ద్రాక్షచెట్టు, 2) దేవునికి భయపడని రాజులేని ప్రజలు,

3) నూర్పునందు అభ్యాసం గల పెయ్య.

**IV. 11-14 అధ్యా - అవిధేయులైనప్పటికీ ఇశ్రాయేలు పట్ల దేవుని ప్రేమను చూపించే 3 ఉపమానాలు (11-13 అధ్యా.) - అంత్యకాల సమకూర్పు (14 అధ్యా.)**

**11 అధ్యా.** బాలుడైన ఇశ్రాయేలును గూర్చిన ఉపమానం.

**12 అధ్యా.** గాలిని మేయువాడైన ఎఫ్రాయీమును గూర్చిన ఉపమానం.

**13 అధ్యా.** ఉదయ సమయంలో కనిపించే మేఘం - పెందలకడనే గతించిపోయే ప్రాతఃకాలపు మంచువలె, చచ్చినవాడైన ఎఫ్రాయీమును గూర్చిన ఉపమానం.

**14 అధ్యా.** ఇశ్రాయేలీయుల అంత్యకాల సమకూర్పు

# 1వ అధ్యాయం

వచనముల విభజన - **1 + 2 + 2 + 2 + 2 + 2 = 11**

**అంశం : హోషేయ వివాహం, పిల్లలు - ఇశ్రాయేలు అంత్యకాల పునరుద్ధణ**

**1-9 వ.** హోషేయ వివాహం - పిల్లలు.

**పీఠిక.** హోషేయ ఇశ్రాయేలు ప్రదేశంలో నివసించినవారికి ప్రవచించాడని తలంచవచ్చు.

**2-3 వ.** దేవుని ఆజ్ఞ ప్రకారం గోమెరు అనే వ్యభిచారం చేసే స్త్రీని వివాహం చేసుకోవడం యెహోవాను విడిచి విగ్రహాలను పూజిస్తున్న ఇశ్రాయేలీయులకు సాదృశ్యము. పుట్టిన పిల్లల పేర్లు వారి ఆత్మీయ స్థితిని చూపించేవిగా ఉన్నాయి.

**4-5 వ.** పుట్టిన కుమారునికి 'దేవుడు విత్తును' అనే అర్థమిచ్చే యెజ్రెయేలు అనే పేరు దేవుని ఆజ్ఞవలన పెట్టాడు. దోషాన్నిబట్టి దేవుడు శిక్షను విత్తి ఇశ్రాయేలుకు రాజ్యం దక్కకుండా చేస్తానని సెలవిచ్చాడు.

**6-7 వ.** రెండవసారి కుమార్తె పుట్టినప్పుడు 'జాలినొందినది' అని అర్థమిచ్చే లోరుహామా అనే పేరు దేవుని ఆజ్ఞవలన పెట్టాడు. ఇశ్రాయేలువారిపై జాలిపడను గానీ యూదావారిని కనికరిస్తానని సెలవిచ్చాడు.

**8-9 వ.** మూడవసారి కుమారుడు పుట్టినపుడు 'నా జనులుకారు' అనే అర్థమిచ్చే లోఅమ్మీ అనే పేరు దేవుని ఆజ్ఞవలన పెట్టాడు. రోమా 9:6,8 - ఇశ్రాయేలు సంబంధులంతా

ఇశ్రాయేలీయులు కారు, శరీర  సంబంధులైన పిల్లలు దేవుని పిల్లలు కారు అనేమాట ప్రకారం ఆత్మీయ ఇశ్రాయేలీయులు కానివారి విషయమై ఈ మాట చెప్పబడినది.

**10-11 వ. పునరుద్ధరణ వాగ్దానం :** మహా ప్రభావంగల అంత్య దినాలలో ఇశ్రాయేలీయులు తాము జీవముగల దేవుని కుమారులమని చెప్పుకొని, యూదా వారితో కలసి తమందరిపై ఒకే ప్రధానిని కలిగి నివసిస్తారని సెలవిచ్చాడు. ఈ భాగంలో దేవుడిచ్చే ఐదు దీవెనలు ఉన్నాయి: 1)ఇశ్రాయేలీయుల జనసంఖ్య పరిమితమై లెక్కలేనంత సముద్రపు  ఇసుకవలె విస్తారం కావడం, 2) ఏ స్థలమందు వారు దేవుని ప్రజలు కాదు అనేమాట జనులు వారితో చెప్పుదురో ఆ స్థలమందే వారు జీవము గల దేవుని కుమారులైయుండుట, 3) ఇశ్రాయేలువారు, యూదావారు  ఏకంగా కూడుకోవడం, 4) తమపై ఒక్కరినే ప్రధానిగా నియమించుకోవడం, తామున్న దేశంలోనుండి యెజ్రెయేలు దినము బయలుదేరడం, 5) జాలి గుణం కలిగినవారు కావడం (2:1). ఏకంగా కలిగి ఉండి ఒకే ప్రధానిని కలిగియుండడం ఇతర భాగాలలో కూడా చెప్పబడినది.

“ప్రభువైన యెహోవా సెలవిచ్చునదేమనగా ఏయే అన్యజనులలో ఇశ్రాయేలీయులు చెదరిపోయిరో ఆయా అన్యజనులలో నుండి వారిని రక్షించి, వారు ఎచ్చటెచ్చట ఉన్నారో అచ్చటనుండి వారిని సమకూర్చి వారి స్వదేశములోనికి తోడుకొని వచ్చి వారికమీదట ఎన్నటికిని రెండు జనములుగాను రెండు రాజ్యములుగాను ఉండకుండునట్లు ఆ దేశములో ఇశ్రాయేలీయుల పర్వతముల మీద వారిని ఏకజనముగా చేసి, వారికందరికీ ఒక రాజునే నియమించెదను. నా సేవకుడైన దావీదు వారికి రాజవును, వారికందరికి కాపరి యొక్కడే యుండును, వారు నా విధులను అనుసరింతురు, నా కట్టడలను గైకొని ఆచరింతురు. నా సేవకుడైన దావీదు ఎల్లకాలము వారికి అధిపతియై యుండును” - యెహె 37:21-23.

## 2వ అధ్యాయం

వచనముల విభజన **- 5 + 8 + 3 + 4 + 3 = 23**

### అంశం : ప్రవక్త కుటుంబ జీవితం ద్వారా ఇశ్రాయేలీయుల పాపాలు, రానున్న శిక్షలు - అంత్యకాల అశీర్వాదాలు

**1-5 వ. వ్యభిచార మనసు కలిగిన భార్యతో పిల్లలు వాదించడం:** జాలి నొందనిది, నా జనులు కారను పేరు పెట్టినను ఇప్పుడు నాజనులని, జాలినొందినవారు అంటున్నాడు. ఇశ్రాయేలీయుల శేషము  అనగా వెయ్యి ఏళ్ళకాలంలో ఉండబోయే వారిని గూర్చి ఈ మాట చెప్పబడినది. ప్రస్తుతము ఇశ్రాయేలు ప్రజలను తమ విగ్రహారాధనను మానుకొనవలెనని, లేకపోతే దేవుడు వారిని దిగంబరులుగా చేసి  పాడుచేస్తాను అంటున్నాడు.

**6-13 వ. నిజదేవుని విడిచి బయలును పూజించినందువల్ల శిక్ష :** నిజదేవుని మరచి బయలును పూజించినందువల్ల వారిని శిక్షిస్తానని దేవుడు సెలవిస్తున్నాడు. సాదృశ్యంగా విటకాండ్ర వెంట వెళ్ళు భార్యగా ఈ భాగంలో వివరించి చెబుతున్నాడు.

**2:6 వ.** "దానికి ధాన్య ద్రాక్షారస తైలములను విస్తారమైన వెండిబంగారములను ఇచ్చిన వాడను నేనే యని విచారింపక ఇది నా విటకాండ్రగు విగ్రహములు నాకిచ్చిన జీతమని అది తన ద్రాక్షచెట్లను గూర్చి అంజూరపు చెట్లను గూర్చి చెప్పి వాటిని బయలు దేవతకు ఉపయోగపరచెను. అది నన్ను మరచిపోయి నగలు పెట్టుకొని శృంగారించుకొని బయలు దేవతలకు ధూపము వేసెను. దీని భావము దేవుడు ఇశ్రాయేలుకు వృక్షఫలములు, ధనమును ఇవ్వగా బంగారము వెండితో బయలుకు విగ్రహములను చేసి ధూపము వేసిరి.'

ఇశ్రాయేలీయులను పాలించిన 19 మంది రాజులు విగ్రహారాధికులే. విగ్రహములను వెంటాడడాన్నిబట్టి ఇశ్రాయేలును శిక్షిస్తానని దేవుడు చెప్పాడు. కనుక ధాన్యమును, ద్రాక్షారసమును వాటివాటి కాలములలో ఇవ్వకుండా దేవుడు ముండ్లకంచె దాని మార్గములకు అడ్డమువేసి అది తన విటకాండ్రగు బయలు కొరకు వెదకినను సహాయం దొరకకుండా చేయుదును అన్నాడు. ఇప్పుడు అది ఇప్పటికంటె పూర్వమే నా స్థితి బాగుగ నుండెను గనుక నేను తిరిగి నా మొదటి పెనిమిటియగు యెహోవా యొద్దకు వెళ్ళుదునను కొనునని యెహోవా వాక్కు ద్వారా సెలవిచ్చాడు. రోమా 6:23 లో చెప్పబడినట్లు పాపమునుబట్టి కొద్దిమంది మరణించినను శేషము నిత్యజీవమును స్వతంత్రించుకొంటారు.

**14-16 వ. దేవుడు ఇశ్రాయేలును తిరిగి ఆకర్షించడం:** దేవుడు ఇశ్రాయేలువారిని తిరిగి ఆకర్షించి భర్తగా ఉంటానని సెలవిస్తున్నాడు. "పిమ్మట దానిని ఆకర్షించి అరణ్యము లోనికి కొనిపోయి అక్కడ దానితో ప్రేమగా మాటలాడుదును; అక్కడనుండి దానిని తోడుకొనివచ్చి ఆకోరు (శ్రమగల) లోయ అనగా చెరలో శ్రమల ద్వారా నిరీక్షణ కలుగజేసెదను" అన్నాడు. బాల్యమును ఐగుప్తు దేశములో నుండి అది వచ్చినప్పుడు మా మాట వినినట్లు అది ఇచ్చట నుండి నా మాట వినును; అది ఇకమీదట బయలు దేవతల పేళ్ళను జ్ఞాపకమునకు తెచ్చుకొనకుండ నేను చేసెదను అన్నాడు. ఆ దినమున అనగా వేయి ఏండ్లకాలమున విల్లు ఖడ్గము యుద్ధము దేశములో ఉండకుండ మాన్పించి వారిని నిర్భయముగా నివసింపజేయుదును. నీవు నిత్యము నాకుండునట్లుగా నేను నీతినిబట్టి తీర్పుతీర్చుట వలన, దయాదాక్షిణ్యములు చూపుట వలనను నిన్ను ప్రధానము చేసికొని నా జనము కానివారితో మీరే నా జనమని నేను చెప్పగా వారు నీవే మా దేవుడవు అని ఇశ్రాయేలీయులు వేయి ఏండ్లకాలములో చెప్పుదురు.

**17-20 వ. నిబంధన చేయడం:** బయలుదేవత పేరు వారి నోటికి రాకుండచేసి వారితో నిబంధన చేస్తావని చెబుతున్నాడు.

**21-23 వ. వాగ్దానం:** ఇశ్రాయేలు మనవి, భూమ్యాకాశముల మనవి విని, భూమిపై ఇశ్రాయేలును నాటి, గతంలో జాలినొందనిదని సెలవిచ్చిన వారికి ఇక మీదట జాలి చూపించి, నా జనము కారని పలికినవారిని గూర్చి ఇప్పుడు నా జనులను చెప్పుదునని దేవుడు సెలవిస్తున్నాడు.

# 3వ అధ్యాయం

5 వచనాలు

## అంశం : హోషేయ భార్యను వ్యభిచారం నుండి విడిపించి చేర్చుకోవడం - ఇశ్రాయేలీయుల అంత్యకాల సమకూర్పు

**1-5 వ.** రెండవ అధ్యాయంలో ఇశ్రాయేలు విగ్రహారాధన చేసినప్పటికీ వారిని ఆకర్షించి, నిబంధన చేసి తన జనముగా చేసుకోవడానికి సాదృశ్యంగా హోషేయ వ్యభిచారంలో ఉన్న తన భార్యవద్దకు వెళ్ళి డబ్బులిచ్చి ఆమెను కొని (వెండి విమోచనకు గుర్తు) ఆకర్షించి, ఆమెతో నిబంధన చేసి తనదానిగా చేసుకోమని దేవుడు సెలవిచ్చినప్పుడు అలాగే చేశాడు. ఇశ్రాయేలు తరువాత విగ్రహారాధన మానివేసి, దినముల అంతంలో దేవుని అనుగ్రహం పొందుతుందని సెలవిచ్చాడు.

విగ్రహారాధననుబట్టి ఇశ్రాయేలీయులు చాల దినములు రాజు, అధిపతి లేక బలినర్పింపక యుండగా క్రీస్తు యేసు అలాటివారిని, విగ్రహారాధికులు అన్యులమైన మనలను ప్రేమించి 2000 సంవత్సరాల క్రితము ఈ లోకమునకు వచ్చి వెండి, అనగా విమోచన. విలువైన తన రక్తము కార్చి ఆ రక్తముతో మన పాపముల నుండి మనలను విమోచించాడు. దీనినే యిర్మీయా 31:3 ప్రకారం, దేవుడు శాశ్వత ప్రేమతో మనలను ప్రేమించాడని చెబుతున్నాము. అంత్యకాలము అంటే వేయి ఏళ్ళ పాలన ప్రారంభములో ఇశ్రాయేలీయులు తిరిగివచ్చి తమ దేవుడైన యెహోవా యొద్ద, తన రాజైన దావీదునొద్ద అనగా క్రీస్తునొద్ద విచారణ చేయుదురు. అందుకే బబులోను చెరనుండి వచ్చినది మొదలు నేటి దినములలో కూడా ఇశ్రాయేలీయుల మధ్య విగ్రహారాధన లేదు.

**4,5,6,7 అధ్యాయాలలో ఇశ్రాయేలీయుల నాలుగు పాపములు, వాటికి రానున్న శిక్షలు చెప్పబడ్డాయి.**

**4వ అధ్యాయం - అపనమ్మకత్వం - శిక్ష**

**5వ అధ్యాయం - అపవిత్రత - శిక్ష**

**6వ అధ్యాయం - అల్పమైన భక్తి - శిక్ష**

**7వ అధ్యాయం - అవివేకం - శిక్ష**

# 4వ అధ్యాయం

వచనముల విభజన – **5 + 3 + 3 + 3 + 5 = 19**

## అంశం : దేవుణ్ణి మరచి విగ్రహారాధికులై పాపం చేయడం – అపనమ్మకత్వం – శిక్ష

**1-5 వ. ప్రజల పాపములు – శిక్ష, నాశనము:** అబద్ధాలు, హత్యలు, దొంగతనం, వ్యభిచారం దేశమందున్నందున దేశమునకు కలిగిన శిక్షనుబట్టి దేశము బహుగా ప్రలాపిస్తున్నదని, పశువులు, పక్షులు, ప్రజలు క్షీణించుచున్నారని, తల్లియైన ఇశ్రాయేలును నాశనం చేస్తానని దేవుడు సెలవిస్తున్నాడు.

**6-11 వ. యాజకుల పాపములు – శిక్ష:** 1) యాజకులు ధర్మశాస్త్రమును మరచి నందువల్ల వారి కుమారులను దేవుడు మరచిపోతానన్నాడు. 2) కలిమి విస్తరించిన కొలది అధిక పాపము చేసినందున వారి ఘనతను నీచస్థితికి మారుస్తానన్నాడు. 3) యెహోవాను లక్ష్యపెట్టనందున భోజనము చేసినప్పటికీ తృప్తిలేక యుంటారన్నాడు. 4) యాజకులు విగ్రహారాధన, వ్యభిచారము చేస్తూ, మద్యము పుచ్చుకోవడాన్నిబట్టి శిక్షిస్తానన్నాడు.

**12-14 వ. ప్రజల విగ్రహారాధన-శిక్షగా నిర్మూలనం:** ప్రజలు తాము పెట్టుకొన్న కర్రల వద్ద జవాబు దొరుకుతుందని విచారించడానికి విగ్రహారాధన బట్టే వారికి అలాంటి వ్యభిచారపు మనసు కలుగుతుంది. అలా కుమార్తెలు, కోడళ్ళు వ్యభిచరిస్తారు. జనులు వేశ్యలతో సాంగత్యం చేసి వ్యభిచరించిన విగ్రహాలకు బలులు అర్పిస్తారు. అందును బట్టి జనమును నిర్మూలము చేస్తానని దేవుడు సెలవిస్తున్నాడు.

**15-19 వ. ఇశ్రాయేలు పాపం వివరాలు:** దాను, బేతేలులలో ఉన్న విగ్రహాలతో ఇశ్రాయేలు వేశ్యగా మారి వ్యభిచారం తీవ్రంగా జరిగించింది. యూదా అందులో పాలుపొందలేదు. కనుక యూదా వారికి ఇప్పుడు శిక్ష లేదు. కనుక దేవుడు (2రాజులు 19:35) ఒక దూతను పంపి అష్షూరు రాజైన సన్హెరీబు నుండి కాపాడాడు. ఇశ్రాయేలీయుల అధిపతులను సిగ్గుమాలి అవమానకరమైనవాటిని ప్రేమించారు. ఇశ్రాయేలును పరిపాలించిన 19 మంది రాజులంతా విగ్రహారాధికులే. సుడిగాలి జనులను చుట్టి నశింపజేసినట్టు జనులు సిగ్గునొంది వారి రాజులతో కూడా నశిస్తారని దేవుడు సెలవిస్తున్నాడు.

# 5వ అధ్యాయం

వచనముల విభజన – **7 + 8 = 15**

### అంశం : ఇశ్రాయేలీయులు అపవిత్రులు కావడం – రాబోయే శిక్ష

**1–7 వ. అపవిత్రులైన యాజకులు, ప్రజలు – రాబోయే శిక్ష:** యాజకులు, ప్రజలతోపాటు రాజులు కూడా విగ్రహారాధన చేస్తూ వ్యభిచార మనసు గలవారై యున్నారు (వ.4). తమ క్రియల అభ్యంతరాలు, వ్యభిచారాలను బట్టి దేవుని యొద్దకు తిరిగి రాలేక పోతున్నారు. ఇశ్రాయేలీయులలో రాజులందరు, యూదా రాజులలో ఆరుగురు రాజులు విగ్రహారాధికులుగా ఉన్నారు. కొంతకాలమైన తరువాత దేవుడు వారిద్దరినీ శిక్షిస్తానని సెలవిస్తున్నాడు.

**8–15 వ. అపవిత్రతను బట్టి దేవుని తీర్పు – రాబోయే శిక్ష:** ఇశ్రాయేలీయులు, యూదా ప్రజలు తనవైపు తిరగాలన్న దేవుని కోరిక, ఇశ్రాయేలువారి అపవిత్రతను బట్టి దేవుడు అధిక శ్రమను, ఉగ్రతను శిక్షాదినమునందు పంపగా ఇశ్రాయేలీయులు నాశనము అవుతారు. దేవుడు ఇశ్రాయేలీయులకు చిమ్మెట పురుగు వలె, యూదావారికి వత్సపురుగు వలె ఉండి వారికి పుండ్లను పుట్టించినపుడు వారు ఎక్కడికి వెళ్ళినా స్వస్థత దొరకదు. అందునుబట్టి వారు దేవునివైపు తిరుగుతారన్న ఆపేక్షను దేవుడు కనపరుస్తున్నాడు.

# 6వ అధ్యాయం

వచనముల విభజన – **3 + 3 + 3 + 2 = 11**

### అంశం : భక్తి నిలుపుకోలేని ఇశ్రాయేలు – శిక్ష

**1–3 వ. పశ్చాత్తాపానికి పిలుపు:** దేవుని శిక్షను జ్ఞాపకం చేసికొని దేవుడు స్వస్థ పరుస్తాడని, బాగుచేస్తాడని, బ్రతికించి స్వస్థపరుస్తాడని గుర్తించి ఆయన యొద్దకు తిరిగి వచ్చి అనుసరించాలని ప్రవక్త ద్వారా దేవుడు సెలవిస్తున్నాడు. ఈ విషయం గురించి యిర్మీయా 31:31–34 లో దేవుడు ఇలా చెబుతున్నాడు, "ఇదిగో నేను ఇశ్రాయేలువారితో, యూదావారితో క్రొత్త నిబంధన చేయు దినములు వచ్చుచున్నవి; అది ఐగుప్తులో నుండి వారిని తప్పించుటకై నేను వారిని చెయ్యిపట్టు కొనిన దినమున, వారి పితరులతో నేను చేసిన నిబంధన వంటిది కాదు; నేను వారి పెనిమిటినైనను వారు ఆ నిబంధనను భంగము చేసికొనిరి. ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలువారితోను, యూదావారితోను చేయబోవు నిబంధన యిదే, వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయము మీద దాని వ్రాసెదను; నేను వారికి దేవుడనై యుందును వారు నాకు జనులగుదురు; వారు మరిఎన్నడును యెహోవానుగూర్చి బోధ నొందము అని తమ పొరుగువారికి గాని తమ సహోదరులకు గాని ఉపదేశము చేయరు; నేను వారి దోషములను క్షమించి వారి పాపములను ఇక నెన్నడును జ్ఞాపకము చేసికొనను గనుక అల్పులేమి, ఘనులేమి అందరును నన్నెరుగుదురు; ఇదే యెహోవా వాక్కు."

**4-6 వ. నిలువని భక్తికి శిక్ష:** కాని ప్రస్తుతము ఇశ్రాయేలువారు, యూదావారు ప్రాతఃకాలమందు మంచు ఆవిరి అవుతున్నట్లు తమ భక్తి కోల్పోయారని, అందుకే తాను శిక్షించాలని సెలవిస్తున్నాడు.

**7-9 వ. నిబంధన మీరినందుకు శిక్ష:** ఆదాము నిబంధన (ఆజ్ఞాతిక్రమము) మీరినట్లు ఇశ్రాయేలువారు పాపము చేసినందువల్ల వారి పట్టణములు పాడయ్యాయని దేవుడు సెలవిస్తున్నాడు.

**10-11 వ. శిక్ష అనంతరం సమకూర్పు:** ఇశ్రాయేలు దేశములోని వ్యభిచారము, విగ్రహారాధన అనే పాపాలనుబట్టి దేవుడు వారిని శిక్షించి, తరువాత వారిని రప్పించి అంత్యకాలమున సమకూరుస్తానని సెలవిస్తున్నాడు. ఇశ్రాయేలును క్రీ.పూ. 721లో దేవుడు శిక్షించగా యూదా ప్రజలు చూశారు. కాని వారిలో మార్పు రానందువల్ల వారిని 70 సంవత్సరాలు బబులోనుకు బందీలుగా పంపించాడు (క్రీ.పూ. 606). శిక్ష, చెఱ అనంతరం తిరిగి యెరూషలేముకు రప్పించాడు (క్రీ.పూ. 536).

## 7వ అధ్యాయం

వచనముల విభజన - **3 + 4 + 4 + 5 = 16**

### అంశం : అవివేకులై అన్యజనులతో కలిసిపోయిన ఇశ్రాయేలీయులు

**1-3 వ. ఇశ్రాయేలు జరిగిస్తున్న పలురకాలైన పాపములు:** 1) మోసమును అభ్యాసం చేయడం, 2) కొల్లగాండ్రయి చొరబడడం, 3) బందిపోటు దొంగలై దోచుకోవడం, 4) దేవుడు చెడుతనాన్ని జ్ఞాపకం చేసుకోడనుకోవడం, 5) వారి చెడుతనాన్ని చూసి రాజు సంతోషించడం, 6) వారు కల్లలాడడాన్ని అధిపతులు విని సంతోషించడం.

**4-7 వ. శిక్ష తప్పదనే ఉపమానం:** వెంటనే శిక్ష రాకున్నప్పటికీ శిక్ష తప్పదు అని సూచించే రెండు ఉపమానాలు చెబుతున్నాడు. 1) రొట్టెలు కాల్చేవాడు ముద్దంతా పొంగే వరకు పొయ్యిని వేడిచేస్తూ ఆలస్యం చేసినప్పటికీ తరువాత వాటిని కాలుస్తాడు. 2) రొట్టెలు కాల్చేవాడు రాత్రంతా నిద్రించినా, ఉదయాన బహుగా మంట పెట్టునట్లు, దేవుడు మంటపెట్టగా ప్రజలు, న్యాయాధిపతులు, రాజులు కూలిపోతారు.

**8-11 వ. ఇశ్రాయేలు బుద్ధిలేని ప్రవర్తన:** ఇశ్రాయేలు ప్రజలు అన్యజనులతో కలిసిపోయి ఎవరూ త్రిప్పివేయలేని అప్పము వంటివారు, కాగా అన్యులు వారి బలమును మ్రింగివేసినప్పటికీ వారు గుర్తించలేదు. ఇంత జరిగినా దేవునివైపు తిరగక పిరికితనం గల గువ్వవలె ఉన్నారనీ, సహాయానికై దేవుణ్ణి ఆశ్రయించక ఐగుప్తీయులను, అష్షూరీయులను పిలుచుకొంటున్నారని సెలవిస్తున్నాడు.

**వ.12-16 దేవుడు తానే వారిపై వలవేసి శిక్షించడం:**

**12-13 వ.** వారు దేవుని విసర్జించి తప్పిపోయి తిరుగుబాటు చేసినందున వారికి ఈలాగు కలుగును అన్నాడు. 1) వారిపైని నా వల వేయుదును, 2) వారిని ఆకాశ పక్షులను ఒకడు కొట్టినట్లు పడగొట్టుదును, 3) వారిని శిక్షింతును, 4) వారికి శ్రమ కలుగును, 5) వారికి నాశనము కలుగును, 6) వారికి క్షయము సంభవించును. దేవుడు వారిని విమోచింప కోరియున్నను వారు దేవుని మీద అబద్ధములు చెప్పుచున్నారు.

**14-16 వ.** హృదయపూర్వకముగా దేవుని బతిమాలుకొనక దేవుని విసర్జించి వారు దుర్యోచనలు చేయుచు సర్వోన్నతుడైన వానియొద్దకు తిరుగక అక్కరకు రాని విల్లువలె నున్నారు; కనుక వారి యధిపతులు పలికిన గర్వపు మాటలలో చిక్కుపడి ఐగుప్తు దేశములో కత్తిపాలగుదురని దేవుడు చెప్పుచున్నాడు.

# 8వ అధ్యాయం

వచనముల విభజన - **4 + 6 + 4 = 14**

## అంశం : ధర్మశాస్త్ర నిబంధనను మీరినందువల్ల కలిగే శిక్షను గూర్చిన హెచ్చరిక

**1-4 వ. అతిక్రమమును బట్టి మందిరము, ప్రజల మీదికి రాబోయే శత్రువు.**
నిబంధన నతిక్రమించి ధర్మశాస్త్రమును మీరినందువల్ల పక్షిరాజువలె శత్రువు వస్తాదని, వారిని తరుముతాదని సెలవిస్తున్నాడు. అంటే, దేవుడు వారిని వేరే దేశానికి అష్షూరుకు బందీలుగా చెఱకొనిపోతాడని భావం. వారి విగ్రహారాధననుబట్టి, వారు యెహోవా యందు విశ్వాసం కోల్పోయి, దైవత్వం లేనివారుగా జీవించినందువల్ల వారు వెండిని (విమోచన), బంగారమును (దైవత్వం) కోల్పోయినవారుగా ఉన్నారు.

**5-10 వ. విగ్రహారాధన అనే పాపం:** ఇశ్రాయేలు దానులో, బేతేలులో దూడ విగ్రహాన్ని తయారుచేసుకొని పూజించినందువల్ల దేవుని కోపం వారిపై రగులుకొన్నది. కంసాలి చేసిన ఆ విగ్రహాన్ని దేవుడు చిన్నాభిన్నం చేస్తానంటున్నాడు. ఇశ్రాయేలు ప్రజలు అష్షూరీయుల దేవతలను పూజించడాన్ని బట్టి దేవుడే అష్షూరు వారిని పిలిచి వారి చేతికి ఇశ్రాయేలు వారిని బందీలుగా చెఱకు అప్పగిస్తానని సెలవిస్తున్నాడు.

**11-14 వ. ఇశ్రాయేలు పాపాలకు రానున్న శిక్ష:** ధర్మశాస్త్రమును మీరి అన్య దేవతలకు బలిపీఠములు కట్టినందువల్ల, దేవుడు వారి దోషములనుబట్టి వారిని శిక్షిస్తానని, తిరిగి శిక్షకు పంపుతానని సెలవిస్తున్నాడు. ఇశ్రాయేలు, యూదావారు తమ సృష్టికర్తను మరచి బలిపీఠములు కట్టించిన పట్టణాలను కాల్చివేస్తానని సెలవిస్తున్నాడు.

**2 రాజులు 18:11-12 -** "తమ దేవుడైన యెహోవా సెలవిచ్చిన మాట విననివారై ఆయన నిబంధనకును ఆయన సేవకుడైన మోషే ఆజ్ఞాపించిన దానంతటికిని లోబడక అతిక్రమించియుండిరి. అష్షూరురాజు పది గోత్రముల ఇశ్రాయేలువారిని అష్షూరు దేశము లోనికి తీసికొనిపోయి గోజాను నది దగ్గరనున్న హాలహుహాబోరు అను పట్టణములలోను మాదీయుల పట్టణములోను వారిని ఉంచెను."

**2 రాజులు 18:13-16 -** "రాజైన హిజ్కియా యేలుబడిలో పదునాలుగవ సంవత్సరమందు అష్షూరు రాజైన సన్హెరీబు యూదా దేశమందున్న ప్రాకారములు గల పట్టణములన్నిటి మీదికి వచ్చి వాటిని పట్టుకొనగా యూదా రాజైన హిజ్కియా అష్షూరు రాజు నొద్దకు దూతలను పంపి, నా వలన తప్పు వచ్చినదని చెప్పగా, అష్షూరు రాజు యూదా రాజైన హిజ్కియాకు ఆరు వందల మణుగుల వెండి, అరువది మణుగుల బంగారము జుల్మానాగా నియమించెను. కావున హిజ్కియా యెహోవా మందిరమందును, రాజనగరునందున్న పదార్థములలో కనబడిన వెండియంతయు అతనికిచ్చెను."

# 9వ అధ్యాయం

వచనముల విభజన **- 6 + 4 + 7 = 17**

**అంశం : రాబోయే శిక్షను బట్టి సంతోషించకూడదన్న హెచ్చరిక**

**ఇశ్రాయేలు ప్రజలు ఎందుకు సంతోషించకూడదో దానికి ఎనిమిది కారణాలు చెప్పాడు.**

**1-6 వ. ఇశ్రాయేలుపై రాబోయే శిక్ష:** 1) ఇశ్రాయేలీయులు నిజదేవుణ్ణి విసర్జించి అపవిత్రులైనందువల్ల అష్షూరు దేశానికి వెళ్ళి అపవిత్రమైన వాటిని తింటున్నందువల్ల సంతోషించకూడదని సెలవిచ్చాడు. 2) దాని నెరవేర్పుగా ఇశ్రాయేలువారంతా రెండు విడతలుగా ఉత్తర ప్రాంతాల ఇశ్రాయేలువారు క్రీ.పూ. 732లో, దక్షిణ ప్రాంతాల ఇశ్రాయేలు వారు క్రీ.పూ. 721లో అష్షూరుకు బందీలుగా చెఱగొనబడతారు కాబట్టి సంతోషించవద్దని సెలవిస్తున్నాడు.

**7-10 వ. రాబోయే శిక్ష దినము:** 3) ప్రజలు, ప్రవక్తలు దోషులయ్యారు. ప్రవక్తలు అవివేకులు, వెర్రివారు అయ్యారని ఇశ్రాయేలీయులు తెలుసుకుంటారు. ద్రాక్షల వలె, అంజూరములవలె వారు దేవునికి ముందుగా దొరికారు. ఇప్పుడు వారు లజ్జాకరమైన దేవతలకు తమను తాము అప్పగించుకొని పాపం చేసినందువల్ల దేవుడు వారిని శిక్షించనై యున్నాడని ఆ దినము బహు సమీపంగా ఉన్నదని కనుక సంతోషించవద్దని సెలవిచ్చాడు. దీని నెరవేర్పుగా క్రీ.పూ. 721 లో అష్షూరుకు వారిని బందీలుగా చెఱకు పంపించాడు.

**11-17 వ. రాబోయే శిక్షల వివరాలు:** 4) వారి కీర్తి పక్షివలె ఎగిరిపోతుంది. 5) వారు గర్భం ధరించరు. 6) పిల్లలను పెంచినవారు కూడా పుత్రహీనులౌతారు. 7) మందిరంలో నుండి వెలివేయబడతారు. 8) వారు దేశాన్ని విడిచి అన్యజనులతో తిరుగుతారు గనుక సంతోషించకూడదు అన్నాడు. దీని నెరవేర్పుగా క్రీ.శ. 732, 721లలో బందీలుగా చెఱకు వెళ్ళినవారు నేటికినీ జనాంగంగా తిరిగి రాలేక ప్రపంచమంతటిలో చెదరిపోయి ఉన్నారు.

# 10వ అధ్యాయం

వచనముల విభజన - **2 + 8 + 5 = 15**

## అంశం : ఇశ్రాయేలీయుల పాపం - రాబోయే శిక్షలను గూర్చిన మూడు ఉపమానాలు

**1-2 వ. ద్రాక్షచెట్టును గూర్చిన ఉపమానం:** ఇశ్రాయేలీయులు ఫలించిన ద్రాక్షచెట్టు వలె ఫలించారు. కానీ ఫలించినకొద్దీ విశేషంగా విగ్రహాలకు బలిపీఠాలు కట్టి దేవతా స్థంభాలను నిలిపారు. ఆ అపరాధాన్ని బట్టి దేవుడు ఇశ్రాయేలును శిక్షిస్తాడనీ, బలిపీఠాలను, దేవతా స్థంభాలను పాడుచేస్తానని సెలవిచ్చాడు.

**3-4 వ. రాజులేని భయపడని ప్రజలు అనే ఉపమానం:** 2రాజులు 17:3-4 - "ఇశ్రాయేలు మీదికి అష్షూరు రాజైన షల్మనేసెరు యుద్ధమునకు రాగా ఇశ్రాయేలు రాజైన హోషేయ అతనికి దాసుడై పన్ను ఇచ్చువాడాయెను. అతడు ఐగుప్తు రాజైన సోనొద్దకు దూతలను పంపి, పూర్వము తాను ఏటేట ఇచ్చుచు వచ్చినట్లు అష్షూరు రాజునకు పన్ను ఇయ్యక పోగా, హోషేయ చేసిన కుట్ర అష్షూరురాజు తెలిసికొని అతనికి సంకెళ్లు వేయించి బందీ గృహములో ఉంచెను. అష్షూరురాజు షోమ్రోను మీదికి వచ్చి మూడు సంవత్సరములు షోమ్రోనును ముట్టడించెను. ఇప్పుడైనను ఇశ్రాయేలు ప్రజలు దేవునికి లోబడక రాజు మనకు లేదు, 1) మనము యెహోవాకు భయపడము, 2) బందీ గృహములోనున్న రాజు మనకేమి చేయును అని వారు ఇప్పుడు చెప్పుకొనుట ఎంత దుఃఖకరము. పైగా, 1) అబద్ధ ప్రమాణములు చేయుట, 2) సంధులు చేయుట, 3) వట్టిమాటలు పలుకుచున్నారు. అందువలన భూమి చాళ్లలో విషపు కూర మొలచునట్లు దేశమునకు తీర్పులు పంపుదునని దేవుడు చెప్పుతున్నాడు.

**5-6 వ.** బేతావెనులో (బేతేలు) నున్న దూడ విషయమై, దాని ప్రభావము పోయెనని ప్రజలును, సంతోషించుచుండిన దాని అర్చకులును దుఃఖింతురు. దాని ప్రభావము పోయినను ఇశ్రాయేలు ప్రజలు నిజ దేవుని వైపు తిరుగక, దానిని అష్షూరు దేశములోనికి కొనిపోయి రాజునకు కానుకగా ఇత్తురని దేవుడు చెప్పుచున్నాడు.

**7-8 వ.** ఇశ్రాయేలు ప్రజలు దేవునికి భయపడనందున దేవుడు రెండు తీర్పులను పంపగా, 1) షోమ్రోను నాశనమగును, 2) దాని రాజులు లయమై, ముండ్లచెట్లును కంపయు, వారి బలిపీఠముల మీద పెరిగినను, ఇశ్రాయేలీయులు పర్వతములను చూచి, మమ్మును మరుగుచేయుడని, కొండలను చూచి మామీద పడుడని చెప్పుదురు కాని వారు దేవునికి భయపడరని చెప్పుచున్నాడు.

**9-10 వ.** ఇశ్రాయేలూ, గిబియా దినములనుండి పాపము చేయుచు వచ్చినందున వారు చేసిన రెండు దోషక్రియలను బట్టి, 1) వారిని బంధింతునని, 2) అన్యజనులు కూడి వారిమీదికి వత్తురని వారికి రెండు శిక్షలు చెప్పుచున్నాడు.

**11-15 వ. నూర్పునందు అభ్యాసము గలదైన పెయ్య అనే ఉపమానం:**
ఇశ్రాయేలు మెడకు కాడి కట్టుదును (చెఱకు పోవుట). దున్నించుటకు ఒకని (అష్షూరును) నియమింతునని సెలవిచ్చుచున్నాడు. అందువలన పశ్చాత్తాపపడి, నీతి ఫలించునట్లు విత్తనము వేసి ప్రేమయను కోత కోయుడని యెహోవాను వెదకుటకిదే సమయమని చెప్పుచున్నాడు.

**12-13 వ.** వారి ప్రవర్తన ఫలముగా పాపమనెడి కోత కోసియున్నారని, అబద్ధమునకు ఫలము పొందియున్నారని దేవుడు నీతి వర్షము కురిపించునట్లు ఇదివరకెన్నడును దున్నని బీడుభూమి దున్నుడి అని చెప్పుచున్నాడు.

**14-15 వ.** ఇశ్రాయేలు జనుల మీదికి అల్లరివచ్చి ప్రాకారములు గల పట్టణములు పిల్లలు తల్లులు నేలను పడవేయబడుదురని చెప్పుచున్నాడు. చేసిన ఘోరమైన దుష్టక్రియలను బట్టి బేతేలు నాశనమై ఇశ్రాయేలు రాజు కొట్టబడి నిర్మూలమగునని చెప్పుచున్నాడు.

# 11వ అధ్యాయం

వచనముల విభజన - **4 + 3 + 4 + 1 = 12**

**అంశం : హోషేయ వివాహం, పిల్లలు - ఇశ్రాయేలు అంత్యకాల పునరుద్ధణ**

**1-4 వ. బాలుడైన ఇశ్రాయేలు:** 10వ అధ్యాయంలో శిక్షింతునని చెప్పిన దేవుడు ఇప్పటి నుండి ప్రేమతో మాట్లాడడం గమనించగలము. ఇశ్రాయేలు బాలుడై ఐగుప్తులో ఉండగా దేవుడతణ్ణి ప్రేమించి, పిలిచి, చెయిపట్టి, నడక నేర్పి, కౌగలించి, స్వస్థపరచి, స్నేహబంధముతో ఆకర్షించి, మీద ఉన్న చెర అనే కాడి తీసివేసి అరణ్యములోను, కనాను లోను భోజనము పెట్టెను.

**యిర్మీయా 31:3 –** "చాలాకాలము క్రిందట యెహోవా నాకు ప్రత్యక్షమై శాశ్వతమైన ప్రేమతో నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక విడువక నీయెడల కృప చూపుచున్నాను" అన్నాడు. **యోహాను 13:1 –** "తాను ఈ లోకమునుండి తండ్రియొద్దకు వెళ్లవలసిన గడియ వచ్చెనని యేసు పస్కా పండుగకు ముందే యెరిగినవాడై, లోకములోనున్న తనవారిని ప్రేమించి, వారిని అంతమువరకు ప్రేమించెను" అని వ్రాయబడినది. **1యోహాను 3:16 –** "ఆయన మన నిమిత్తము తన ప్రాణము పెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము." **1యోహాను 4:10 –** "మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపములకు ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను; ఇందులో ప్రేమయున్నది." **యోహాను 3:16 –** "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను." ఇశ్రాయేలీయులు నశించుట దేవుని చిత్తము కాదు. దేవుడు తన ప్రేమనుబట్టి ముందుగా వారిని శిక్షించినప్పటికీ అంతములో వారిని సమకూర్చుటయే దేవుని చిత్తము. దేవుని ప్రేమను ఈ గ్రంథము చదివే వారందరూ గమనించాలి.

**5–7 వ. దేవుడు అష్షూరుకు చెరకు పంపించడం:** అష్షూరు రాజుతో యుద్ధము వస్తుందని, అష్షూరీయులు వారిని మ్రింగివేస్తారని సెలవిచ్చుచున్నాడు. అనేక పర్యాయములు ప్రవక్తల ద్వారా తనతట్టు తిరగాలని పిలుపు ఇచ్చినప్పటికీ, ఎవరునూ తిరుగుటకు ప్రయత్నము చేయడం లేదు. కనుక అష్షూరు చెరకు తప్పక పంపుదునని సెలవిచ్చుచున్నాడు.

**8–11 వ. దేవుడు శాశ్వతంగా విడిచిపెట్టడు:** ఉగ్రత అగ్నినిబట్టి శాశ్వతంగా శిక్షించక, దహించునంతగా కోపగించనని సెలవిచ్చుచున్నాడు. సింహగర్జనతో మరలా ప్రపంచమంతటా చెదరినవారిని అంత్యకాలములో పిలిచి సమకూర్చి దేశములో కాపుర ముందునట్లు చేస్తానని సెలవిచ్చుచున్నాడు.

**12 వ.** ప్రస్తుతం ఇశ్రాయేలువారు, యూదావారు అందరూ తిరుగుబాటు చేస్తారనీ, వారికి శిక్ష తప్పదనీ సెలవిచ్చుచున్నాడు.

# 12వ అధ్యాయం

వచనముల విభజన **- 6 + 4 + 4 = 14**

## అంశం : గాలిని మేస్తున్న ఎఫ్రాయీము (ఇశ్రాయేలు, వ.1) దేవుడు ప్రేమించి డేరాలో నివసింపచేయడం (వ.9)

**పశ్చాత్తాపమునకై పిలుపు:**

**1-2 వ.** ఎఫ్రాయిము గాలిని మేయుట నిష్ప్రయోజనము. తూర్పుగాలి అనగా తూర్పున నున్న అరేబియా ఎడారి నుండి వచ్చు ఇసుకతో కూడిన సుడిగాలి నివాసములను పడగొట్టి పొలములను ఇసుకచేత నింపును.కనుక ఎంతో నష్టము కలుగును. తూర్పు నుండి వచ్చు గాలి అనగా తూర్పుననున్న అష్షూరీయుల ద్వారా కలుగు నష్టము కావచ్చును. జనుల అష్షూరీయులతో సంధి చేసుకొనుట అపాయకరము. 2రాజులు 17:4 లో ఇశ్రాయేలురాజు దేవుని ఆశ్రయించక ఐగుప్తును ఆశ్రయించినట్లు అన్యులతో స్నేహము చేయుట మంచిది కాదు. పైగా వారు భక్తిహీనులై దినమెల్ల అబద్ధమాడుచు, బలాత్కారము చేయుట దేవునికి ఇష్టమైనవి కావు. యూదావారగు యాకోబు సంతతి వారిని కూడా వారి ప్రవర్తనను బట్టి ఆయన వారిని శిక్షించి, వారి క్రియలనుబట్టి వారికి ప్రతీకారము చేయును.

**3-4 వ.** తల్లిగర్భమందు యాకోబు తన సహోదరుని మడిమెను పట్టుకొని, మగసిరి గలవాడై దేవునితో పోరాడి జయమొందెను, అతడు కన్నీరు విడిచి బతిమలాడగా దేవుడు బేతేలులో అతనికి ప్రత్యక్షమై అక్కడ అతనితో మాటలాడెను.

**5-6 వ.** యెహోవా సైన్యములకధిపతి కనుక ఇశ్రాయేలు దేవునితట్టు తిరిగి కనికరమును, న్యాయమును అనుసరించుచు దేవునియందు నమ్మికయుంచాలి.

**7-10 వ. దేవుని కాపుదల:** ఎఫ్రాయిమువారు కనానీయుల వర్తకులవంటి వారై అన్యాయపు త్రాసును వాడి ఐశ్వర్యవంతులై, తన కష్టార్జితములో దీనినిబట్టి శిక్షకు తగిన పాపము తనలో నున్నట్లు ఎవరును కనుపరచలేరని ఎఫ్రాయిము అనుకొనుచున్నాడు. అయినను ఐగుప్తు దేశములోనుండి వారు వచ్చినది మొదలుకొని యెహోవా దేవుడుగా డేరాలలో కాపాడినట్లు ఇకను వారిని డేరాలలో నివసింపజేతును అన్నాడు.

**11-14 వ. రానున్న అవమానము:** ఆదికాండములో యాకోబు పాపముచేసి తప్పించు కొని సిరియా దేశమునకు వెళ్ళినను దేవుడచ్చుట యాకోబును కాపాడి ఆశీర్వదించెను. ఆలాగున తనను కాపాడిన దేవునికి కృతజ్ఞత చూపక, ఇశ్రాయేలు ఘోరమైన పాపము చేయుచున్నందున ఇప్పుడు అవమానపరతునని సెలవిచ్చుచున్నాడు.

# 13వ అధ్యాయం

వచనముల విభజన - **8 + 8 = 16**

## అంశం : అపరాధియై నాశనమొందిన ఇశ్రాయేలు (వ.1), అంత్యకాలమందు విమోచించి అభివృద్ధినిచ్చుట (వ.14-15)

**1-8 వ. ఇశ్రాయేలుకు పాపమునుబట్టి శిక్ష:** ఎఫ్రాయిము ఇశ్రాయేలీయులలో జనాంగముగా గొప్పవాడై బయలు దేవతను పూజించుట అను అపరాధము చేసి తన్నుతాను నాశనము చేసికొనునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. వెండితో విగ్రహములను పోతపోసి వాటికి పూజచేసి దూడలను ముద్దుపెట్టుకొనుచున్నారు. కనుక ఉదయమున కనబడు మేఘము వెంటనే గతించును, ప్రాతఃకాలమున కనబడు మంచు ఎండ తగులగా గతించు నట్లు వారు గతింతురని దేవుడు సెలవిచ్చుచున్నాడు. ఐగుప్తు దేశము నుండి వచ్చినది మొదలు దేవుడు వారిని కాపాడినను, గుర్తించక మనసున గర్వించి విగ్రహములను పూజించిన కారణమున దేవుడు వారిపట్ల రౌద్రము గల మృగము వలె వారిని నశింప జేతునని సెలవిచ్చుచున్నాడు.

**9-11 వ. తదుపరి ఫలాభివృద్ధి:** ఇశ్రాయేలు తాను చేసికొనిన దోషమునుబట్టి నిర్మూలమగునని చెప్పుచున్నాడు. సకల జనుల మర్యాద చొప్పున రాజు కావలెనని వారు కోరగా 1సమూ 15:1 లో సౌలున ముందుగా రాజుగా ఇచ్చాడు. తరువాత దావీదు, సొలొమోను పాలించిన తరువాత 19 మంది రాజులు 10 గోత్రముల ఇశ్రాయేలువారిని పాలించిరి. అందరూ విగ్రహారాధికులై దానులోను, బేతేలులో నున్న దూడలను పూజించి, అన్యుల విగ్రహములను ఆరాధించిరి.

**12-16 వ.** ఎఫ్రాయిము దోషము, పాపము చేసెనని దేవుడు చెప్పుచున్నాడు. కాని అంత్యకాలమందు రోమా 11:26-27 లో చెప్పబడినట్లు, దేవుడు వారి మనోనేత్రములు వెలిగించి విమోచించునని చెప్పుచున్నాడు. అంత్యకాలములో వారిని రక్షించి, 1కొరింథీ 15:55లో చెప్పినట్లు 'ఓ మరణమా, నీ ముల్లెక్కడ' అను సామెతవలె మరణ అపాయము నుండి తప్పించి మరణము లేకుండ చేతునని సెలవిచ్చుచున్నాడు. ఎఫ్రాయిమును ఫలాభివృద్ధి నొందించెదనని అంత్యకాలములో జరుగు విమోచన గూర్చి సెలవిచ్చుచున్నాడు. ప్రస్తుత కాలమందు దేవుని మీద వారు చేసిన తిరుగుబాటును బట్టి శిక్షింపనని దేవుడు చెప్పుచున్నాడు.

# 14వ అధ్యాయం

వచనముల విభజన **– 3 + 5 + 1 = 9**

**అంశం : ఇశ్రాయేలీయులను ప్రేమించి అంత్యకాలమున సమకూర్చుట**

**1–3 వ. పశ్చాత్తాపమునకై పిలుపు:** పాపముచే శిక్షపొంది కూలిన ఇశ్రాయేలు పశ్చాత్తాపముతో మాటలను సిద్ధపరచుకొని, యెహోవావైపు తిరిగి, అష్షూరు వారి నుండి రక్షించుమని దేవునికి మొరపెట్టవలెనని సెలవిచ్చుచున్నాడు. తన బలులపైన ఆధారపడక పెదవులతో చేయు ప్రార్థన ప్రభువు అంగీకరించునని ప్రార్థించమన్నాడు. గుఱ్ఱములు, యుద్ధములమీద ఆధారపడవద్దని చెప్పుచున్నాడు.

**4–8 వ. దేవుడు ఇచ్చు ఆశీర్వాదము:** దేవుడు వారిని గుణపరచి వారితో స్నేహించి, ప్రేమించి, చెట్టుకు మంచు వృద్ధినిచ్చునట్లు తాను ఉండునని, తామర పువ్వు నీటితో పెరిగినట్లు వారిని అభివృద్ధిపరతునని సెలవిచ్చుచున్నాడు. అనేకులు వారి నీడలో నివసించుటకై వచ్చెదరని సెలవిచ్చుచున్నాడు. ద్రాక్షాచెట్టువలె వికసింప జేసి, ద్రాక్షారసము వాసనవలె పరిమళింపచేయబడును అన్నాడు.

**9వ. ముగింపు:** నీతిమంతులు ఈ సంగతులను గ్రహించి దాచుకొందురు. కాని తిరుగుబాటు చేయువారికి ఈ సంగతులు అడ్డుగా నుండి వారిని తొట్రిల్లజేయును.

❄ ❄ ❄ ❄ ❄

# ౭. యోవేలు

**గ్రంథకర్త : యోవేలు** **కాలం : క్రీ.పూ. 750**

**మూఖ్యాంశం : యూదావారి పాపమునుబట్టి రాబోయే శిక్ష (1:1 - 2:17)**

**వాగ్దానము చేయబడిన విడుదల (2:18 - 3:21)**

**గ్రంథ ఉద్దేశం :** యోవేలు పెతూయేలు కుమారుడు. యెహోవా దేవుడు అనే అర్థమిచ్చే పేరు గలవాడు. యూదావారికి పాపమునుబట్టి రాబోయే శిక్ష, అనగా బబులోను 70 ఏళ్ళు చెరకు 70 (క్రీ.పూ. 606-536), తరువాత మాదీయ పారశీకుల క్రింద, గ్రీకుల క్రింద, రోమీయుల క్రింద ఉంటారని దేవుడు 1:1 నుండి 2:17 వరకు సెలవిచ్చుచున్నాడు. తరువాత అంత్యకాలమున విడుదల కలుగనున్న వాగ్దానమును గూర్చి 2:18 నుండి చివరివరకు సెలవిచ్చుచున్నాడు. ప్రభువు దినమును గూర్చి 1:15; 2:1; 2:11; 2:31; 3:14లలో ప్రస్తావించినందువల్ల రానున్న ప్రభువు దినము ఈ గ్రంథ ప్రాముఖ్యత. 2:28-32లో ఆత్మ కుమ్మరింపు అనగా అపో. 2వ అధ్యాయములో పెంతెకొస్తు దినమున పరిశుద్ధాత్మ భూలోకములో కుమ్మరించబడు సంగతి చెప్పబడినది. పెద్దలు, ప్రజలు దేవునివైపు తిరుగవలెననుట ముఖ్యాంశము.

**అధ్యాయాల విభజన :**

**I. 1వ అధ్యాయం :** పాపమునుబట్టి రాబోయే శిక్ష

**II. 2వ అధ్యాయం :** శత్రువు ద్వారా కలిగే నాశనము - వాగ్దానము చేయబడిన విడుదల

**III. 3వ అధ్యాయం :** అన్యజనులపై దేవుని తీర్పు - యూదుల సమకూర్పు, ఆశీర్వాదము

ఈ గ్రంథములో 73 వచనములు కలవు. సగభాగము, అనగా 37 వచనములు శిక్షను గూర్చి, మిగిలిన 36 వచనములు తరువాతి విడుదలను గూర్చి చెప్పాడు.

# 1వ అధ్యాయం

వచనముల విభజన - **7 + 6 + 7 = 20**

## అంశం : పాపమును బట్టి రాబోయే శిక్ష (తెగులు)

### 1-2:17 - పాపమును బట్టి రాబోయే శిక్ష

**1-7 వ. తెగులు వివరము:** ప్రజలకు, పెద్దలకు రానున్న తరములకు పాపమును బట్టి రానున్న తెగులును వివరించుచూ వారి పిల్లలకు కూడా చెప్పమన్నాడు. బబులోనువారు క్రీ.పూ. 606-536 వరకు, పారశీకులు క్రీ.పూ. 536-330 వరకు, గ్రీకులు 330 - 30 వరకు, రోమీయులు క్రీ.పూ. 30 నుండి క్రీ.శ. 485 వరకు పాలించి యూదులకు నష్టం కలిగించారు. దీనిని వరుసగా గొంగళిపురుగులు, మిడుతలు, పసరుపురుగులు, చీడపురుగులు తినివేయునట్లుగా వివరించెను. మిడుతలు దేశమందలి పంటను పాడుచేయ గలవు. మొదటిగా బలమైన జనాంగమైన బబులోనువారు సింహమును పోలియున్నది (దానియేలు 3:16). మత్తులైన యూదావారి పైబడి ద్రాక్షచెట్లు కొరక బడగా పాడైనట్లు యూదావారందరూ బబులోను వారి వలన పాడైపోవుదురని వివరించెను. ఈ విషయము యూదావారు తమ బిడ్డలకు, వారు తరువాత రాబోయే తరములకు, వారు తమ బిడ్డలకు తెలుపవలెనని యెహోవా సెలవిచ్చెను.

**8-13 వ. తెగులు వలన నష్టము:** 1) మందిర నష్టము-మందిరానికి రావలసిన నైవేద్యమ, పానార్పణములు ఆగిపోవుట అందునుబట్టి యాజకులు అంగలార్చవలెనని వ.9,13 లలో సెలవిచ్చుచున్నాడు. 2) పొలములు పాడైనందున రైతులు అంగలార్చుట, 3) ద్రాక్షచెట్లు, అంజూరచెట్లు, దానిమ్మచెట్లు, ఈతచెట్లు, జల్దరుచెట్లు, తోట చెట్లన్నియు వాడిపోయినట్లు, పలువిధములైన యూదా ప్రజలు వాడిపోయి సంతోషమును కోల్పోవుదురని, అందులకు ప్రార్థించవలెనని సెలవిచ్చుచున్నాడు.

**14-20 వ. తెగులునుబట్టి చేయవలసిన పని:** ఉపవాసదినము చాటించి, అందరిని సమకూర్చి, నష్టమును గుర్తించి ప్రజలు, పాలకులు, యాజకులు యెహోవాకు మొరపెట్టవలెనని సెలవిచ్చుచున్నాడు. పశువులు కూడా మేతస్థలములు కాలిపోయినందున మేతకై అల్లాడుచు మొరపెట్టుచున్నట్లు సెలవిచ్చుచున్నాడు.

# 2వ అధ్యాయం

వచనముల విభజన **– 3 + 8 + 6 + 3 + 7 + 5 = 32**

## అంశం : అన్యజనులతో కలిసిపోయిన ఇశ్రాయేలీయులు

**1 వ. ప్రవచన సమీప నెరవేర్పు:** పరిశుద్ధ పర్వతమగు సీయోను కొండపై బాకానాదముతో హెచ్చరిక చేయుచున్నాడు. దీనిని గూర్చి వ.14–20 లో చెప్పబడిన విషయములు గమనింతము. ఉపవాసదినము ప్రతిష్ఠించి యెహోవాను బతిమాలు కొనుటకై పెద్దలను దేశములోని జనులందరిని మందిరములో సమకూర్చమన్నాడు. మందిరములో సంతోషము ఉత్సవము నిలిచిపోయి, విత్తనము మంటి పెల్లల క్రింద కుళ్లిపోవుట, పైరు మాడిపోయి ధాన్యపుకొట్టు వట్టివగుట, ఆహారం నాశనమగుటను, ప్రార్థనలో జ్ఞాపకము చేసుకొనవలెనని చెప్పుచున్నాడు. మేతలేక పశువులు బహుగా మూల్గుచూ, ఆకలికి అల్లాడి, గొఱ్ఱెమందలు చెడిపోవుచున్నవని చెప్పు చున్నాడు. యెహోవాకే మొఱ్ఱపెట్టవలెనని, పశువులు దేవునికి మొఱ్ఱపెట్టుచున్నవని చెప్పుచున్నాడు.

**2–3 వ.** బలమైన గొప్ప సమూహముగా వారు వచ్చి ఏదేను వనమువలెనున్న భూమిని ఎడారివలె పాడుచేయుదురని, పట్టణమును, దేవాలయమును అగ్నిచేత కాల్చుదురని సెలవిచ్చుచున్నాడు. అలాగే జరుగుట 2దిన.లో గమనించుదము. 2దిన 36:14–19 – "అదియుగాక యాజకులలోను జనులలోను అధిపతులగువారు, విగ్రహములను పెట్టుకొని ద్రోహులై, యెహోవా మందిరమును అపవిత్రపరచిరి; యెహోవా ప్రవక్త ద్వారా వర్తమానము పంపుచువచ్చినను, ఆయన ప్రవక్తలను హింసించుచు, ఆయన వాక్యమును తృణీకరించగా నివారింపశక్యము కాకుండ యెహోవా కోపము ఆయన జనుల మీదికి రాగా ఆయన వారి మీదికి కల్దీయుల రాజును రప్పింపగా అతడు వారికి పరిశుద్ధ స్థలముగా నున్న మందిరములోనే వారి యవనులను, యువతులను, ముసలివారిని కనికరింపక చంపిరి. బబులోనురాజు దేవుని మందిరపు ఉపకరణములన్నిటిని, యెహోవా మందిరపు నిధుల లోనిదేమి, రాజు నిదులలోనేదేమి, అధిపతుల నిధులలోనిదేమి, దొరికిన ద్రవ్యమంతయు బబులోనునకు తీసికొనిపోయెను. అదియుగాక కల్దీయులు దేవుని మందిరము తగులబెట్టి, యెరూషలేము ప్రాకారమును పడగొట్టి, దానియొక్క నగరులన్నిటిని కాల్చివేసి, దానిలో ప్రశస్థమైన వస్తువులన్నిటిని బొత్తిగా పాడుచేసెను."

**4–11 వ. ప్రవచన అంత్యకాల నెరవేర్పు:** ఏడేండ్ల శ్రమలకాల చివర జరగబోవు యుద్ధముల వివరములను చూడగలము. 4–7 వచనాలలో ప్రస్తుతకాలమందు ప్రయోగింప బడు మిసైల్ (క్షిపణి) యుద్ధమువంటి యుద్ధముగా తలంచగలము. 7 వ. లో ఇటు అటు తిరుగకుండా వెళ్ళుట మిస్సైలె గురియొద్దకే వెళ్లుటను సూచించుచున్నది. 8వ. ఆయుధములు

మీద పడిననూ త్రోవ విడువవు. యాంటి మిస్సైల్స్ వాటిని ఆటంకపరచినను అవి త్రోవ విడువకుండా గురియొద్దకే వెళ్ళి నష్టము కలిగించును. 10 వ.లో వాటి భయముచేత భూమి కంపించుట, ఆకాశము తత్తరిల్లుట, సూర్యచంద్రులు తేజోహీనులగుట, నక్షత్రములు కాంతి తప్పుట, ఏడేండ్ల మహాశ్రమల కాలమున సంభవించునని ప్రకటన 6:12-16; 8:7-12లలో చూడగలము. అది యెహోవా భయంకర దినముగా చూచుచున్నాము.

**ప్రకటన 6:12-16** - "ఆయన ఆరవ ముద్రను విప్పినప్పుడు నేను చూడగా, పెద్ద భూకంపము కలిగెను. సూర్యుడు కంబళివలె నలుపాయెను. చంద్రబింబమంతయు రక్తవర్ణమాయెను. పెద్ద గాలిచేత ఊగులాడు అంజూరపు చెట్టునుండి అకాలపు కాయలు రాలినట్టు ఆకాశ నక్షత్రములు భూమిమీద రాలెను. మరియు ఆకాశమండలము చుట్టబడిన గ్రంథమువలెనై తొలగిపోయెను. ప్రతి కొండయు ప్రతి ద్వీపమును వాటివాటి స్థానములు తప్పెను. భూరాజులును, ఘనులును, సహస్రాధిపతులును, ధనికులును, బలిష్టులును, ప్రతి దాసుడును, ప్రతి స్వతంత్రుడును కొండ గుహలలోను బండల సందులలోను దాగుకొని సింహాసనానీసుడైయున్నవాని యొక్కయు గొఱ్ఱెపిల్ల యొక్కయు ఉగ్రత మహాదినము వచ్చెను; దానికి తాళజాలినవాడెవడు?"

**ప్రకటన 8:7-12** - "ఏడేండ్ల శ్రమల కాలమున మొదటి దూత బూర ఊదినప్పుడు రక్తముతో మిళితమైన వడగండ్లును అగ్నియు పుట్టి భూమిపైన పడవేయబడెను; అందువలన భూమిలో మూడవ భాగము కాలిపోయెను. చెట్లలో మూడవభాగము కాలిపోయెను, పచ్చగడ్డి యంతయు కాలిపోయెను. రెండవ దూత బూర ఊదినప్పుడు అగ్నిచేత మండుచ్ను పెద్ద కొండవంటిది ఒక్కటి సముద్రములో పడవేయబడెను. అందువలన సముద్రములో మూడవ భాగము రక్తమాయెను. సముద్రములోని ప్రాణము గల జంతువులలో మూడవ భాగము చచ్చెను. ఓడలలో మూడవ భాగము నాశనమాయెను. మూడవ దూత బూర ఊదినప్పుడు దివిటివలె మండుచున్న యొక పెద్ద నక్షత్రము ఆకాశమునుండి రాలి నదుల మూడవభాగము మీదను, నీటిబుగ్గల మీదను పడెను. ఆ నక్షత్రమునకు మాచిపత్రి యని పేరు. అందువలన నీళ్లలో మూడవభాగము మాచిపత్రి యాయెను; నీళ్లు చేదైపోయినందున వాటివలన మనుష్యులలో అనేకులు చచ్చిరి. నాలుగల దూత బూర ఊదినప్పుడు సూర్యచంద్ర నక్షత్రములలో మూడవ భాగము చీకటి కమ్మునట్లును, పగటిలో మూడవభాగమున సూర్యుడు ప్రకాశింపకుండునట్లును, రాత్రిలో మూడవ భాగమున చంద్ర నక్షత్రములు ప్రకాశింప కుండునట్లును వాటిలో మూడవ భాగము కొట్టబడెను."

**12-17 వ. రాబోయే శిక్ష నిమిత్తము పశ్చాత్తాపముతో ప్రార్థన:** రాబోయే శిక్ష నిమిత్తమై ఉపవాసదినము ప్రతిష్ఠించి, జనులు, పెద్దలు అందరు పెండ్లికుమార్తెతో సహా కూడిరావలెనని, యాజకులు బలిపీఠము దగ్గరచేరి కన్నీరు విడిచుచు హృదయము చించుకొని

యెహోవాకు మొరపెట్టవలెనని సెలవిచ్చుచున్నాడు. దేవుడు కరుణ, శాంతి, కృప గలవాడు కనుక మనసు తిప్పుకొని పశ్చాత్తాపపడి కీడు చేయక మానమని సెలవిచ్చుచున్నాడు.

**18-20 వ. యెహోవా జాలిపడుట:** ప్రార్ధనలకు జవాబుగా దేవుడు రోషము తెచ్చుకొని అన్యజనులలో తన జనులను అవమానపరచక హెచ్చించెదనని సెలవిచ్చుచున్నాడు. సమీప నెరవేర్పుగా బబులోను చెరనుండి క్రీ.పూ. 536లో విడిపించాడు. అంత్యకాల నెరవేర్పుగా ఏడేండ్ల శ్రమకాలము చివర విడిపించును.

**21-27 వ. దేశ ప్రజలకు దేవుని వాగ్దానము: A.** దేవుడు గొప్ప కార్యములు చేయునని, 1) దేశము, 2) పశువులు, 3) సీయోను జనులు ఉత్సహించి సంతోషించ వలెనన్నాడు. **B.** పశువులకు గడ్డిబీళ్ళు మొలచి అన్ని విధములైన చెట్లు ఫలించును గనుక పశువులు భయపడవలదని సెలవిచ్చెను. **C.** తొలకరి వర్షమును కడవరి వర్షమును కురిపింతునని కొట్లలో ధాన్యముండునని, క్రొత్త తైలము గానుగలపై కురిపింతునని కడుపార తిని తృప్తిపొందుదురని, 1:4లో దేవుని మహా సైన్యమగు పురుగులు తినివేసిన సంవత్సరముల పంటను మరలా ఇత్తునని సెలవిచ్చుచున్నాడు. యూదావారిక సిగ్గుపడక దేవుణ్ణి తమ మధ్య కలిగి జీవింతురని సెలవిచ్చుచున్నాడు. దీని సమీప నెరవేర్పుగా బబులోను చెర నుండి విడుదలను, తమ ఇండ్లను, మందిరమును కట్టుకొనుట, మరియు అంత్యకాల నెరవేర్పును వేయి ఏండ్లకాలమును వ.28-32 లలో చూడగలము.

**28-32 వ. అంత్యదినాలలో అందరిమీద ఆత్మ కుమ్మరింపు:** అంత్యదినాలలో అందరి మీద ఆత్మకుమ్మరింపు అపొ.కా. 2:17-20లో చెప్పబడినట్లు పెంతెకొస్తు దినాన ఆత్మ కుమ్మరింపబడినది. అంత్యమున ప్రకటన 8:7-12లో చెప్పబడిన సూర్యచంద్రులు చీకటిగా మారుటయను నెరవేర్పును చూడగలము.

**అపొ.కా. 2:17-20 -** "అంత్య దినములయందు నేను మనుష్యులందరి మీద నా ఆత్మను కుమ్మరించెదను. మీ కుమారులును మీ కుమార్తెలును ప్రవచించెదరు. మీ యవనులకు దర్శనములు కలుగును. మీ వృద్ధులు కలలు కందురు; ఆ దినములలో నా దాసులమీదను, నా దాసురాండ్ర మీదను నా ఆత్మను కుమ్మరించెదను. వారు ప్రవచించెదరు. పైన ఆకాశమందు మహత్కార్యములను క్రింద భూమిమీద సూచక క్రియలను రక్తమును అగ్నిని పొగ ఆవిరిని కలుగజేసెదను. ప్రభువు ప్రత్యక్షమగు ఆ మహాదినము రాకమునుపు సూర్యుడు చీకటిగాను చంద్రుడు రక్తముగాను మారుదురు."

# 3వ అధ్యాయం

వచనముల విభజన – **8 + 7 + 6 = 21**

## అంశం : అన్యజనులపై దేవుని తీర్పు - యూదుల సమకూర్పు - ఆశీర్వాదము

**1-8 వ. అన్యజనులపై దేవుని తీర్పు:** యూదావారిని, యెరూషలేమువారిని అంత్య కాలమున, అనగా ఏడేండ్ల శ్రమల తరువాత విడిపించుటను గూర్చినవి. యూదా వారిని విడిపించు కాలమున అన్యజనులందరిని యెహోషాపాతు లోయలోనికి తోడుకొని పోవును. యూదావారిని తూరు, సీదోను, ఫిలిష్తీయవారు శత్రువులకు అమ్మినందున వారందరితో యుద్ధము చేసి వారినందరిని శిక్షింతునని దూరదేశములకు అమ్మివేతునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. యెహోషాపాతు లోయలో యేసుక్రీస్తు నోట నుండి వచ్చు ఖడ్గముతో అన్యజనులు అందరు వధింపబడుదురని ప్రకటన 19:21లో చెప్పబడిన ప్రకారము నెరవేరును.

**9-15 వ. అన్యజనులను యెహోషాపాతు లోయలో తీర్పుతీర్చుట:** ప్రభువైన దేవుడు యెహోషాపాతు లోయకు అన్యజనులందరిని రమ్మని యుద్ధమునకు సిద్ధపడుమని పిలుచుచున్నాడు. తీర్పు తీర్చు యెహోవా దినము వచ్చినదని సూర్యచంద్రులు తేజోహీనులైరని సెలవిచ్చుచున్నాడు. దీని నెరవేర్పు **ప్రకటన 18:12**లో కలదు. "నాలుగవ దూత బూర ఊదినప్పుడు సూర్యచంద్ర నక్షత్రములలో మూడవ భాగము చీకటి కమ్మునట్లును, పగటిలో మూడవ భాగమున సూర్యుడు ప్రకాశింపకుండునట్లును, రాత్రిలో మూడవ భాగమున సూర్యచంద్ర నక్షత్రములు ప్రకాశింపకుండునట్లును వాటిలో మూడవభాగము కొట్టబడెను."

**ప్రకటన 16:12 –** "ఆరవ దూత తన పాత్రను యూఫ్రటీసు అను మహానది మీద కుమ్మరింపగా తూర్పునుండి వచ్చు రాజులకు మార్గము సిద్ధపరచబడునట్లు దాని నీళ్ళు యెండిపోయెను. మరియు ఆ ఘటసర్పము, క్రూరమృగము, అబద్ధ ప్రవక్తల నోర్ల నుండి కప్పలవంటి మూడు అపవిత్రాత్మలు బయలువెడలగా చూచితిని. అవి సూచనలు చేయునట్టి దయ్యముల ఆత్మలే; అవి సర్వాధికారియైన దేవుని మహాదినమున జరుగు యుద్ధమునకు లోకమంతట ఉన్న రాజులను పోగుచేయవలెనని వారియొద్దకు వెళ్ళి హెబ్రీభాషలో హర్‌మెగిద్దోనను చోటుకు వారిని పోగుచేసెను."

**ప్రకటన 9:11-15 –** "మరియు పరలోకము తెరువబడియుండుట చూచితిని. అప్పుడిదిగో, తెల్లని గుఱ్ఱమొకటి కనబడెను. దానిమీద కూర్చుండియున్నవాడు నమ్మకమైన వాడును, సత్యవంతుడును అను నామము గలవాడు. ఆయన నీతినిబట్టి విమర్శ చేయుచు

యుద్ధము జరిగించుచున్నాడు. పరలోకమందున్న సేనలు శుభ్రమైన తెల్లని నారబట్టలు ధరించుకొని తెల్లని గుఱ్ఱములెక్కి ఆయనను వెంబడించుచుండిరి. జనములను కొట్టుటకై ఆయన నోటనుండి వాడిగల ఖడ్గము బయలువెడలుచున్నది. ఆయన యినుపదండముతో వారిని ఏలును; ఆయన సర్వాధికారియగు దేవుని తీక్షణమైన ఉగ్రత అను మద్యపుతొట్టి త్రొక్కును."

**ప్రకటన 19:18-21 –** "అతడు గొప్ప శబ్దముతో ఆర్భటించి, రండి, రాజుల మాంసమును సహస్రాధిపతుల మాంసము బలిష్ఠుల మాంసము గుఱ్ఱముల మాంసము వాటిమీద యుద్ధము చేయుటకై ఆ క్రూరమృగము భూరాజులు వారి సేనలు కూడియుండగా చూచితిని. అప్పుడా మృగము, దానియెదుట సూచక క్రియలు చేసి దాని ముద్రను వేయించుకొనినవారిని ఆ మృగపు ప్రతిమకు నమస్కరించినవారిని మోసపరచిన ఆ అబద్ధ ప్రవక్తయు పట్టబడి వారిద్దరు పట్టబడి అగ్నిగుండములో వేయబడిరి. కడమవారు గుఱ్ఱముమీద కూర్చున్న వాని నోటనుండి వచ్చిన ఖడ్గముచేత వధించబడిరి; వారి మాంసమును పక్షులన్నియు కడుపార తినెను."

**16-18 వ. యూదుల సమకూర్పు:** యెహోవా యెరూషలేములో నుండి తన స్వరము వినిపించి, తన జనులను సమకూర్చి, ఆయన వారికి ఆశ్రయముగా, దుర్గముగాను ఉండును. అన్యులు దానిలో సంహరింపకుండ యెరూషలేము పరిశుద్ధ పట్టణముగా ఉండును. యెహోవా ప్రతిష్ఠితమగు సీయోను పర్వతమందు నివసించును. ఆ దినములలో నీటి ఊట యెహోవా మందిరములోనుండి ఉబికి పారి షిత్తీములోయను తడుపగా, యూదా నదులన్నిటిలో నీళ్లుపారును. పర్వతములలోనుండి క్రొత్త ద్రాక్షరసము పారును, కొండలలోనుండి పాలు ప్రవహించును."

**19-21 వ. అన్యజనులను సంహరించి యూదులను స్థిరపరచును:** అన్యజనులను సంహరించి యూదులను స్థిరపరచును. ఐగుప్తీయులు ఎదోమీయులు యూదావారి మీద బలాత్కారముచేసి తన దేశములలో నిర్దోషులగు వారికి ప్రాణహాని కలుగజేసిరి. గనుక ఐగుప్తు దేశముపాడై ప్రాణదోషమునకై వారికి దేవుడు ఈలాగు ప్రతికారము చేయును. అయితే యూదా దేశములోను, యెరూషలేములోను నివాసులు నిత్యముందురు యెహోవా వారితో సీయోనులో నివాసిగా వసించును.

**యోవేలు 31:33-34 –** "ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలువారితో యూదా వారితో చేయబోవు నిబంధన యిదే. వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచి వారి హృదయము మీద దాని వ్రాసెదను. నేను వారికి దేవుడనైయుందును, వారు నాకు జనులగుదురు. నేను వారి దోషములను క్షమించి వారి పాపములను ఇకనెన్నడును జ్ఞాపకము చేసికొనను గనుక అల్పులేమి, ఘనులేని అందరును నన్నెరుగుదురు" అని అన్నాడు.

# 3. ఆమోసు

**గ్రంథకర్త : ఆమోసు** **కాలం : క్రీ.పూ. 750**

**మూఖ్యాంశం : దోషమునుబట్టి శిక్ష (1:3)**

**గ్రంథ ఉద్దేశం :** ఆమోసు అను పేరుకు 'భారము భరించువాడు' అని అర్థం. ఆమోసు పశువులకాపరి. ఇతడు సామాన్య కుటుంబానికి చెందినవాడు. 7:24 లో తాను ప్రవక్తను కానని, ప్రవక్త యొక్క శిష్యుడను కానని చెప్పుచున్నాడు. సామాన్యుడైన ఆమోసును దేవునికి విధేయుడడైనందున దేవుడు ప్రవక్తగా వాడుకొన్నాడు. ఈనాటి సేవకులకు ఎంత మాదిరి! ప్రవక్తలైన హోషేయ, మీకా, యెషయాల కాలమందు ఇతడు ప్రవచించాడు. 1) మొదటి 2 అధ్యాయాలలో పొరుగు దేశాలపై, యూదా, ఇశ్రాయేలుపై రానున్న శిక్షలు కలవు, 2) యూదా ఇశ్రాయేలులో ఉన్న పాపమునుబట్టి రానున్న శిక్షలు, దేవునివైపు తిరుగుటను తెలుపు వివరమైన వర్తమానములను 3-4 అధ్యాయాలలో చెప్పుచున్నాడు. 3) రానున్న శ్రమలను బట్టి యెహోవాను వెదకవలసిన అవసరతను గూర్చి 5,6 అధ్యాయాలలో చెప్పుచున్నాడు. 4) 7-9 అధ్యాయాలలో రానున్న శిక్షను గూర్చి ఆమోసుకు కలిగిన 5 దర్శనములను వివరించుచున్నాడు. ఆమోసు యూదా రాజైన ఉజ్జీయా దినములలో ప్రవచించాడు.

**అధ్యాయాల విభజన : 2 + 2 + 2 + 3 అధ్యాయాలు**

యోవేలు గ్రంథమందు శత్రువులకు రానున్న తీర్పులను గురించి ఎక్కువగా చెప్పబడినది. కాని ఈ గ్రంథంలో ఇశ్రాయేలుకు రానున్న శిక్షలను గూర్చి ఎక్కువగా చెప్పబడుచున్నది.

**I. 1-2 అధ్యా. : పొరుగు దేశాలపై, యూదా, ఇశ్రాయేలీయులపై రానున్న దేవుని శిక్ష**

**1 అధ్యా.** పొరుగుదేశాలపై రానున్న దేవుని శిక్ష

**2 అధ్యా.** యూదా, ఇశ్రాయేలీయులపై రానున్న దేవుని శిక్ష

**II. 3-4 అధ్యా. : పాపమునుబట్టి శిక్ష - దేవునితట్టు తిరుగుటకు ఆహ్వానము**

**3 అధ్యా.** రానున్న తీర్పుల గూర్చి ఆలకించవలసిన వర్తమానములు.

**4 అధ్యా.** పాపమునకు రానున్న శిక్షలను చూసి దేవునివైపు తిరుగుటకైన ఆహ్వానము.

**III. 5-6 అధ్యా.: రానున్న శ్రమలను బట్టి యెహోవాను వెదకవలసిన అవసరత**

**5 అధ్యా.** యెహోవాను వెదకవలసిన అవసరతను గూర్చి ఆలకించవలసిన వర్తమానము

**6 అధ్యా.** ఇశ్రాయేలీయుల పెద్దలకు రానున్న శ్రమలను గూర్చి విచారించవలసిన వర్తమానము

**IV. 7-9 అధ్యా: శిక్షను గూర్చిన అయిదు దర్శనములు**

**7 అధ్యా.** మిడుతలు, అగ్ని, మట్టపుగుండును గూర్చిన మూడు దర్శనములు

**8 అధ్యా.** వేసవి కాలపు పండ్లగంపను గూర్చిన నాలుగవ దర్శనము

**9 అధ్యా.** బలిపీఠముపై నిలిచిన యెహోవాను గూర్చిన అయిదవ దర్శనము

# 1వ అధ్యాయం

వచనముల విభజన **– 2 + 3 + 3 + 2 + 2 + 3 = 15**

## అంశం : దోషమునుబట్టి పొరుగు దేశాలపై రానున్న శిక్షలు

**1-2 వ. పీఠిక**

**3-5 వ. సిరియనులకు పాపమునుబట్టి శిక్ష :** పంటను దుళ్ళగొట్టి ఇనుము పనిముట్లతో ఇశ్రాయేలును సిరియనులు నూర్చినందున, సిరియా రాజధానియగు దమస్కు నగరును, వారి మందిరమును అగ్నితో కాల్చుదునని సిరియనులను చెరకు పంపుదునని సెలవిచ్చుచున్నాడు. దీని నెరవేర్పుగా 2రాజులు 16:9 లో అష్షూరురాజు దమస్కు ప్రజలను చెరగొనిపోయాడు.

**6-8 వ. ఫిలిష్తీయులకు పాపమునుబట్టి శిక్ష:** ఫిలిష్తీయులు ఇశ్రాయేలీయులను చెరపట్టి ఎదోమీయుల కప్పగించెదమని కొనిపోయిరి. 2దిన 21:16; యోవేలు 3:3-5 లలో వివరములు కలవు. ఆ దోషమునుబట్టి ఫిలిష్తీయుల ముఖ్య పట్టణమైన గాజా మీద అగ్నివేసి దాని నగరులను కాల్చివేసిరి. ఇశ్రాయేలును అష్షూరీయులు శ్రమపెట్టగా వారి దోషము నిమిత్తము ఫిలిష్తీయులను శిక్షింతునని సెలవిచ్చుచున్నాడు.

**9-10 వ. తూరుకు పాపమునుబట్టి శిక్ష:** తూరువారు ఇశ్రాయేలీయులను పట్టి ఎదోమీయులకు అప్పగించుటనుబట్టి తూరు ప్రాకారము మీద అగ్నివేసి దాని నగరులను దహింతునని సెలవిచ్చుచున్నాడు.

**11-12 వ. ఎదోముకు పాపమునుబట్టి శిక్ష:** ఎదోమీయులు ఎడతెగని కోపముతో సహోదరులైన ఇశ్రాయేలును చీల్చినందున ఎదోమీయులు మూడు నాలుగుసార్లు చేసిన దోషమునుబట్టి ఎదోము ప్రాకారములు, నగరులపై అగ్ని వేతునని సెలవిచ్చు చున్నాడు.

**13-15 వ. అమ్మోనుకు పాపమునుబట్టి శిక్ష:** అమ్మోనీయులు ఇశ్రాయేలీయులపై జాలిచూపక వారి సరిహద్దులో ప్రవేశించి గర్భిణులను సైతము లెక్కచేయక చంపినందున వారి మూడు నాలుగు దోషములనుబట్టి వారి నగరులను, ప్రాకారములను అగ్నివేసి కాల్చుదునని సెలవిచ్చుచున్నాడు.

# 2వ అధ్యాయం

వచనముల విభజన – **3 + 2 + 3 + 4 + 4 = 16**

## అంశం : యూదా ఇశ్రాయేలుపై రానున్న శిక్షలు

**1-3 వ. మోయాబీయులకు రానున్న శిక్ష:** మోయాబీయులు ఎదోము రాజు ఎముకలను కాల్చి సున్నము చేసినందున మోయాబును దహించి వేతునని, నిర్మూలము చేతునని సెలవిచ్చుచున్నాడు.

**4-5 వ. యూదాకు దోషమునుబట్టి రానున్న శిక్ష:** యూదావారు తన పితరుల ననుసరించి అబద్ధములను చేపట్టి మోసపోయి, ధర్మశాస్త్రమును విసర్జించి, దేవుని విధులు గైకొననందున యూదావారి మీద అగ్నివేసి ముఖ్యపట్టణమగు యెరూషలేమును, ఇతర నగరులను దహించి వేతునని సెలవిచ్చుచున్నాడు. వివరముగా ప్రవచన నెరవేర్పును 2దిన 36:11-20లో చూతుము.

**2దిన 36:16-19 –** "పెందలకడ లేచి పంపుచు వచ్చినను వారు దేవుని దూతలను ఎగతాళి చేయుచు, ఆయన వాక్యములను తృణీకరించుచు, ఆయన ప్రవక్తలను హింసించుచు రాగా, నివారింప శక్యము కాకుండ యెహోవా కోపము ఆయన జనుల మీదికి వచ్చెను. ఆయన వారిమీదికి కల్దీయుల రాజును రప్పింపగా అతడు వారికి పరిశుద్ధ స్థలముగానున్న మందిరములోనే వారి యవనులను ఖడ్గముచేత సంహరించెను. అతడు యవనులయందైనను, యువతుల యందైనను, ముసలివారియందైనను, నెరసిన వెండ్రుకలు గలవారియందైనను కనికరింపలేదు. దేవుడు వారినందరిని అతని చేతికప్పగించెను. మరియు బబులోనురాజు పెద్దవేమి, చిన్నవేమి దేవుని మందిరపు ఉపకరణములన్నిటిని, యెహోవా మందిరపు నిధులలోనిదేమి రాజు నిధులలోనిదేమి అధిపతుల నిధులలోనిదేమి, దొరికిన ద్రవ్యమంతయు బబులోనునకు తీసికొనిపోయెను. అదియుగాక కల్దీయులు దేవుని మందిరమును తగులబెట్టి, యెరూషలేము ప్రాకారమును పడగొట్టి, దానియొక్క నగరులన్నిటిని కాల్చివేసిరి. దానిలోని ప్రశస్థమైన వస్తువులన్నిటిని బొత్తిగా పాడుచేసిరి."

**6-8 వ. ఇశ్రాయేలుకు దోషమునుబట్టి రానున్న శిక్ష:** ఇశ్రాయేలు ఆత్మీయ, నైతిక పతనము–ఇశ్రాయేలు ఆత్మీయముగా దిగజారి విగ్రహారాధికులైరి. నీతిమంతులను అమ్ముట, పాదరక్షలకై పేదవారిని అమ్ముట నైతిక పతనమునకు కారణములు. దరిద్రులను అవమాన పరచుట, తాకట్టు సొమ్మును తిరిగి ఇవ్వకుండుట వంటి పనులు జరిగించుట నైతిక పతనమని దేవుడు సెలవిచ్చెను.

**9-12 వ. ఇశ్రాయేలుకు దేవుడు చూపిన ప్రేమ:** ఇశ్రాయేలీయులు భక్తిహీనులైనను, వారిని ఐగుప్తు నుండి విడిపించి 40 ఏండ్లు అరణ్యములో కాపాడి, బలిష్టులైన అమోరీయులను సంహరించి, పాలస్తీనాను ఇశ్రాయేలుకిచ్చిన సంగతి ద్వారా దేవుడు తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు.

**13-16 వ. దేవుని ప్రేమను గుర్తించనందున రానున్న శిక్ష:** దేవుని ప్రేమగల చర్యలను ఇశ్రాయేలు గుర్తించనందున శిక్షింతునని తెలుపుచున్నాడు. పంటచేని మోపులను అణగద్రొక్కునట్లు నేను మిమ్మును అణగద్రొక్కుదునని సెలవిచ్చుచున్నాడు. ఇశ్రాయేలును దేవుడు శిక్షించిన వివరములు 2రాజులు 17:5-18 లలో కలవు.

**2రాజులు 16:5-7 -** "అష్షూరురాజు దేశమంతటిమీదికి షోమ్రోను మీదికిని వచ్చి మూడు సంవత్సరములు షోమ్రోనును ముట్టడించెను. హోషేయ ఏలుబడిలో తొమ్మిదవ సంవత్సరమందు అష్షూరురాజు షోమ్రోను పట్టణమును పట్టుకొని ఇశ్రాయేలువారిని అష్షూరు దేశములోనికి చెరగొనిపోయి గోజాను నది దగ్గరనున్న హాలహు హాబోరు అను స్థలములందును మాదీయుల పట్టణములలోను వారిని ఉంచెను. ఎందుకనగా ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశములో నుండి, ఐగుప్తురాజైన ఫరోయొక్క బలము క్రిందనుండి, తమ్మును విడిపించిన తమ దేవుడైన యెహోవా దృష్టికి పాపముచేసి ఇతర దేవతలయందు భయభక్తులు నిలిపిరి."

# 3వ అధ్యాయం

వచనముల విభజన **- 2 + 6 + 2 + 5 = 15**

## అంశం : రానున్న తీర్పుల గూర్చి ఆలకించవలసిన వర్తమానము

**1-2 వ. పీఠిక - దోషమునుబట్టి శిక్ష:** ఇశ్రాయేలుపై కరుణ కలిగి ఐగుప్తునుండి విడిపించి కనానుకు రప్పించిననూ ఇశ్రాయేలు మనసున నుంచక దోషము చేసినందున శిక్షింతునని సెలవిచ్చుచున్నాడు.

**3-8 వ. పాపమునుబట్టి రానున్న శిక్షల గూర్చిన జవాబుతో కూడిన 7 ప్రశ్నలు:** 1) సమ్మతి లేకుండా ఇద్దరు కూడి నడుతురా? 2) ఎర దొరకకుండా సింహము అడవిలో గర్జించునా? 3) ఏమియు పట్టుకొనకుండా సింహము గుహలో బొబ్బలు పెట్టునా? 4) ఎర పెట్టకుండా పక్షి ఉరిలో చిక్కుపడునా? 5) ఏమియు పట్టకుండా ఉరిపెట్టువారు వదలి లేచునా? 6) పట్టణమందు బాకానాదము వినబడకుండా జనులకు భయము పుట్టునా? 7) యెహోవా చేయనిచే పట్టణములో ఉపద్రవము కలుగునా? కనుక ప్రజలకు రాజలకు పట్టణమునకు శిక్ష తప్పదని చెప్పుచున్నాడు.

**9-10 వ. షోమ్రోను పాపుల వివరము:** 1) షోమ్రోనులో అల్లరి జరుగుట, 2) నీతి క్రియలు చేయ తెలియకుండుట, 3) బలత్కారముతో, దోపిడితో సొమ్ము సమ కూర్చుట. ఇవి ముఖ్యమైన పాపములు.

**11-15 వ. శిక్షల వివరములు:** 1) ప్రభావము కొట్టివేయబడుట, 2) నగరులు పాడగుట, 3) బేతేలులోని బలిపీఠములకు శిక్ష, 4) బలిపీఠపు కొమ్ములు తెగవేయబడుట, 5) చలికాలపు నగరులు, వేసవికాలపు నగరులు పడగొట్టబడుట, 6) దంతపు నగరులు లయమగుట, 7) బహు నగరులు పాడగుట. ఏడు రకముల శిక్షలు అనగా సంపూర్ణమైన శిక్ష కలుగును.

# 4వ అధ్యాయం

వచనముల విభజన **- 3 + 2 + 3 + 3 + 2 = 13**

## అంశం : పాపమునకు రానున్న శిక్షలను బట్టి దేవుని సన్నిధిని కనబడుటకైన ఆహ్వానము

**1-3 వ. స్త్రీల పాపము:** పాపములు: 1) దరిద్రులను బాధించుట, 2) బీదలను నలుగ గొట్టుట. శిక్షలు: 1) ఇశ్రాయేలీయులను శత్రువు బొంకులతో, గాలములతో లాగుట, 2) ప్రాకారపు గుండ్లగుండా పోవుట, 3) హెర్మోను మార్గమున వెలివేయబడుట.

**4-5 వ. ఇశ్రాయేలు వ్యర్థమైన అర్పణలు:** 1) తిరుగుబాటు కలిగియున్నారు, 2) పులిసిన పిండితో అర్పణలు చేయుచున్నారు, 3) స్వేచ్ఛార్పణలు అర్పించుటలేదు, ఆరాధనలో లోపములు.

**6-8 వ. పాపమునుబట్టి రానున్న శిక్ష:** 1) ఆహారము లేకుండా చేయుట, 2) కోత కాలమునకు ముందు మూడు నెలలు వాన లేకుండా చేయుట, 3) ఒక పట్టణము మీద వాన కురిపించి మరొక పట్టణము మీద కురిపింపకపోవుట, 4) త్రాగుటకు నీరు లేకపోవుట.

**9-11 వ. పంటలు, ఫలవృక్షములు, ప్రజలు నాశనమగుట అను శ్రమలు:** 1) తెగులు కాటుకతో సస్యములు పాడగుట, 2) గొంగళి పురుగులతో ఫలవృక్షములు పాడగుట, 3) మనుష్యుల పైకి తెగులు పంపించినందున పేటలో దుర్గంధము పుట్టించుట, 4) కొందరిని నాశనము చేసి, వారిలో నుండి కొందరిని దేవుడు తప్పించినను వారు దేవునివైపు తిరుగలేదని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**12-13 వ. దేవుని సన్నిధిని కనబడుటకై సిద్ధపడుమని ఆహ్వానము:**

**ఆమోసు 4:12-13 -** "ఇశ్రాయేలీయులారా, దేవుని సన్నిధిని కనబడుటకై సిద్ధపడుడి. పర్వతములను నిరూపించువాడును గాలిని పుట్టించువాడును ఆయనే. ఉదయమున చీకటి కమ్మజేయువాడును మనుష్యుల యోచనలు వారికి తెలియజేయువాడు ఆయనే; భూమి యొక్క ఉన్నతస్థలము మీద సంచరించు దేవుడును సైన్యములకు అధిపతియునగు యెహోవా అని ఆయనకు పేరు అని దేవుడు చెప్పుచున్నాడు." సృష్టికర్త సమస్తమును జరిగించు దేవుడు. భూమియొక్క ఉన్నత స్థలములపై సంచరించు దేవుని సన్నిధిని కనబడుటకై సిద్ధపడుడని ఆహ్వానించుచున్నాడు.

# 5వ అధ్యాయం

వచనముల విభజన **- 3 + 3 + 3 + 4 + 4 + 3 + 3 + 4 = 27**

## అంశం : యెహోవాను ఆశ్రయించుటను గూర్చిన వర్తమానము

**1-3 వ. ప్రవక్త అంగలార్పు మాట:** ఇశ్రాయేలు పట్టణములో ఉన్నవారు యుద్ధమునకు వెళ్ళువారిలో పదియవ వంతు మాత్రమే తప్పించుకొని వత్తురని, మిగిలిన అందరు నాశనమగుదురని ప్రవక్త అంగలార్చుతూ సెలవిచ్చుచున్నాడు.

**4-6 వ. యెహోవాను ఆశ్రయించుటకు ఆహ్వానము:** దూడలను పూజించుచున్న బేతేలు, గిల్గాలు, వాటితోపాటు విగ్రహారాధన జరుగు బెయెర్షెబా నాశనమగునని వాటిని ఆశ్రయించక యెహోవాను ఆశ్రయించవలెనని ఆహ్వానించుచున్నాడు. లేని యెడల ఎవరు ఆర్పలేనంతగా అగ్నిపడి ఇశ్రాయేలును నాశనము చేయునని దేవుడు తనను ఆశ్రయించుటకు అవకాశము ఇచ్చుచున్నాడు.

**7-9 వ. యెహోవా ఔన్నత్యము:** 1) పెద్ద నక్షత్రముల సృష్టికర్త, 2) పగటిని చీకటిగాను, చీకటిని పగలుగాను చేయగలవాడు, 3) నీళ్ళను భూమి మీద పొర్లి పారజేసేవాడు, 4) బలాఢ్యులపైకి నాశనమును తెప్పించి దుర్గములను పాడుచేయ గలవాడు. అందునుబట్టి ఆయనకు భయపడి ఆయనను మాత్రమే సేవించవలయును.

**10-13 వ. అన్యాయము చేయువారికి శిక్ష:** లంచము పుచ్చుకొని నీతిమంతులను బాధించుట, యథార్థముగా మాటలాడువారుని అసహ్యించుకొనుట, బీదవారికి అన్యాయము చేయుట అనే ఘోరమైన పాపములను బట్టి వారి ఆస్తి వారనుభవించుట, వారు కట్టుకొనిన ఇళ్ళలో నివసించకుండుట అను శిక్ష పొందుదురు.

**14-17 వ. కీడును విడిచి మేలు చేయుదమను హెచ్చరిక:** దేవుడు హెచ్చరిక చేసినను ప్రజలు వినరని శిక్ష వచ్చిన పిదప రాజమార్గములోను, వీధులలోను అంగలార్పు ఉండునని దేవుడు తోడుగా ఉండడని సెలవిచ్చుచున్నాడు.

**18-20 వ. యెహోవా దినమున రానున్న శ్రమలను గూర్చిన హెచ్చరిక:** సింహము నుండి తప్పించుకొన్నవారికి ఎలుగుబంటి ఎదురైనట్లు, గోడమీద చేయి వేయగా పాము కరిచినట్లు యెహోవా దినమున వెలుగుండక శ్రమ కలుగునని చెప్పుచున్నాడు.

**21-23 వ. ఆచారములు కాక, నీతి న్యాయములు కలిగి ఉండవలెనని హెచ్చరిక:** పండుగలు - బలులు, పాటలు, స్వరమండలముల నాదములు ఆత్మీయముగా కాక ఆచారముగా మాత్రమే ఆచరించుట దేవునికి ఇష్టము లేదని, వాటన్నిటిని అసహ్యించు కొంటున్నానని సెలవిచ్చుచున్నాడు. శిక్షగా దూరదేశముకు, చెరకు వెళ్ళుదురని తెలుపుచున్నాడు.

**24-27 వ. చెరను గూర్చి:** గొప్ప ప్రవాహము వలె నీరు పారినట్లు న్యాయము, నీతి గొప్ప ప్రవాహమువలె జీవించమన్నాడు. విగ్రహముల పీఠములను మోసికొని వచ్చినందున దమస్కు పట్టణము అవతలికి అనగా అష్షూరుకు చెరకు పంపుదునని దేవుడు సెలవిచ్చు చున్నాడు.

# 6వ అధ్యాయం

వచనముల విభజన - **6 + 5 + 3 = 14**

## అంశం : ఇశ్రాయేలీయుల పెద్దల పాపము - శిక్షనుబట్టి రానున్న శిక్షల గూర్చిన వర్తమానము

**1-6 వ. సీయోను అనగా యూదావారు షోమ్రోను అనగా ఇశ్రాయేలువారు - వారి పెద్దల పాపములు:** 1) నిశ్చింత (వ. 1), 2) అన్యాయపు తీర్పు (వ. 3), 3) దేవునికంటే సుఖానుభవమును ప్రేమించువారు (వ. 4), 4) స్వరమండలములతో పిచ్చిపాటలు పాడుట (వ. 5), 5) ద్రాక్షారసము పానము చేయుట (వ. 6), 6) పరిమళ తైలము పూసికొనుట (వ. 6). 7) రానున్న ఉపద్రవమునుబట్టి చింతింపకుండుట.

**7-11 వ. పెద్దలకు శిక్ష:** 1) చెరకు వెళ్ళుట, 2) ఉత్సవధ్వని గతించుట, 3) గర్వమును దేవుడు అసహ్యించుట, 4) పట్టణములను శత్రువు వశము చేయుట, 5) మనుష్యులందరు చనిపోవుట, 6) గొప్ప కుటుంబములు పాడగుట, 7) చిన్న కుటుంబములు చీలిపోవుట

**12-14 వ. వారు బలహీనపరచబడుట:** దేవుడు ఒక జనాంగమును (అష్షూరీయులను) ఇశ్రాయేలు మీదికి యుద్ధమునకు రప్పించగా వారు ఇశ్రాయేలును బాధింతురు. ఇశ్రాయేలు రాజును బంధించి చెరలో నెట్టి పట్టణములను ముట్టడించినను ఇశ్రాయేలుతో వచ్చిన విస్తారమైన యూదావారి సైన్యము ఏమీ చేయలేని స్థితికి వత్తురు. వివరములు 2దిన 17:15-18 లలో ముందుగా గమనించవలెను.

**2దిన 17:15-18 -** "రెండవవాడగు యెహోహానాను అను అధిపతి యొద్ద రెండు లక్షల ఎనుబది వేలమంది యుండిరి. మూడవవాడు జిఖ్రీ కుమారుడై యెహోవాకు తన్నుతాను మనఃపూర్వకముగా సమర్పించుకొనిన అమస్యా అతనియొద్ద రెండు లక్షలమంది పరాక్రమశాలులుండిరి. బెన్యామీనీయులలో ఎల్యాదా అను పరాక్రమశాలి యొకడుండెను. వీరియొద్ద వింటిని కేడెమును పట్టుకొనువారు రెండు లక్షలమంది యుండిరి. రెండవవాడు యెహోజాబాదు; వీరియొద్ద లక్ష యెనుబది వేలమంది యుద్ధ సన్నద్ధులుండిరి. రాజు యూదాయందంతటనుండు ప్రాకారపురములలో ఉంచినవారు గాక వీరు రాజుయొక్క పరివారముతో చేరినవారై యుండిరి."

# 7వ అధ్యాయం

వచనముల విభజన - **3 + 3 + 3 + 4 + 4 = 17**

## అంశం : తీర్పును గూర్చిన మూడు దర్శనములు

**1-3 వ.మొదటి దర్శనము - నాశనము చేయు మిడతలు:** కడవరి గడ్డిని మిడుతలు తినివేయుటయను దర్శనమును దేవుడు చూపగా ప్రవక్త ప్రార్థించెను. జవాబుగా దేవుడు ఆలాగున చేయనని సెలవిచ్చాడు. ఇశ్రాయేలు పైకి దండెత్తి వచ్చిన అష్షూరును సూచించు దర్శనమైయుండవచ్చును.

**4-6 వ. రెండవ దర్శనము - దహించు అగ్నిదండన:** అగాధ మహాజలములను మ్రింగివేయు అగ్ని దర్శనమందు కనబడగా యాకోబు కొద్ది జనము గలవాడు. అతడేలాగు నిలుచును అని ప్రవక్త ప్రార్థించగా యెహోవా పశ్చాత్తాపపడి ఆలాగు జరుగదని సెలవిచ్చెను. తన బిడ్డల ప్రార్థనకు దేవుడే పశ్చాత్తాపపడుట ఎంత ఆశ్చర్యము. ప్రార్థన ఎంత ఫలము గలది.

**7-9 వ. మూడవ దర్శనము - మట్టపుగుండు:** యెహోవా మట్టపుగుండుచేత పట్టుకొని చక్కగా కట్టబడిన యొక గోడపై నిలుపబడినట్టు దర్శనమందు కనబడెను.
దేవుడు ఇశ్రాయేలును మట్టపుగుండుతో చూడబోవుచున్నాడని వారి ఉన్నత స్థలమును పాడుచేతునని యెహోవా సెలవిచ్చుచున్నాడు. (9 వ. - నేను ఖడ్గము చేతపట్టుకొని యరోబాము ఇంటిమీద పడుదును అన్నట్లు 2రాజులు 13:8-10 లో యరోబాము కుమారుడైన జెకర్యా రాజు కాగా షల్లూము అతనిమీద పడి చంపి రాజాయెను.

**10-13 వ. ప్రవక్తపై షరతులు విధించిన రాజు:** (దేవుని తీర్పుల గూర్చి) యాజకుడైన అమజ్యా రాజైన యరోబాముతోను, ఆమోసుతోను మాటలాడుట పాపము బట్టి రాబోవుచున్న శిక్షను ప్రవక్తయైన ఆమోసు ప్రకటించెను. బేతేలులో ఉన్న విగ్రహమును యాజకుడైన అమజ్యా రాజైన యరోబాముతో దేశము, ప్రవక్త యైన ఆమోసు మాటలను సహించదని తెలియచేసెను. అమజ్యా ఆమోసుకు వర్తమానము పంపి, ఇక ఈ దేశములో నీ వార్త ప్రకటించకూడదని యూదా దేశము నకు పారిపోయి అచ్చట యూదా దేశమున ప్రకటించుమని యాజకుడు కాని దేవునికి విధేయుడు కావడానికి ఇష్టపడలేదు.

**14-17 వ. రాజుకు రానున్న శిక్షల జవాబు:** దేవుడు, 1) అమజ్యా భార్యను పట్టణ మందే వేశ్యగా చేయునని, 2) కుమారులను కుమార్తెలను ఖడ్గముచేత చంపుదునని, 3) ప్రవక్తలు బాధింపబడుదురని, 4) అమజ్యా కూడా అపవిత్ర దేశమందు చనిపోవునని ఆమోసు జవాబిచ్చెను. అలాగే ఇశ్రాయేలు తమ దేశము విడిచి చెరకు వెళ్లుట ఖాయమని సెలవిచ్చెను. ఇశ్రాయేలీయులు తమ దేశమును విడిచి అష్షూరు చెరకు రెండు విడతలుగా 1) క్రీ.పూ. 732 లో (2రాజులు 15:29); 2) క్రీ.పూ. 721 (2రాజులు 17:15-18) లో వెళ్ళినట్లు చూతుము.

# 8వ అధ్యాయం

వచనముల విభజన **– 3 + 3 + 4 + 4 = 14**

## అంశం : వేసవికాలపు పండ్లగంపను గూర్చిన దర్శనము – రానున్న శిక్షల వివరము

**1–3 వ. వేసవికాలపు పండ్లగంప:** వేసవికాలపు పండ్లగంప దర్శనమునుబట్టి వేసవి కాలపు పండ్లు బలహీనముగానున్నట్లు ఇశ్రాయేలు బలహీనముగానున్నారని దేవుడు వారిని విచారణ చేసి అంతము చేయునని శవములు ఎక్కువైనందున మందిరములో పాటకు బదులు ప్రలాపములు వినిపించునని సెలవిచ్చుచున్నాడు.

**4–6 వ. వ్యాపారస్తులు పేదలను బాధించుట:** కొలత తూకమును చిన్నదిగా చేసి, రూపాయిని పెద్దదిగా చేసి చచ్చు ధాన్యమును అమ్మి పేదలను వ్యాపారస్తులు మోసము చేయుటకు ఆలోచించుచున్నారని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**7–10 వ. దేవునికి అయిష్టమైన క్రియలు:** దేవునికి ఇష్టము లేని క్రియలు చేయు చున్నందున దేవుడు మరువలేకున్నాడు. కనుక నివాసులందరు అంగలార్చ వలెనని చెప్పుచున్నాడు. ప్రజలలో ఉన్న పొంగు అనగా అతిశయము రానున్న శిక్షను బట్టి అణగిపోవును.

**11–14 వ. పాపమునుబట్టి రానున్న శిక్షలు:** పైభాగములో చెప్పబడిన పాపములను బట్టి దేవుడు భూమిని కంపింపజేతునని, మధ్యాహ్న సమయమందు దేశముపై చీకటి కమ్మునని పండుగ దినములను దుఃఖదినములుగాను, పాటలను ప్రభావములు గాను మార్చుదునని సెలవిచ్చుచున్నాడు. యెహోవా మాటలు వినకపోవుట అను క్షామము కలుగును. అందువల్ల యెహోవా మాటల కొరకై జనులు వెదకినను ఆ దినములలో అవి దొరకవని సెలవిచ్చుచున్నాడు. విగ్రహారాధన కరువును కలుగజేయునని, విగ్రహముల యొద్ద ప్రజలు వెదకినను జవాబు దొరకదని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

# 9వ అధ్యాయం

వచనముల విభజన **- 4 + 6 + 5 = 15**

## అంశం : బలిపీఠము పైగా నిలిచిన యెహోవాను గూర్చిన దర్శనము

**1-4 వ. యెహోవా బలిపీఠము పైగా నిలిచిన దర్శనము:** దేవుడు బలిపీఠము దగ్గర నిలిచి (బేతేలు బలిపీఠము) తన తీర్పును ప్రారంభించుచున్నాడు. బలిపీఠముపై కమ్ములను కొట్టి వారి తలల మీద పడవేసి ఒక్కరును తప్పించుకొనకుండ ఖడ్గముచే వధించెదనన్నాడు. ఇశ్రాయేలువారు ఆకాశమునకు, పర్వతములకు, సముద్రములకు ఏకముగా ఎచ్చటికి వెళ్ళినను వారిని రప్పించి శిక్షింతునని సెలవిచ్చుచున్నాడు.

**5-10 వ. దేవుని గొప్పతనము:** 1) యెహోవా భూమిని మొత్తగా అది కరిగిపోవును, 2) అందులోని నివాసులు ప్రలాపింతురు, 3) నైలునదివలె అదిఉబుకును, 4) ఐగుప్తు దేశము నైలునదివలె అణగిపోవును, 5) ఆకాశమందు మేడగదులు కట్టువారు (నూతన యెరూషలేము పట్టణము), 6) భూమికి పునాది వేయువాడు ఆయనే, 7) ఇశ్రాయేలును జల్లించును కాని ఒక గింజైన రాలకుండా కాపాడువాడునూ ఆయనే. అంత్యదినమున ఏడేండ్ల శ్రమల కాలమున భూమి మీద ప్రకటన 6-15 అధ్యాయాలలో చెప్పబడిన శ్రమలనుబట్టి ఇశ్రాయేలు బహుగా నలిగిపోవును. శ్రమలకాల చివర దేవుడే వారిని విడిపించి సమకూర్చును.

**11-15 వ. భక్తుల రక్షణ - ఇశ్రాయేలు అంత్యకాల విమోచన:** దావీదుకు వాగ్దానము చేసిన విడుదలను ఆయన నెరవేర్చును. ఇశ్రాయేలీయులును భూదిగంతముల నుండి సమకూర్చి, వారి పాడైన పట్టణములను కట్టించును. ద్రాక్షాతోటలు వేసి వాటి రసము త్రాగుదురు. ఇక ఎన్నడు పెరికివేయబడకుండ నిత్యనివాసము చేతురని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

# 4. ఓబద్యా

**గ్రంథకర్త : ఓబద్యా** **కాలం : క్రీ.పూ. 582**

**మూఖ్యాంశం : ఎదోమీయుల నాశనము**

**గ్రంథ ఉద్దేశం :** ఓబద్యా అనే పేరుకు 'యెహోవా దాసుడు' అని అర్థం. ఎదోమీయులు ఏశావు సంతానము. ఎదోము అనబడిన ఏశావు యాకోబుకు సహోదరుడు. కాని ఇశ్రాయేలుకు ఎల్లపుడు శత్రువులుగా ఎదోమీయులు ఉండిరి. యెరూషలేము పాడుకాగా సంతోషించిరని శత్రువుకు పాడుచేయుటలో సహకరించిరని వ్రాయబడినది. అందుకై దేవుడు ఎదోమును నాశనము చేతునని చెప్పుచున్నాడు. దీని నెరవేర్పుగా క్రీ.శ. 1000 సంవత్సరమున అరబీయులు ఎదోమును పట్టుకొని వారినందరిని బలవంతముగా మహమ్మదీయులుగా మార్చి తమలో కలుపుకొనిరి. ఇప్పుడు జోర్డన్‌వారు వీరేనని తలంచగలము. ఏశావు ఆహారమును ప్రేమించి ఆత్మీయ ఆశీర్వాదమును నిర్లక్ష్యపెట్టినందున ఆత్మకు విరోధముగా పోరాడు శరీరమునకు సాదృశ్యము. ఆత్మీయ ఆశీర్వాదమునకై శరీరము నలిగిపోవుట అవసరమని ఈ గ్రంథ ముఖ్యాంశము.

## 1వ అధ్యాయం

వచనముల విభజన – **8 + 6 + 7 = 21**

### అంశం : ఎదోమీయులు పాపమునుబట్టి శిక్షింపబడుట (వ.1–6), నిర్మూలమగుట (వ.9–14), ఇశ్రాయేలీయుల ఔన్నత్యము (వ.15–21)

**1–8 వ. ఎదోమీయుల ఏడు పాపములు – రానున్న ఏడు శిక్షలు:** ఏడు పాపములు: 1) గర్వము (వ.3), 2) పడద్రోయగలవాడెవడు అనుకొనుట (వ.3), 3) చెడిపోయినవారు (వ.5), 4) ధనాపేక్ష (వ.6), 5) శత్రువులతో సంధిచేసుకొని మోసపోయినవారు (వ.7), 6) జ్ఞానమును నమ్ముకొనువారు (వ.8), 7) బలమును నమ్ముకొన్నవారు (వ.9).

**రానున్న ఏడు శిక్షలు:** 1) అల్పులగుట (వ.2), 3) తృణీకరింపబడుట (వ.2), 3) క్రిందపడద్రోయబడుట (వ.4), 4) ధనమంతయు పట్టబడుట (వ.6), 5) బలాత్కరించబడుట (వ.7), 6) నాశనమగుట, 7) హతులై నిర్మూలమగుట (వ.9).

సామెతలు 13:10లో 'గర్వము వలన జగడమే పుట్టును' అన్నట్లు ఎదోమీయులకు వారి గర్వమునుబట్టి ఇశ్రాయేలీయులతో జగడమునకు సిద్ధపడిరి. సామెతలు 29:23లో 'వినయ మనస్కుడు ఘనతనొందును, ఎవని గర్వము వానిని తగ్గించును' అని ఉన్నది. ఎదోమీయులు

వినయ మనస్కులుగా తమ్మునుతాము తగ్గించుకొనలేదు. కనుక దేవుడు వారిని తగ్గించెను. సామెతలు 16:18లో 'నాశనమునకు ముందు గర్వము నడచును, పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచును' అని వ్రాయబడినట్లు గర్విష్ఠులుగా కొనసాగి నాశనమైరి.

**9-14 వ. ఎదోమీయులు నిర్మూలమగుటకు కారణాలు:** 1) యాకోబుసంతతిని బలాత్కారము చేయుట (వ.10). 2) పగవాడై నిలుచుట (వ.11), 3) ఆస్తిని పట్టుకొనిపోయినవారితో ఏకీభవించుట (వ.11), 4) గుమ్మములలో చొరడినవారితో ఏకీభవించుట (వ.11), 5) యూదావారి నాశనము చూసి సంతోషించుట (వ.12), 6) సహోదరుని శ్రమానుభవ దినమున ఆనందించుట (వ.12).

యాకోబు ఏశావులు అన్నతమ్ముళ్ళు. యాకోబు సంతానమగు ఇశ్రాయేలీయుల పైకి శత్రువులు 2దిన 21:16లో 'యూదా రాజగు యెరోబాము రాజు కాలములో ఫిలిష్తీయులు, అరబీయులు దండెత్తి వచ్చిరి.' 2దిన 24:24 'యూదారాజగు యోవాషు కాలములో సిరియనులు దండెత్తి వచ్చిరి.' 2దిన 36:11 'బబులోను రాజు యూదాపై దండెత్తివచ్చి ధనము దోచుకొని సైన్యబలమగు ప్రజలను బానిసలుగా పట్టుకొనిపోయినపుడు శరీరరీతిగా సహోదరులైన ఎదోమీయులు యూదాకు సహాయము చేయక శత్రువుతో కలిసిరి. పైగా తప్పించుకొనిపోవుటకు ప్రయత్నించిన యూదులకు అడ్డుపడిరని చూచుచున్నాము. పై కారణములనుబట్టి తేమానూ అనగా ఏశావు సంతానమగు ఎదోమీయుల బలాఢ్యులు విస్మయమొందునట్లు ఏశావు యొక్క పర్వత నివాసులందరు హతులై నిర్మూలమగుదురని 9వ.లో చెప్పుచున్నాడు.

**ఎదోమీయులకు తగనివి (12-14 వ.) :** 1) యూదావారి శ్రమానుభవ దినమున ఆనందమొంద తగదు, 2) యూదావారి నాశన దిన స్థితిని చూచి సంతోషింపతగదు, 3) ఆపద దినమున యూదావారి గుమ్మములో చొరబడ తగదు, 4) ఆపద దినమున యూదావారి ఆస్తి పట్టుకొన తగదు, 5) యూదావారిలో తప్పించుకొనినవారిని సంహరించుటకు అడ్డత్రోవలలో నిలువ తగదు, 6) శ్రమ దినమున శేషించినవారిని శత్రువులకు అప్పగింపతగదు, 7) వారి ఆపద్దినమున నీవు సంతోషపడుచు వారి బాధను చూడతగదు. సహోదరులు ఎవరైనను శిక్షగా కాని, పరీక్షగా కాని శ్రమలలో ఉన్నప్పుడు వారికి వ్యతిరేకముగా మనము ఉండకూడదను పాఠము నేర్చుకొనవలెను.

**15-21 వ. ఎదోమీయుల నాశనము - ఇశ్రాయేలు ఔన్నత్యము:** ఎదోమీయుల నాశనము: 1) యెహోవా దినము అన్యజనులందరి మీదికి వచ్చును (15వ.), 2) యూదావారికి ఎదోమీయులు చేసినట్లే వారికి చేయబడును (15వ.), 3) ఎదోమీయులు చేసినవి వారి నెత్తిమీదికి వచ్చును (15వ.), 4) అన్యజనులందరు నిత్యము త్రాగుదురు

(16వ.), 5) ఇక ఏమియు మిగులకుండా త్రాగుదురు (16వ.), 6) ఏశావు సంతతివారు కొయ్యకాలువలె నుందురు (18వ.), 7) యోసేపు సంతతివారు ఏశావు సంతతివారిని ఎవరు తప్పించుకొనకుండా కాల్చుదురు(18వ.).

**ఇశ్రాయేలీయుల ఔన్నత్యము:** 1) యాకోబు సంతతివారు తన స్వాస్థ్యము సంపాదించుకొందురు (17వ.), 2) ఏశావు పర్వతమును స్వతంత్రించుకొందురు (19వ.), 3) ఫిలిష్తీయుల దేశమును స్వతంత్రించుకొందురు (19వ.), 4) ఎఫ్రాయిమీయుల యొక్కయు, షోమ్రోనువారి యొక్కయు భూములు స్వతంత్రించుకొందురు (19వ.), 5) బెన్యామీయులు గిలాదు దేశమును స్వతంత్రించు కొందురు (19వ.), 6) కనానీయుల దేశమును స్వతంత్రించుకొందురు (20వ.), 7) దక్షిణదేశపు పట్టణములను పట్టుకొందురు (20వ.). రక్షకులు సీయోను కొండమీద పుట్టుదురు.

దీని వివరములు ఇతర భాగములలో కలవు: 1) **యిర్మీయా 3:18** – "ఆ దినములలో యూదా వంశస్థులును (రెండు గోత్రములవారు) ఇశ్రాయేలు వంశస్థులును (పది గోత్రములవారు) కలిసి ఉత్తర దేశములో నుండి ప్రయాణమై, మీ పితరులకు నేను స్వాస్థ్యముగా ఇచ్చిన దేశమునలు వచ్చెదరు." 2) **యెహె 37:16-17** – "నరపుత్రుడా, నీకు కఱ్ఱ తునక యొకటి తీసికొని దానిమీద యూదా వారిదనియు (రెండు గోత్రములు), వారి తోటివారగు ఇశ్రాయేలీయులదనియు (పది గోత్రములు) పేళ్లు వ్రాయుము. మరియొక తునక తీసికొని దానిమీద ఎఫ్రాయీమునకు తునక, అనగా యోసేపు వంశస్థులదని వారి తోటివారగు ఇశ్రాయేలువారిదని వ్రాయుము. అప్పుడది యేకమైన తునకయగునట్లు ఒకదానితో ఒకటి జోడించుము, అవి నీ చేతిబి ఒకే తునక యగును." 3) యెషయా 11:11-14 – "ఆ దినమున శేషించు తన ప్రజల శేషమును అష్షూరులోనుండి ఐగుప్తులో నుండియు పత్రోసులో నుండియు కూషులో నుండియు ఏలాములోనుండియు షీనారులోనుండి హమాతులో నుండి సముద్ర ద్వీపములలోనుండి విడిపించి తప్పించుటకు యెహోవా రెండవమారు తన చెయ్యి చాచును. జనులను పిలుచుటకు ఆయన యొక ధ్వజము నిలువబెట్టును. భ్రష్టులైపోయిన ఇశ్రాయేలీయులను పోగుచేయును. భూమియొక్క నాలుగు దిగంతముల నుండి చెదరిపోయిన యూదావారిని సమకూర్చును. యూదా ఎఫ్రాయిమును బాధింపబడువారు ఫిలిష్తీయుల భుజముమీద ఎక్కుదురు. పడమటివైపుకు ఎలుగెత్తి పోవుదురు. ఏకీభవించి తూర్పువారిని దోచుకొందురు. ఎదోమును మోయాబును ఆక్రమించుకొందురు, ఆమ్మోనీయులు వారికి లోబడుదురు.

**21వ.** "మరియు ఏశావు యొక్క కొండకు తీర్పుతీర్చుటకై సీయోను కొండమీద రక్షకులు పుట్టుదురు. అప్పుడు రాజ్యము యెహోవాది యగును." ఇశ్రాయేలీయులను శత్రువుల నుండి విడిపించుటకై అనేకసార్లు రక్షకులుగా న్యాయాధిపతులను రాజులను దేవుడు

వాడుకొనుట న్యాయాధిపతుల గ్రంథములోను, రాజుల గ్రంథములోను చూతుము. 'అప్పుడు రాజ్యము యెహోవాది యగును' అనగా యుగాంతమందు వేయి ఏండ్ల రాజ్యము, తదుపరి శాశ్వతకాలము దేవుడు రాజ్యపాలన చేయునని అనేక లేఖన భాగములలో చూతుము. **1) దాని 2:44 –** "ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు, అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగముల వరకు నిలుచును."

**2) దాని 7:14 –** "సకలజనులును రాష్ట్రములును ఆయా భాషలు మాటలాడువారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయనకీయబడును. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది, అదెన్నటికిని తొలగిపోదు; ఆయన రాజ్యము ఎప్పుడును లయము కాదు."

**3) దాని 7:27 –** "ఆకాశమంతటి క్రిందనున్న రాజ్యమును అధికారమును రాజ్య మహాత్మ్యము మహోన్నతుని పరిశుద్ధులకు చెందును. ఆయన రాజ్యము నిత్యము నిలుచును."

**4) జెకర్యా 14:9 –** "యెహోవా సర్వలోకమునకు రాజైయుండును, ఆ దినమున యెహోవా ఒక్కడే అనియు, ఆయనకు పేరు ఒక్కటే అనియు తెలియబడును."

**5) లూకా 1:33–** "ఆయన యాకోబు వంశస్థులను యుగయుగులు ఏలును; ఆయన రాజ్యము అంతము లేనిదైయుండునని ఆమెతో చెప్పెను."

**6) ప్రకటన 11:15 –** "ఏడవ దూత బూర ఊదినప్పుడు పరలోకములో గొప్ప శబ్దములు పుట్టెను. ఆ శబ్దములు ఈ లోకరాజ్యము మన ప్రభువు రాజ్యమును ఆయన క్రీస్తు రాజ్యము నాయెను; ఆయన యుగయుగముల వరకు ఏలుననెను."

**7) ప్రకటన 19:6 –** "అప్పుడు గొప్ప జనసమూహపు శబ్దమును, విస్తారమైన జలముల శబ్దమును, బలమైన ఉరుముల శబ్దమును పోలిన యొక స్వరము సర్వాధికారియు ప్రభువునగు మన దేవుడు ఏలుచున్నాడు."

❊ ❊ ❊ ❊ ❊

# 5. యోనా

**గ్రంథకర్త : యోనా** **కాలం : క్రీ.పూ. 780**

**మూఖ్యాంశం : యోనాపట్ల, యూదులపట్ల, విశ్వాసులపట్ల, అన్యజనులపట్ల ఉన్న దేవుని కృప**

## యోనా జీవిత విశేషములు

**2రాజులు 14:23-26 -** "ఇశ్రాయేలు రాజైన యెహోయాషు కుమారుడైన యరొబాము షోమ్రోనులో ఏలనారంభించి నలువది యొక సంవత్సరములు ఏలెను. ఇతడు ఇశ్రాయేలువారు పాపము చేయుటకు కారకుడగు నెబాతు కుమారుడైన యరొబాము చేసిన పాపములను విడువక అనుసరించి యెహోవా దృష్టికి చెడుతనము జరిగించాడు. అల్పులేమి ఘనులేమి ఇశ్రాయేలువారికి సహాయులెవరు లేకపోయిరి.

కాని గత్హెపెరు ఊరివాడైన అమిత్తయికి పుట్టిన తన సేవకుడైన యోనా అను ప్రవక్త ద్వారా ఇశ్రాయేలీయుల దేవుడగు యెహోవా సెలవిచ్చిన మాట చొప్పున యరొబాము హమాతునకు పోవు మార్గము మొదలుకొని మైదానపు సముద్రము వరకు ఇశ్రాయేలువారి సరిహద్దును మరల స్వాధీనము చేసికొనెను."

కనుక యోనా ప్రారంభములో ఎంతో చక్కగా దేవునితో సంబంధము గలవాడని తెలుసుకొనుచున్నాము. దినములు గడిచిన తరువాత దేవునికి అవిధేయుడగుట చూడగా ఆత్మీయులు ఎవరైనా ఏ రీతిగా దిగజారిపోగలరో తలంచవచ్చును. ఈ గ్రంథమును చదువు మీరు జాగ్రత్తగా ఉండవలెనని నేర్చుకొనవలెను.

**గ్రంథ ఉద్దేశం :** ఈ ఒక్క గ్రంథమందు ప్రవక్త మాటలయందు కాక, జీవితమునందు ఇశ్రాయేలీయుల చరిత్రను చూడగలము. ఇందులో విశ్వాసులమైన మన స్వభావమును చూపు పాఠములున్నవి.

1. ఇశ్రాయేలీయులు (విశ్వాసులు కూడా) లోకమునకు సాక్షులుగా ఉండాలి. యోనా వలే విశ్వాసి నీవు నీనెవెకు ప్రకటించుటకు పంపబడ్డాడు.
2. కాని దేవుని కృపను లోకమునకు తెలుపుటకు దేవుని బిడ్డలు ఆసక్తి లేనివారుగా ఉన్నారు (యోనా నీనెవె బదులు తర్షీషుకు వెళ్ళప్రయత్నించుట). దేవుడు తన బిడ్డలను ప్రేమించి డబ్బునివ్వగా దేవుడు చెప్పని ప్రయాణములకు వాడుట శోచనీయము.
3. దేవునికి అవిధేయులైనందున దేవుడు వారిని లోకమంతటికి చెదరగొట్టాడు. (యోనా సముద్రములో వేయబడుట) లోకములో వారు జీర్ణంకాక (చేప యోనాను జీర్ణించక పోవుట). ఒక దినమున లోకములోనున్న ప్రజల నుండి బయటకు ఒక జనాంగముగా

వచ్చెదరు (చేప కక్కివేయుట). ప్రపంచమంతటికి ఆశీర్వాదమును తెచ్చు ప్రజలుగా నుందురు (నీనెవెలో యోనా ప్రకటించి మారుమనసుకు వారిని నడిపించుట, నాశనము నుండి తప్పించుట),

విశ్వాసులు నశించు ఆత్మలపట్ల భారము లేక జీవించుటను కూడా ఇందులో చూడగలము. తమ ఉద్దేశముల నెరవేర్పును, తమ గుర్తింపును ఆత్మల సంపాదనకన్నా ప్రాముఖ్యముగా ఎంచుకొందురను సత్యము దేవుడిచ్చిన ఐశ్వర్యములు దేవుని చిత్తము కొరకు వాడకపోవుట అను సత్యము ఇందు కలదు.

**అధ్యాయాల విభజన :**

**I. 1 అధ్యా. : విధేయుడు కాని యోనా - పారిపోయిన యోనా**
**II. 2 అధ్యా. : పశ్చాత్తాపపడిన యోనా - ప్రార్థించిన యోనా**
**III. 3 అధ్యా.: విధేయుడైన యోనా - ప్రకటించిన యోనా**
**IV. 4 అధ్యా. : విసిగి కోపించిన యోనా - పశ్చాత్తాపపడని యోనా!**

# 1వ అధ్యాయం

వచనముల విభజన **- 3 + 3 + 3 + 4 + 4 = 17**

## అంశం : విధేయుడు కాక, యెహోవా సన్నిధి నుండి పారిపోయిన యోనా

దేవుని సన్నిధిని గూర్చి కొన్ని అంశములు గమనింతము. **ద్వితీ 16:16-** "నీ దేవుడైన యెహోవా ఏర్పరచుకొను స్థలమున నీ మగవారందరు ఆయన సన్నిధిని కనబడవలెను." **ద్వితీ 4:10-** "నీ దేవుడైన యెహోవా సన్నిధిని నిలిచియుండగా యెహోవా నా యొద్దకు ప్రజలను కూర్చుము; వారు అక్కడ నేర్చుకొని, తన పిల్లలకు నేర్పునట్లు వారికి నా మాటలను వినిపించెదను." **ద్వితీ 9:18 -** "నేను యెహోవా సన్నిధిని సాగిలపడితిని." **ద్వితీ 18:7 -** "యెహోవా సన్నిధిని దేవుడైన యెహోవా నామమున సేవ చేయవలెను." **ద్వితీ 26:11-** "నీ దేవుడైన యెహోవా సన్నిధిని నమస్కారము చేసి . . ." **ద్వితీ 6:2-** "మన దేవుడైన యెహోవా మనకాజ్ఞాపించినట్లు ఆయన సన్నిధిని సమస్తమైన ఆజ్ఞలను అనుసరించి మనము నడుచుకొన్నప్పుడు మనకు నీతి కలుగును."

**1-3 వ. యెహోవా సన్నిధిలోనుండి పారిపోవుటకు ప్రయత్నించిన యోనా:**
క్రీస్తునందు విశ్వసించినవారు దేవుని సన్నిధిలో నిత్యము జీవించాలి. కాని యోనా దేవుని సన్నిధి నుండి పారిపోవుచున్నాడు. నీనెవె ప్రజలకు దోషమునుబట్టి కలుగు దుర్గతిని ప్రకటించుమని దేవుడు సెలవిచ్చాడు. నీనెవె 500 మైళ్ళ దూరముననున్నది. యోనా అక్కడకు వెళ్ళుటకు బదులు దేవుడు ప్రేమించి ఇచ్చిన ధనమును వినియోగించి 2000

మైళ్ళ దూరముననున్న తర్షీషుకు వెళ్ళుటకు బయలుదేరాడు. తర్షీషు వ్యాపార సంబంధమైన పట్టణమని చరిత్రలో చూడగలము. దేవునిపిల్లలు దేవుని సన్నిధిని విడిచి దేవుడు సెలవిచ్చిన సువార్త ప్రజలకు చాటించక దేవుడిచ్చిన ధనమును వినియోగించి అంతకంటే దూర ప్రాంతాలకు ఇహలోక వ్యాపారములకై సంపాదనకై వెళ్ళుతున్నారని నేర్చుకొను చున్నాము. ప్రతి విశ్వాసి గమనించాలి.

**4-9 వ. ఓడ అడుగున నిద్రించిన యోనా, ప్రార్థించిన నావికులు:** దేవుని ప్రజలు దేవుని విడిచి దూరము వెళ్ళినను ఆయన తనవారిని ఎంతమాత్రము విడువక వెంబడించును.

**కీర్తన 139:7-9 –** "నీ సన్నిధి విడిచి నేనెక్కడికి పోవుదును . . . సముద్ర దిగంతములలో నివసించినను అక్కడను నీ చేయి నన్ను నడిపించును" అను వాక్య ప్రకారము దేవుని సన్నిధి నుండి యోనా పారిపోయినను దేవుడు యోనాను వెంబడించి తుఫానును రేపి యోనాతో మాటలాడుచున్నాడు. నావికులందరు ప్రార్థించుచున్నారు కాని యోనా ఓడ దిగువ భాగమున నిద్రించుచున్నాడు. లోకస్తులు తాము నమ్మిన విగ్రహాలకు ఎంతో గంభీరముగా ప్రార్థించుదురు. కాని దేవుని పిల్లలు ఆత్మీయములో దిగువ స్థాయిలో ఉండి నిద్రించు తప్పును దిద్దుకొననివారుగా ఉన్నారు. సృష్టిలో సముద్ర తుఫాను దేవుని ఆజ్ఞకు లోబడుచున్నది. కాని దేవుని పిల్లలు దేవుని సన్నిధికి దూరముగా ఉన్నారు.

**10-13 వ. తన అవిధేయతను గుర్తించి నావికులకు తెలిపిన యోనా:** యోనా దేవుని సన్నిధి నుండి పారిపోవుచున్నట్లు గుర్తించి నావికులు ప్రశ్నించినపుడు తన తప్పు ఒప్పుకున్నాడు. కాని అంతవరకు దేవుని సన్నిధికి దూరముగానే ఉన్నాడు. ఈ దినాలలో దేవుని సన్నిధికి దూరముగా ఉంటూ ఒప్పుకొనని వారు అనేకులున్నారు. మనము ఏలాగున్నామో పరీక్షించుకోవాలి.

**14-17 వ. సముద్ర అగాధములో మత్స్యము కడుపులో యోనా:** ఇశ్రాయేలీయులు దేవునికి దూరమైనందున వారిని క్రీ.పూ. 732, 721 లో అష్షూరు ప్రజలలోనికి (జలములలో వేయబడుట) చెదరగొట్టాడు. ప్రజలందరి పాపాలకై మూడు దినములు భూగర్భమునకు వెళ్ళిన క్రీస్తుకు కూడా ఇది సాదృశ్యమని మత్తయి సువార్తలో చూచుచున్నాము.

# 2వ అధ్యాయం

వచనముల విభజన – **9 + 1 = 10**

## అంశం : విధేయుడు కాక, యెహోవా సన్నిధి నుండి పారిపోయిన యోనా

**1–10 వ. యోనా ప్రార్థన:** 1–3వ.– తాను చేసిన తప్పునుబట్టి ఉపద్రవములో ఉన్నానని గుర్తించి తన స్థితిని ఒప్పుకొనుచు దేవుని ప్రార్థించగా దేవుడు జవాబిచ్చెను. ప్రార్థన యొక్క ప్రాముఖ్యతను గమనించాలి. **కీర్తన 143:18–20 –** "తనకు నిజముగా మొఱపెట్టు వారందరికి యెహోవా సమీపముగా నున్నాడు . . . వారి మొర ఆలకించి వారిని రక్షించును."

**కీర్తన 50:15 –** "ఆపత్కాలమున నీవు నన్ను గూర్చి మొరపెట్టుము. నేను నిన్ను విడిపించెదను. నీవు నన్ను మహిమపరచెదవు."

**4–6 వ.** దేవుని ఆలయమును మరల చూడవలెనని అపేక్షించుచు ప్రార్థించగా దేవుడు తన పరిశుద్ధాలయము నుండి జవాబిచ్చాడు.

**కీర్తన 122:6–7–** "యెరూషలేమును ప్రేమించువారు వర్ధిల్లుదురు. నీ ప్రాకారము లలో నెమ్మది కలుగును." యోనా నెమ్మది కొరకు ప్రార్థించాడు. దేవుడు జవాబిచ్చాడు.

**7–9 వ.** ప్రార్థనకు నిజదేవుడైన యెహోవా జవాబిచ్చాడని అసత్య దేవతలందు లక్ష్యముంచువారు కృపాధారమును విసర్జింతురని చెప్పుచున్నాడు. తాను మ్రొక్కుకొనిన మ్రొక్కుబడులు చెల్లింతునని సెలవిచ్చుచున్నాడు. కొద్దిమంది ఆపదలలో మ్రొక్కుబడి చేసుకొని మరచిపోయి మ్రొక్కుబడి చెల్లించరు. మనము ఆలాగున్నామేమో పరీక్షించుకొందము. మన జీవితములను దిద్దుకొనుట అవసరము.

**10 వ. జవాబుగా మత్స్యము యోనాను కక్కివేయుట :**మానవులమైన మనము దేవుని మాట వినుటలేదు.మత్స్యము దేవుని మాట విని ముందుగా మ్రింగినది; ఇప్పుడు కక్కివేసినది.

# 3వ అధ్యాయం

వచనముల విభజన – **4 + 5 + 1 = 10**

## అంశం : ప్రకటించిన యోనా – పశ్చాత్తాపపడిన ప్రజలు, పశ్చాత్తాపపడినవారికి కీడుచేయక మానిన ప్రభువు

**1–4 వ. నీనెవె మహా పట్టణమునకు యోనా ప్రకటించుట:** విధిలేని పరిస్థితిలో దేవుని ఆజ్ఞ ప్రకారము ప్రజలకు ఒక దినమంత ప్రయాణము తిరిగి ప్రకటించాడు.

**5–9 వ. రాజు, ప్రజలు తమ్మునుతాము తగ్గించుకొని ప్రభువుకు ప్రార్థించుట:** ప్రజలందరు, రాజు సింహాసనము నుండి దిగి ప్రజలకు ప్రకటించి తమ్మునుతాము తగ్గించుకొని గోనెపట్ట కట్టుకొని ఉపవాసముండి, దేవునికి ప్రార్థించిరి. ఇట్టి ప్రార్థన విధానమును అందరము నేర్చుకొందముగాక.

**10 వ.** ప్రభువు పశ్చాత్తాపడుట, అనగా మారుమనసు కలిగి పశ్చాత్తాపముతో చేసిన ప్రార్థన దేవుని మనసు మార్చుతుంది.

# 4వ అధ్యాయం

వచనముల విభజన – **3 + 5 + 3  = 11**

## అంశం : విసిగి కోపించిన యోనా – పశ్చాత్తాపపడిన యోనా

**1-3 వ.  దేవుడు కృప కలిగి నీనెవె పట్టణమునకు కీడు చేయనందువల్ల చింతాక్రాంతుడైన యోనా:** నీనెవె పట్ల యోనాకు కలిగిన అసూయను బట్టి కాబోలు, లేదా తన మాట నెరవేరవలెనన్న పట్టుదలనుబట్టి కాబోలు యోనా కోపగించాడు. అనేక పర్యాయములు దేవుని సేవకులు దేవుని కృపను గురించి కాక, తమ మాటల నెరవేర్పు, లేదా అసూయలతో నిండి ఉండుటనుబట్టి దేవుని కార్యములు జరుగవలసిన రీతిగా జరుగుటలేదు. **లూకా 15:7-10లో** చెప్పబడిన రీతిగా మారుమనసు పొందు పాపి విషయములో పరలోకములో దేవదూతల యెదుట సంతోషము  కలుగగా పట్టణమంతా మారుమనసు పొందిన విషయమై సంతోషించక తాను చావకోరుట ఎంత ఆశ్చర్యకరము. ఈ మాటలు చదువుతున్న నీ పరిస్థితిని గూర్చి ఆలోచించుము. మన జీవితాలలో దేవుడు మార్పును  కోరుతున్నాడు.

**4-8 వ.  అల్పసంతోషియైన యోనా – సొమ్మసిల్లిన యోనా:** దేవుడు తన బిడ్డలకు పాఠములను ఓర్పుతో నేర్పు విధానమును చూడగలము. తన బిడ్డలకు పాఠము నేర్పుటకు సొరచెట్టును, పురుగులను వాడుకొనుచున్నాడు. సొరచెట్టు నీడలో బహు సంతోషము కలుగుచున్నది. పురుగులు దేవుని మాట వినుచున్నవి. తన బిడ్డలు దేవుని మాట వినుట లేదు. దేవుని తలంపులను అర్థము చేసుకొనుట లేదు. అనేకమంది సేవకులకు తమ ఇంటిలో తాము పెంచుకొనే చెట్లమీద ఉన్న శ్రద్ధ సంఘములోని సభ్యులపట్ల లేదు. ప్రశ్నించు మానవుల విషయమైన చింత లేదు. 3:3,8 లలో రెండుసార్లు చావగోరుట ఎంత ఆశ్చర్యము!

**9-11 వ.  దేవునిచేత గద్దించబడిన యోనా:** ముగింపులో దేవుడు నీనెవెలో నున్న కుడి ఎడమలు ఎరుగని ప్రజలపై ప్రేమ కలిగియుండవలెనని నశించు ఆత్మల పట్ల భారముండవలెనని చెప్పి గ్రంథమును ముగించినట్లు చూచుచున్నాము.

**ముగింపు :** యోనాను దేవుడు గ్రంథమును వ్రాయుటకు వాడుకొనినందున యోనా తదుపరి పశ్చాత్తాపపడి, జీవితమును దిద్దుకొనినట్లు తలంచగలము. ఈ గ్రంథము చదువు విశ్వాసీ, నీ జీవితములో దేవుని సన్నిధిలోనే నిత్యము ఉండుట అను అనుభవమున్నదా? ఎన్ని పర్యాయములు దేవుని సన్నిధికి దూరమయ్యావు? ప్రస్తుతము నీ పరిస్థితి ఏమి? ఆత్మల రక్షణపట్ల దేవుడు కలిగిన మనసు నీకున్నదా? ఇప్పుడే ఆలోచించి సరిచేసుకొనుము.

# 6. మీకా

**గ్రంథకర్త : మీకా** **కాలం : క్రీ.పూ. 750-735**

**మూఖ్యాంశం : పాపమునుబట్టి రానున్న శిక్షలు - నిరీక్షణయైన దేవుని సమకూర్పును గూర్చిన మూడు ప్రకటనలు**

**గ్రంథ ఉద్దేశం :** మీకా లేదా మీకాయా అనే పేరుకు 'యెహోవాను పోలినవాడెవడు' అని అర్థము. పది గోత్రముల ఇశ్రాయేలువారు, రెండు గోత్రముల యూదావారు పాపము చేసినందున దేవుడు వారిని శిక్షించి తదుపరి యూదావారిని విమోచించి సమకూర్చెను. ఈ గ్రంథమందున్న మూడు ప్రకటనలలో 1) వారి పాపము, 2) రానున్న తీర్పు, 3) సమకూర్పు, కాపుదల ముఖ్య అంశములు. ప్రవక్తయైన మీకా యోతాము, ఆహాజు, హిజ్కియా అను యూదా రాజుల కాలములో ప్రకటించాడు. ఇతడు యూదాగోత్ర స్వాస్థమందున్న మెరష్తీయ అను గ్రామమునకు చెందినవాడు. చిన్న గ్రామమునకు చెందినవాడైనను క్రీస్తు పుట్టుక మొదలు రెండవ రాకడ వరకు తెలుపుట గమనించదగినది. మీకా యూదా రాజైన హిజ్కియా దినములలో ప్రవచించాడు (యిర్మీయా 6:16-17). ఈ గ్రంథమందలి ప్రవచనములు ముఖ్యముగా ఇశ్రాయేలువారికి చెందినవైనను, యూదా ప్రజలకును ఇందు ప్రవచనములు కలవు. క్రీస్తు బేత్లెహేములో పుట్టుటను గూర్చిన ప్రవచనము 5:2లో ఉన్నది. ఇశ్రాయేలువారి పాపమునుబట్టి కలుగు అష్షూరు చెర, యూదావారి పాపమునుబట్టి కలుగు బబులోను చెర, అంత్యకాల ఇశ్రాయేలీయుల సమకూర్పు, క్రీస్తు రెండవ రాకడ, భూమి మీదికి దిగివచ్చుట, వెయ్యి ఏండ్ల పాలన ఈ గ్రంథమందు క్లుప్తముగా ప్రవచించబడినవి. ఈ గ్రంథమందు మూడు ప్రకటనలు కలవు. మొదటిది సకల జనులకు, రెండవది ప్రధానులు, అధిపతులకు, మూడవది తన ప్రజలైన ఇశ్రాయేలీయులకు.

**అధ్యాయాల విభజన : 2 + 3 + 2 + = 7 అధ్యాయాలు**

**I. 1-2 అధ్యా.: మొదటి ప్రకటన - సకల జనులకు**

**1 అధ్యా.** సకల జనులపై పాపమునుబట్టి రానున్న శిక్ష

**2 అధ్యా.** ఇశ్రాయేలుకు రానున్న శ్రమలు

**II. 3-5 అధ్యా.: రెండవ ప్రకటన - ప్రధానులకు, అధిపతులకు**

**3 అధ్యా.** అధిపతులకు, ప్రధానులకు పాపమునుబట్టి గద్దింపులు

**4 అధ్యా.** రానున్న మెస్సీయ పాలన

**5 అధ్యా.** పరిపూర్ణుడైన రాజైన మెస్సీయ రెండు రాకడలు

**III. 6-7 అధ్యా.: మూడవ ప్రకటన - ఇశ్రాయేలుకు**

**6 అధ్యా.** నమ్మకమైన దేవుడు – వ్యాజ్యమాడు దేవుడు

**7 అధ్యా.** నిరీక్షణయైన దేవుని కాపుదల

# 1వ అధ్యాయం

వచనముల విభజన – **1 + 3 + 3 + 3 + 3 + 3 = 16**

## అంశం : ప్రజల పాపమునుబట్టి రానున్న శిక్ష – ప్రవక్త ప్రలాపము

**1 వ. ఉపోద్ఘాతము:** మీకా ప్రవక్త హోషేయ, యెషయా ప్రవక్తల కాలములోనే ఇశ్రాయేలు, యూదావారిని గూర్చి ప్రవచించెను.

**2–4 వ. దేవుని శక్తి:** 'ఆలకించుడి' అను పదము ఏడు పర్యాయములు 1:2; 3:1; 3:9; 6:1; 6:2; 6:9; 6:9 లలో కలదు. దేవుని మాటలను తప్పక ఆలకించవలసిన అవసరతను ఏడు సంఖ్య సూచించుచున్నది. ఇశ్రాయేలు ప్రజలకు, యూదారాజైన హిజ్కియా కాలము వరకు ప్రవచించి వారు దేవుని మాట ఆలకించనందున అష్షూరుకు చెరకొని పోయెను. దేవుడు తన స్థలమును విడిచి దిగివచ్చుచున్నాడని పర్వతములు మైనము వలె కరుగునని ఆలకించుడని అనేక మారులు చెప్పినను ఇశ్రాయేలు ప్రజలు దేవుని మాట వినలేదు.

**5–7 వ. పాపమునుబట్టి రానున్న నాశనము:** ఇశ్రాయేలువారు దేవుని మాట వినక తిరుగుబాటు చేయుటను బట్టి షోమ్రోనును రాళ్ళకుప్పగా చేతునని, ప్రతిమలను పడగొట్టుదునని, విగ్రహములను పాడుచేతునని సెలవిచ్చాడు. యూదా ప్రజల శిక్ష ఇప్పుడే కాక ఇంక 130 ఏండ్ల తరువాత జరుగును. కనుక దానిని గురించి చెప్పక ఇశ్రాయేలు వారి శిక్షనుగూర్చియే సెలవిచ్చుచున్నాడు. తిరుగుబాటు చేయుట సోదె చెప్పుట అను పాపముతో సమానమని 1సమూ 15:23లో చెప్పబడెను.

**8–10 వ. ప్రవక్త ప్రార్థన:** 8వ. లో ప్రవక్త కేకలు వేయుట, నక్కలు అరచునట్లు అరచుట, నిప్పుకోడివలె మూల్గుట ప్రార్థనకు సాదృశ్యములు. ఇశ్రాయేలు రాజులకు, ప్రజలకు ప్రార్థనావసరతను తెలియజేయుచున్నాడు.

**11–16 వ. రానున్న శిక్ష:** బేత్లెయఫ్రా అనగా పల్లెటూరి ఇల్లు. షాఫీరు అనగా సొగసైనది. జయనాను అనగా మందలు. బేతేజేలు అనగా పొరుగువాని ఇల్లు. మారోతు అనగా చేను. దీని భావము పల్లెలు, సొగసైన ప్రజలు, మందలు, పొరుగు వారు అందరు పాపమునుబట్టి మేలులను పోగొట్టుకొనినవారై బాధపడుదురని సెలవిచ్చుచున్నాడు. వ.16లో తలను బోడిచేసుకొనుట, ఇశ్రాయేలువారు బానిసలుగా పట్టబడి కొనిపోబడుదురని దాని భావము. ఇందులో 12 పట్టణములకు కలుగు దుర్గతి వివరించబడినది.

# 2వ అధ్యాయం

వచనముల విభజన – **5 + 6 + 2 = 13**

## అంశం : ఇశ్రాయేలుకు రానున్న శ్రమలు

**1-5 వ. శ్రమలు:** ఇశ్రాయేలువారు చేయు దుష్కార్యములను బట్టి 1) వారి భూములు పట్టబడునని, 2) ఇళ్లు ఆక్రమించబడునని, 3) మనుష్యులు, వారి కుటుంబములు చెరపట్టబడునని, 4) గొప్ప అపాయము కలుగునని, 5) తాను కీడుచేతునని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**6-11 వ. అబద్ధ ప్రవక్తలు:** ఇశ్రాయేలువారు సత్యమునకు చెవి ఇవ్వనందున అబద్ధికులు వ్యర్థమైన మాటలను పలుకగా వారే ప్రవక్తలని జనులు నమ్మి మోసపోవుదురు. ఎవరు ప్రవక్తలో కారో గుర్తించలేని స్థితిలో నున్నారు. వారి ప్రవచనములనుబట్టి నిజమైన ప్రవక్తలెవరో గుర్తించగలగాలి.

**12-13 వ. వెయ్యి ఏండ్ల కాల శేషము:** యాకోబు సంతతిలోనున్న యూదావారిని బబులోను చెర తరువాత సమకూర్చి యెరూషలేము దేవాలయము ప్రాకారమును కట్టించును. అంత్యకాలమందు 1) క్రీస్తు – శత్రువుల ప్రాకారములు పడగొట్టి పది గోత్రముల ఇశ్రాయేలువారిని యెరూషలేములో సమకూర్చునని 1:3 చెబుతున్నది. 2) క్రీస్తు వారికి కాపరియై, వారికి ముందుండి మేత స్థలములలో వారిని పోగుచేతునని 12 వ. లో చెబుతున్నాడు. 3) వారికి రాజై నడిపింతుననియు, 4) వారికి నాయకుడుగా నుందునని 13 వ.లో చెప్పుచున్నాడు.

# 3వ అధ్యాయం

వచనముల విభజన – **4 + 4 + 4 = 12**

## అంశం : అధిపతులకు పాపమునుబట్టి గద్దింపులు

**1-4 వ. ప్రధానులకు పాపమునుబట్టి గద్దింపు:** పెద్దలు న్యాయము నెరిగి యుండ వలెను. కాని మేలు నెరిగియుండియు కీడు చేయనిష్ట పడుచున్నారు. జనుల చర్మము ఊడదీసి మాంసమును చీల్చుదురు. దుర్మార్గత ననుసరించుచున్నందున వారి పాపమునకు వారు పశ్చాత్తాప పడనందున వారు ప్రార్థించినను నేను విననని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**5-8 వ. ప్రవక్తలకు పాపమునుబట్టి గద్దింపు:** ప్రధానులవలె పాపములో జీవించు ప్రవక్తలకు తమ పాపమునుబట్టి ఇక దర్శనములు కలుగవని ప్రవక్తలు దీనినిబట్టి సిగ్గుపడుదురని దేవుడు సెలవిచ్చుచున్నాడు. ప్రవక్తలు తమ ప్రసిద్ధినే కోరుకొనుచున్నందున

దేవుడు ఇశ్రాయేలీయులకు వారి పాపములు కనపరచుటకై ఆత్మావేశముతోను, బలముతోను, శక్తితోను, ధైర్యముతోను నింపబడియున్నానని సెలవిచ్చుచున్నాడు.

**9-12 వ. అధిపతులకు, యాజకులకు పాపమునుబట్టి గద్దింపు:** న్యాయమును తృణీకరించి, దుర్నీతిని నీతిగా ఎంచుచున్నారు. ప్రధానులు లంచము పుచ్చుకొని తీర్పు తీర్చుదురు. యాజకులు కూలీకి బోధించుదురు కావున చేను దున్నబడునట్లు సీయోనును దున్నుదునని కొండలపై స్థిరముగా ఉన్న పట్టణము చదునగునని యెహోవా సెలవిచ్చు చున్నాడు.

# 4వ అధ్యాయం

వచనముల విభజన **- 5 + 3 + 2 + 3 = 13**

## అంశం : పాపమునుబట్టి రానున్న క్రీస్తు రాజ్యపాలన

**1-5 వ. సమాధాన రాజ్యము:** అంత్యదినములలో క్రీస్తు వెయ్యి ఏండ్ల పాలన కాలములో యెరూషలేము కేంద్రముగా పైకెత్తబడి ప్రపంచమంతటిని సమాధానముతో పాలించును. అక్కడ మందిరము మరల కట్టబడును. అన్యజనులు అనేకులు అక్కడకు వచ్చి దేవుని యొద్ద విచారింతురు. క్రీస్తుకు చెందిన జనులు అనేకులు వచ్చి విచారింతురు. క్రీస్తే నిజమైన దేవుడు కనుక తమ దేవత అనగా తమ దేవుడైన క్రీస్తును స్మరించాలి. క్రీస్తు తానే మధ్యవర్తియై న్యాయము తీర్చును గనుక యుద్ధము లుండవు. ప్రజలు యుద్ధా యుధములను వ్యవసాయ పనిముట్లుగా చేసికొందురు. గనుక సమాధానముండును. ఈ భాగమంతయు యెషయా 2:1-4లో చూతుము. యెషయా, మీకా ఇద్దరూ సమకాలికులు గనుక ఒకే విషయమును తామున్న వేరువేరు ప్రాంతములలో బోధించుచున్నారు.

**6-8 వ. సీయోను సమకూర్పు:** సీయోనులోనున్న బలహీనులను బలపరుచుదునని దూరదేశములకు చెదరగొట్టబడిన ఇశ్రాయేలును అంత్యకాలములో సమకూర్చి శాశ్వత రాజుగా యెహోవా (యేసు) ఉండి వారిని నిర్భయముగా నుంచుదునని సెలవిచ్చుచున్నాడు.

**9-10 వ. బబులోను రాజ్య పతనము - యూదా విమోచన:** బబులోను రాజ్యము లోనికి బానిసలుగా వెళ్ళిన యూదావారికి రాజులేక, ఆలోచనకర్తలులేక, ప్రసూతి స్త్రీవలె వేదనపడి బబులోను రాజ్యములో ఉండగా 70 ఏండ్ల శిక్ష తరువాత బబులోనీయుల నుండి యూదావారిని విమోచింతునని సెలవిచ్చుచున్నాడు.

**11-13 వ. హర్‌మెగిద్దోను యుద్ధము:** అంత్యకాలములో ఏడేండ్ల శ్రమలకాలచివరలో అన్యజనులనేకులు సీయోనును అపవిత్రపరచవలెనని దాని పైకి రాగా దేవుడు సీయోను చుట్టు ఇనుప, ఇత్తడి శృంగములను ఉంచి ప్రకటన 16:14-15; 19:19-21 లో చెప్పబడినట్లు అన్యజనులందరిని సంహరింతునని సెలవిచ్చుచున్నాడు.

**ప్రకటన 16:14-15 –** "అవి సూచనల చేయునట్టి దయ్యముల ఆత్మలే; అవి సర్వాధికారి యైన దేవుని మహాదినమున జరుగు యుద్ధమునకు లోకమంతట ఉన్న రాజులను పోగుచేయవలెనని వారి యొద్దకు బయలువెళ్ళి హెబ్రీ భాషలో హర్‌మెగిద్దోనను చోటుకు వారిని పోగుచేసెను."

**ప్రకటన 19:19-21 –** "మరియు ఆ తెల్లని గుఱ్ఱముమీద కూర్చున్నవానితోను ఆయన సేనతోను యుద్ధము చేయుటకై ఆ క్రూరమృగమును భూరాజులును వారి సేనలును కూడియుండగా చూచితిని. అప్పుడా మృగమును, దానియెదుట సూచక క్రియలు చేసి దాని ముద్రను వేయించుకొనినవారిని ఆ మృగపు ప్రతిమకు నమస్కరించినవారిని మోసపరచిన ఆ అబద్ధ ప్రవక్తయు, పట్టబడి వారిద్దరు అగ్నిగుండములో వేయబడిరి. కడమవారు గుఱ్ఱముమీద కూర్చున్నవాని నోటనుండి వచ్చిన ఖడ్గముచేత వధింపబడిరి; వారి మాంసమును పక్షులన్నియు కడుపార తినును."

# 5వ అధ్యాయం

వచనముల విభజన – **1 + 2 + 3 + 3 + 6 = 15**

## అంశం : పరిపూర్ణుడైన రాజైన మెస్సీయ రెండు రాకడలు

### 1 వ. ఇశ్రాయేలీయులు న్యాయాధిపతిని కొట్టుట:

**2రాజులు 25:5-8 –** "అయితే కల్దీయులు పట్టణము చుట్టు ఉండగా యూదా రాజగు సిద్కియా మైదానమునకు పోవు మార్గమున వెళ్ళిపోయెను; కల్దీయుల సైన్యము రాజును తరిమి, అతని సైన్యము అతనికి దూరముగా చెదరిపోయినందున యెరికో మైదానమందు అతని పట్టుకొనిరి. వారు రాజును పట్టుకొని రిబ్లా పట్టణమందున్న బబులోను రాజునొద్దకు తీసికొనిపోయినప్పుడు రాజు అతనికి శిక్ష విధించెను. సిద్కియా చూచుచుండగా వారు అతని కుమారులని చంపించి సిద్కియా కన్నులు ఊడదీయించి యిత్తడి సంకెళ్ళతో అతని బంధించి బబులోను పట్టణమునకు తీసికొనిపోయిరి."

**2-3 వ. మెస్సీయ జననము:** క్రీస్తు బేత్లెహేము ఎఫ్రాతాలో పుట్టునని, అది స్వల్ప గ్రామము అనగా క్రీస్తు తృణీకరింపబడును, కాని ఇశ్రాయేలును ఏలువాడుగా (రెండవ రాకడలో) నుండునని, ఆయన శాశ్వతకాలము ప్రత్యక్షమగునని సెలవిచ్చుచున్నాడు. మీకా 5:2 లోని ప్రవచన నెరవేర్పు మత్తయి 2:5లో చూతుము. "అందుకు వారు, యూదయ బేత్లెహేములోనే; ఏలయనగా యూదయదేశపు బేత్లెహేమా . . . ఇశ్రాయేలను నా ప్రజలను పరిపాలించు అధిపతి నీలోనుండి వచ్చును."

**4-6 వ. మందను మేపుట:** ఆయన 1) నిలిచి, 2) యెహోవా బలము పొంది (బలవంతుడు) (యెషయా 9:6), 3) నామ మహాత్మ్యము కలిగి (యేసు నామమందలి శక్తి, అపొ.కా. 3:6), 4) మందను మేపుచు (యోహాను 10:9), 5) వారిని నిలువబెట్టును, 6) భూమ్యంతములు వరకు ప్రభువుడగును, 7) సమాధానమునకు కారకుడగును (సమాధాన అధిపతి, యెషయా 9:6).

**7-9 వ. అంత్యకాల ఆశీర్వాదము:** అంత్యకాలమందు ఇశ్రాయేలువారు 1) యెహోవా కురిపించు మంచువలెను, 2) మనుష్యుల ప్రయత్నము లేకుండా గడ్డిమీద పడు వర్షము వలెను, 3) అడవి మృగములలోని సింహమువలెను, 4) గొర్రెల మందను చీల్చు కొదమ సింహమువలెను, 5) విరోధుల మీదికి హస్తము ఎత్తువారుగాను, 6) శత్రువులను నశింప చేయువారుగాను నుందురు.

**10-15 వ. రాజ్యములోని పవిత్రత - పరిపూర్ణత:** 1) దేశమునకు రథముల, గుర్రముల అవసరత లేకుండా దేవుడు చేయును. 2) చిల్లంగివారు లేకుండను, 3) మంత్రించువారు లేకుండను, 4) చెక్కిన విగ్రహాలు, దేవతా స్థంభములు లేకుండా చేతును. 5) రాజ్యమందున్న దేవుని మాట విని జనములకు ప్రతీకారము, 6) వారి పట్టణములు పడగొట్టి ఇశ్రాయేలును పవిత్రపరతునని చెప్పుచున్నాడు.

# 6వ అధ్యాయం

వచనముల విభజన – **5 + 3 + 4 + 4 = 16**

## అంశం : సమ్మతమైనదేవుడు వ్యాజ్యమాడు దేవుడు

**1–5 వ. దేవుని నమ్మకత్వము:** 1) ఐగుప్తు దేశములోనుండి రప్పించుట. 2) దాసుల గృహము నుండి విమోచించుట. 3) మోషే, అహరోను, మిర్యాముల ద్వారా నడిపించుట, 4) బిలాము ద్వారా ఇశ్రాయేలుపై నున్న దేవుని కాపుదలను గూర్చి బాలాకు రాజునకు వర్తమానమునిచ్చి వారిని కాపాడి కనాను చేర్చుట.

**6–8 వ. ఇశ్రాయేలు కృతజ్ఞత:** దేవుడు ఇశ్రాయేలు పాపమును పరిహరించినందుకు మహోన్నతుని దర్శించుటకు కృతజ్ఞతగా ఏమి తీసుకొని వచ్చినను సరిపోదని ప్రవక్త చెప్పుచున్నాడు. 1) దహనబలులు, 2) ఏడాది దూడలు, 3) వేలాది పొట్టేళ్లు, 4) వేలాది నదులంత విస్తార తైలము, 5) తన జ్యేష్ఠపుత్రుని ఇచ్చినను, 6) గర్భఫలమిచ్చినను సరిపోదని సెలవిచ్చుచున్నాడు. అవన్నియు కాక, 1) న్యాయముగా నడుచుకొని, 2) కనికరము కలిగి, 3) ప్రేమించి, 4) దీనమనస్సు కలిగి ప్రవర్తించవలెనని దేవుడు తన కోరిక చెప్పుచున్నాడు.

**9–12 వ. ప్రజల పాపము:** ఇశ్రాయేలువారు 1) అన్యాయముగా సంపాదించుచున్నారు, 2) హేయమైన కొలలు కలిగియున్నారు, 3) తప్పు త్రాసు, తప్పు రాళ్లు సంచి కలిగియున్నారు, 4) ఐశ్వర్యవంతులు బలత్కారము చేయుదురు, 5) పట్టణస్తులు అబద్ధమాడుదురు, 6) వారి నాలుక కపటముగా మాటలాడును.

**13–16 వ. దేవుని శిక్ష:** 1) పాపమునుబట్టి మొత్తబడుట, 2) భోజనము చేసినను తృప్తి లేకుండుట, 3) పస్తుగా నుండుట, 4) ఏమైన తీసికొనిపోయినను అది మిగుల కుండుట, 5) భద్రము చేసికొనినది దోపుడు కప్పగింపబడుట, 6) విత్తిన విత్తనము పంటకు రాకుండుట, 7) ఒలీవలనూనె గాని, ద్రాక్షారసము గాని ఫలించకుండుట. ఒమ్రీ నియమించిన కట్టడలను, అహాబురాజు యింటివారి పాపపు క్రియలననుసరించినందున పై శిక్షలు ఇశ్రాయేలుకు కలిగినవి.

# 7వ అధ్యాయం

వచనముల విభజన **– 6 + 7 + 7 = 20**

## అంశం : నిరీక్షణయైన దేవుని కాపుదల

**1–6 వ. ఇశ్రాయేలీయుల భక్తిహీనత:** పరిగె నేరుకొనిన పిమ్మట ఏమియు మిగలని రీతిగా దేశములో భక్తుడు ఒకడును లేకపోయెను. ప్రతివారు కిరాతకులై రెండు చేతులతో కీడు చేయుదురు. అధిపతులు బహుమతి కోరుదురు. న్యాయాధిపతులు లంచము పుచ్చు కొందురు. ఇంటివారే విరోధులగుదురు.

**7–13 వ. చీకటిలో వెలుగైన దేవుడు:** పాపమునుబట్టి 1) ఇశ్రాయేలు క్రింద పడి యున్నను, 2) చీకటియందున్నను యెహోవా వెలుగుగా నున్నాడు. 3) కోపాగ్నిని ప్రయోగించిననూ వెలుగులోనికి రప్పించును, 4) దేవుడు నీతిని చూపించును, 5) శత్రువు అవమానము నొందును, 6) వీధిలోని బురదవలె త్రొక్కబడును, 7) ఇశ్రాయేలు సరిహద్దులు విశాలపరచబడును. కనుక నా శత్రువా (సాతానా) నా మీద అతిశయింపవద్దు. ఒక రోజున శత్రువు అవమానమొందునట్లు దేవుడు చేయును.

**14–17 వ. కాపాడి, పాపములను క్షమించు దేవుడు:** దేవుడు తన జనులకు అద్భుతములను కనుపరచి ప్రత్యేకముగా నివసింపజేసి, మేపి కాపాడును.

**18–20 వ. తనవారి దోషమును పరిహరించును:** పాపములను సముద్రపు అగాధములో పడవేయును. ప్రకటన 20:1 లో సముద్రమును లేకుండా చేయగా పాపము ఎక్కడను లేకపోవును. వాగ్దానము చేసి సత్యమును, కనికరమును, పరిశుద్ధతను అనుగ్రహించును. దోషములను పరిహరించి, అతిక్రమములను క్షమించు దేవుడైన ఈయనతో సముడైనవాడు లేడని, యెహోవా అసమానుడని తెలుపుచున్నాడు.

❉ ❉ ❉ ❉ ❉

# 7. నహూము

**గ్రంథకర్త : నహూము** **కాలం : క్రీ.పూ. 760**

**ముఖ్యాంశం : నీనెవె పట్టణము నాశనము - యూదాకు కలుగు విమోచననుబట్టి ఆదరణ**

**గ్రంథ ఉద్దేశం :** నీనెవె పట్టణము యొక్క నాశనమును వివరించుటకు వ్రాయబడెను. నీనెవె పాపము చాలా భయంకరమైనది. ఒకప్పుడు నీనెవె పాపమునుబట్టి దేవుడు నాశనము చేయతలంచగా యోనా ప్రకటన ద్వారా వారు మార్చబడిన కారణమున దేవుడు ఆ పట్టణమును నాశనము చేయక కాపాడెను. యోనా తరువాత ఇంచుమించు 80 సంవత్సరాలకు నీనెవె గర్వించి నరహత్య, వ్యభిచారము, చిల్లంగితనము మొదలైన భయంకర పాపములతో జీవించుచు ఒకప్పుడు రక్షించిన దేవుని మరచి విగ్రహారాధికులైన కారణంగా ఈ భయంకర శిక్ష వారికి సంభవించింది. ఎవనికి ఎక్కువగా ఇయ్యబడెనో వానియొద్ద ఎక్కువగా తీయజూతురు (లూకా 12:48). అనేక పట్టణములను, దేశములను నాశనము చేసిన ఈ నీనెవెకు సమూల నాశనము విధించబడెను. నీనెవె పట్టణము అష్షూరు దేశమునకు రాజధాని. అష్షూరు రాజైన సన్హెరీబు గర్వించి యెహోవా దేవుని ఇట్లు తూలనాడెను.

2రాజులు 19వ అధ్యాయములో యెరూషలేము అష్షూరు రాజు చేతికి అప్పగింపబడినదని చెప్పి, నీవు నమ్ముకొనియున్న నీ దేవునిచేత మోసపోకుము అని హిజ్కియాకు కబురంపెను. దానిని సవాలుగా గైకొనిన దేవుడు ప్రవక్తయైన యెషయా ద్వారా హిజ్కియాకు వర్తమానము పంపెను. సన్హెరీబు భయపెట్టినది హిజ్కియాను కాదు, యెహోవా దేవునినే అనుచు సన్హెరీబును సంబోధించుచు, నీవు ఎవరిని తిరస్కరించితివి? ఎవనిని దూషించితివి? ఇశ్రాయేలీయుల పరిశుద్ధ దేవునినే గదా! అని వర్తమానము పంపెను. ఆ రాత్రియే యెహోవా దూత బయలుదేరి అష్షూరు దండుపేటలో జొచ్చి లక్ష యెనుబది అయిదు వేలమందిని హతము చేసెను.

ఈ సమయమున నహూము ప్రవక్త ద్వారా యెరూషలేములోనే సన్హెరీబుకు ప్రవచనము చెప్పబడియుండవచ్చును. దీని తరువాత సన్హెరీబు తిరిగి నీనెవెకు పోయెను. ఆ నీనెవెకు కలుగు పతనమును గూర్చి నహూము ప్రవచన ప్రకారము రాజు చంపబడెను. గలతీ 6:7లో చెప్పబడినట్లు, 'మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు, మనుష్యుడు దేనిని విత్తునో దానినే కోయును' అన్నట్లు విత్తిన దానినే నీనెవె కోసికొనెను. ఇది దేవుని కట్టడ. నహూము అను పేరుకు 'ఆదరణ' అని అర్థము. పేరుకు తగినట్లు ఇశ్రాయేలువారికి కలుగు ఆదరణను ప్రవచించెను. ముందుగా నాశనమును గూర్చిన ప్రవచనము చెప్పి, దానిని వివరించి ఎందుకు నాశనము చేయుచున్నాడో దాని కారణములు చెప్పుచున్నాడు.

**అధ్యాయాల విభజన :**

**I. 1 అధ్యా.** **: నీనెవె నాశనమును గూర్చిన ప్రవచనము**

**II. 2 అధ్యా.** **: నీనెవె నాశన వివరము**

**III. 3 అధ్యా.** **: నీనెవె నాశన కారణములు**

# 1వ అధ్యాయం

వచనముల విభజన - **7 + 7 + 1 = 15**

## అంశం : నీనెవె నాశనము గూర్చిన ప్రవచనము

**1-6 వ. దోషులను శిక్షించి (వ.3), ఆశ్రయించువారిని రక్షించు దేవుడు (7వ.):** దేవుని వ్యక్తిగత లక్షణములు: 1) రోషము గలవాడు - దీర్ఘశాంతుడు, 2) ప్రతీకారము చేయువాడు, 3) మహోగ్రత గలవాడు - మహాబలము గలవాడు, 4) విరోధులపై కోపముంచువాడు - దోషులను నిర్దోషులుగా ఎంచడు.

**సృష్టిపై అధికారము:** 1) తుఫానులోను, సుడిగాలిలోను వచ్చువాడు, 2) మేఘములను పాదధూళిగా గలవాడు, 3) సముద్రమును గద్దించి ఆరిపో చేయువాడు, 4) నదులను ఎండిపోచేయువాడు, 5) ఆయన భయమునకు పర్వతములు కంపించును, 6) కొండలు కరిగిపోవును, 7) భూమి కంపించును, 8) భూనివాసులు వణకుదురు, 9) ఆయన కోపము అగ్నివలె పారును.

**7 వ.** 1) ఆయన ఉత్తముడు, 2) శ్రమదినమందు ఆశ్రయుడు, 3) తనయందు నమ్మిక యుంచువారిని ఎరుగును.

**8-14 వ. నీనెవెకు రానున్న శిక్ష:** నీనెవె అష్షూరు దేశమునకు ముఖ్యపట్టణము.

**2రాజులు 18:35 -** "యెహోవా మా చేతిలోనుండి యెరూషలేమును విడిపించుననుటకు ఆయా దేశముల దేవతలలో ఏదైనను తన దేశమును మా చేతిలో నుండి విడిపించినదా అని చెప్పెను." అష్షూరువారు ఈ రీతిగా యెహోవాపై దురాలోచన చేసినందున బొత్తిగా నివారణ చేతునని, చెత్తవలె కాల్చి నిర్మూలము చేతునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. అష్షూరీయుల ద్వారా ఇశ్రాయేలును దేవుడు క్రమశిక్షగా గతములో బాధించాడు. ఇశ్రాయేలును ఇక బాధింపనని, బాధించిన అష్షూరును సంహరించి సమాధికి సిద్ధపరతునని సెలవిచ్చుచున్నాడు.

**15 వ. అంత్యకాల యూదా విమోచన:** యూదాను బాధించినవారు నాశన మగుదురని యూదా పండుగల నాచరించుచు మ్రొక్కుబడులు చెల్లించుచు, సమాధానముగా నుందుదురన్న వార్త యూదాకు తెలియపరచబడెను. దీని సమీప నెరవేర్పుగా బబులోను చెర తరువాత క్రీ.శ. 515 లో మందిరము కట్టబడి బలులు అర్పించబడుట ఎజ్రా 6:17-21లో చూతుము.

**ఎజ్రా 6:16-21 –** “ఇశ్రాయేలీయులును యాజకులు లేవీయులు బబులోను చెరలోనుండి విడుదల నొందిన తక్కినవారును దేవుని మందిరమును ఆనందముతో ప్రతిష్ఠించిరి. దేవుని మందిరమును ప్రతిష్ఠించినపుడు నూరు ఎడ్లను రెండు వందల పొట్టేళ్ళను నాలుగు వందల గొఱ్ఱెపిల్లలను ఇశ్రాయేలీయులందరికిని పాపపరిహార్థ బలిగా ఇశ్రాయేలీయుల గోత్రముల లెక్కచొప్పున పండ్రెండు మేకపోతులను అర్పించిరి. చెరలో నుండి విడుదల నొందినవారు మొదటి నెల పదునాలుగవ దినమున పస్కా పండుగ ఆచరించిరి. చెరలోనుండి విడుదలనొంది తిరిగి వచ్చిన ఇశ్రాయేలీయులును, ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవాను ఆశ్రయించుటకై దేశమందుండు అన్యజనులతో అపవిత్రత నుండి తమ్మును తాము ప్రత్యేకించుకొనిన వారందరును వచ్చి తిని పులియని రొట్టెల పండుగను ఏడు దినములు ఆనందముతో ఆచరించిరి.” అంత్యకాలమందు వెయ్యి ఏండ్ల పాలనలో కూడా యూదాకు ఇట్టి స్థితి కలుగును.

# 2వ అధ్యాయం

వచనముల విభజన – **2 + 2 + 2 + 2 + 2 + 2 + 1 = 13**

## అంశం : నీనెవె నాశన వివరము

**1-2 వ. నాశనము గూర్చిన హెచ్చరిక:** లయకర్త నీనెవెపైకి వచ్చుచున్నాడనియు, నీనెవెవారు దుర్గములకు మార్గములకు కావలి కాసి బహుగా ఎదిరింతురని హెచ్చరించు చున్నాడు. ఇశ్రాయేలువారి ద్రాక్షావల్లులు నరికివేయబడినను యెహోవా వాటిని వారికి మరల అనుగ్రహించునని సెలవిచ్చుచున్నాడు. ఆది 12:3 లో అబ్రాహాముతో, నిన్ను శపించువారిని శపించెదను అన్నందున ఇశ్రాయేలు ద్రాక్షావల్లిగా నుండగా అష్షూరీయులు నరికినందున వారిని సంహరింతునని చెప్పుచున్నాడు.

**3-4 వ. సైన్యము – ఆయుధ నాశనము:** అష్షూరీయులు బలాఢ్యులు, పరాక్రమ శాలురు, రక్తవర్ణపు వస్త్రములు ధరించియున్నారు. కాని వారి ఈటెలు నాశనమాయెను. రథములు ఒకదానిపై నొకటి పడుచు నాశనమాయెను.

**51-6 వ. ఓటమినిబట్టి రోదనము:** రాజు నమ్ముకొనిన పరాక్రమశాలురు పడి పోయిరి కనుక రాజు రోదించుచున్నాడు. నదుల దగ్గర గుమ్మములు తెరువబడగా పట్టణములు పడిపోవుచున్నవి.

**7-8 వ. జనుల స్థితి:** జనులు మూల్గుచు దిగంబరులుగా కొనిపోబడుదురు. దాస దాసీలు రొమ్ముకొట్టుకొందురు. జనులు తమ అధిపతిని చూడక పారిపోవుదురు.

**9-10 వ. ధనము దోచుకొనబడుట:** వెండి, బంగారములు దోచుకొనబడినవి. లెక్కలేనన్ని విచిత్ర ఉపకరణములు వట్టివిగాను, శూన్యముగాను, పాడుగా ఉన్నవి. దేశము యొక్క ఆర్థిక పతనమునుబట్టి జనుల హృదయములు కరిగి, మోకాళ్ళు వణికి, నడుములు నొచ్చి ముఖములు తెల్లబోవుచున్నవి.

**11-12 వ. నాశనము బట్టి ప్రవక్త ఆశ్చర్యము:** ఆర్థిక పతనము, సైన్య నాశనమును బట్టి ప్రవక్త ఆశ్చర్యపడి అనేక ప్రశ్నలతో నిండియున్నాడు.

**13 వ. నాశన వివరము తెలుపు యెహోవా వాక్కు:** 1) రథములను కాల్చి వేతునని, 2) కొదమ సింహములు అనగా సైన్యాధిపతులు కత్తిచే చంపబడునని, 3) యెర తీసి వేయబడునని, 4) హెచ్చరిక చేయు దూతల శబ్దము ఇక వినబడదని యెహోవా వాక్కు ద్వారా సెలవిచ్చుచున్నాడు.

# 3వ అధ్యాయం

వచనముల విభజన **-3 + 4 + 4 + 4 + 4 = 19**

## అంశం : నీనెవె నాశనమునకు కారణములు

**1-3 వ. నీనెవె చరిత్రనుబట్టి నాశనము:** ఎడతెగక మోసముతోను, బలాత్కారము తోను నిండిన పట్టణము. నరహత్య చేసిన పట్టణము కావున నాశనమునకు తగినదిగా పట్టణ చరిత్రను బట్టి తెలియుచున్నది. మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును అని గలతీ 6:7లో చెప్పబడినట్లు అష్షూరీయులు ఇశ్రాయేలీయులకు ఏమి చేసిరో దానినో అనుభవించుచున్నారు.

**4-7 వ. నిర్ణయింపబడిన కాలము:** 1) విరోధినైయై, 2) మానమును బయలుపరతు ననెను, 3) పదిమంది ఎదుట మాలిన్యము వేసి అవమానపరుతుననెను, 4) అంగలార్చు వారులేక ఓదార్చువారులేక యుందురు.

**8-11 వ. ఐగుప్తు గుణములుగల నీనెవె:** ఐగుప్తు సముద్రమును తనకు ఆపుగాను, ప్రాణముగాను చేసుకొని బహుజనులు గల, ప్రపంచ ఖ్యాతిగల నైలునది దగ్గర నుండిన పట్టణములు గల దేశమై నిశ్చింతగా నుండెను. నీనెవె కూడా అటువంటి గుణములనే కలిగియుండెను.

**11-15 వ. ఐగుప్తు వలె నాశనమగు నీనెవె:** 1) కోటలు బలహీనముగా ఉన్నవి, 2) జనులు స్త్రీలవలె నున్నారు, 3) దేశపు గవునులు తీయబడినవి, 4) ఇటుకలను కాల్చు ఆవమును నీనెవె సిద్ధపరచగా అందులోనే ఆ పట్టణము కాల్చివేయబడును, 5) ఖడ్గముచే జనులు కూలుదురు, 6) గొంగళిపురుగువలె శత్రువు తినివేయును.

**16-19 వ. నీనెవె నిర్విచారమునుబట్టి కలిగిన నాశనము:** అందరు నిర్విచారముగా నుండిరి. 1) కాపరులు నిద్రపోయిరి, 2) ప్రధానులు పండుకొనిరి, 3) జనులు పర్వతములపై చెదరిపోయిరి, 4) సమకూర్చు వాడొకడును లేడు, 5) సైనికులు ఎగిరిపోయిన గొంగళిపురుగువలె నున్నారు, 6) నీనెవెకు తగిన దెబ్బ బహు గొప్పది, 7) గాయములకు ఎవడును చికిత్స చేయజాలడు. అందువలన నీనెవె నాశనమొందెను. ఈ వార్త వినువారు చప్పట్లు కొట్టి సంతోషింతురు. దీని నెరవేర్పుగా బబులోను రాజు చేతిలో క్రీ.పూ. 606లో నీనెవె పట్టణము ఓడిపోయి పతనమాయెను.

# 8. హబక్కూకు

గ్రంథకర్త : హబక్కూకు                                కాలం : క్రీ.పూ. 607

**మూఖ్యాంశం : యూదాపట్ల, బబులోనీయుల పట్ల దేవుని తీర్పుల గూర్చి ప్రవక్త ప్రార్థన - దేవుని జవాబు - దేవుని స్తుతించుట**

**గ్రంథ ఉద్దేశం :** హబక్కూకు అనే పేరుకు 'హత్తుకొనుట' అని అర్థము. యూదావారు అంత్యమందు ప్రభువును హత్తుకొని ప్రార్థించి స్తుతించుటను సూచించును.

**అధ్యాయాల విభజన :**

**I. 1 అధ్యా. : యూదా ప్రజల పాపమునకై ప్రవక్త ప్రార్థన - జవాబు - కల్దీయుల దుర్మార్గతకై ప్రవక్త ప్రార్థన**

**II. 2 అధ్యా. : కల్దీయుల దుర్మార్గతకై ప్రవక్త ప్రార్థనకు జవాబుగా కల్దీయులపై రానున్న ఏడు శ్రమలు**

**III. 3 అధ్యా.: దేవుని మహిమ ప్రభావములను బట్టి ఆయన కార్యములను బట్టి దేవుని స్తుతించుట**

## 1వ అధ్యాయం

వచనముల విభజన - **4 + 7 + 6 = 17**

### అంశం : యూదా ప్రజల పాపముకై ప్రవక్త ప్రార్థన - జవాబు - కల్దీయుల దుర్మార్గతకై ప్రవక్త ప్రార్థన

**1-4 వ. యూదా ప్రజల పాపమును గూర్చి ప్రవక్త ప్రార్థన:** యూదాలో నున్న బలత్కారములు, జగడములు, కలహములనుబట్టి ధర్మశాస్త్రము నిరర్థకము కాగా ప్రవక్త ప్రభువుకు ప్రార్థించుచున్నాడు.

**5-11 వ. కల్దీయుల ద్వారా యూదా వారిని శిక్షించుదునని దేవుడు జవాబిచ్చుట:** యూదావారు దేవుని విడిచి విగ్రహములను పూజించినందున గలతీ 6:7 ప్రకారము విత్తిన దానిని కోయుదురన్నట్లు యూదావారిని శిక్షించుటకై కల్దీయులను లేపుచున్నానని సెలవిచ్చెను. కల్దీయులు భీకరమైన జనము. చిరుతపులి జంతువులన్నిటిలో గంటకు 80

మైళ్ళు వేగముతో పరుగెత్తును. వారు చిరుతపులి కంటే వేగముగా పరుగెత్తువారు. తోడేళ్ళకంటే చురుకుగాను, పక్షులకంటే వేగముగా వత్తురని (వ. 7–8) సెలవిస్తున్నాడు. వారు జనులను చెరపట్టుదురని, రాజులను అపహాస్యము చేతురని, అధిపతులను హేళన చేతురని, యూదా పట్టణములన్ని పట్టబడునని సెలవిచ్చాడు.

**12–17 వ. కల్దీయుల దుర్మార్గతకై ప్రవక్త ప్రార్థన:** పైనున్న 5–11 వచనాలలోని దుర్మార్గమైన కల్దీయుల ప్రవర్తనను బట్టి యూదావారికి కలుగు నష్టమును బట్టి ప్రవక్త ప్రార్థించుచు దేవుని శ్రేష్ఠమైన గుణమును జ్ఞాపకము చేయుచున్నాడు (వ. 13). "నీ కనుదృష్టి దుష్టత్వము చూడలేనంత నిష్కళంకమైనది." కనుక కల్దీయులను ఎప్పుడు శిక్షించుదువని దేవుని ప్రార్థించుచున్నాడు. జవాబుగా యిర్మీయా 25:12 చూతము.

**యిర్మీయా 25:12 –** "డెబ్బది సంవత్సరములు గడిచిన తరువాత వారి దోషములను బట్టి నేను బబులోను రాజును ఆ జనులను కల్దీయుల దేశమును శిక్షింతును; ఆ దేశము ఎప్పుడు పాడుగనుండునట్లు నియమింతును అని సుమారు వంద సంవత్సరముల ముందు చెప్పిన మాటను స్థిరపరచుచున్నాను."

# 2వ అధ్యాయం

వచనముల విభజన – **6 + 5 + 3 + 3 + 3 = 20**

## అంశం : కల్దీయుల దుర్మార్గతకై ప్రవక్త చేసిన ప్రార్థనకు జవాబుగా కల్దీయులపై రానున్న ఏడు శ్రమలు

**1–6 వ. కల్దీయులపై రానున్న రెండు శ్రమలు:** యూదావారిలో నీతిమంతులైనవారు విశ్వాసముచేత బ్రతుకుదురు. తమను బట్టి కల్దీయులు అతిశయించిరి. సకల జనులను సమకూర్చిరి. ఈ వచనము క్రొత్త నిబంధనలో మూడుసార్లు చెప్పబడినది. రక్షణ సందర్భముగాను విశ్వాస జీవితములో సాగునట్లుగాను చెప్పబడినది. మార్టిన్ లూథర్ ద్వారా సంస్కరణ వచ్చుటకు ఈ వచనము ముఖ్యము.

**1) రోమా 1:16–17 –** "సువార్తనుగూర్చి నేను సిగ్గుపడువాడను కాను. అది దేవుని శక్తియై యున్నది. ఎందుకనిన నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించునని వ్రాయబడిన ప్రకారము విశ్వాస మూలముగా అంతకంతకు విశ్వాసము కలుగునట్లు దేవుని నీతి దానియందు బయలుపరచబడుచున్నది."

**2) గలతీ 3:11 -** "ధర్మశాస్త్రముచేత ఎవడును దేవుని యెదుట నీతిమంతుడని తీర్చబడడను సంగతి స్పష్టమే. ఏలయనగా నీతిమంతులు విశ్వాసమూలముగా జీవించును."

**3) హెబ్రీ 10:38 -** "నా యెదుట నీతిమంతుడైనవాడు విశ్వాసమూలముగా జీవించునుగాని అతడు వెనుకతీసిన యెడల అతనియందు నా ఆత్మకు సంతోష ముండదు."

1) తమవి కానివానిని కల్దీయులు ఆక్రమించినందున శ్రమలు కలుగునన్నాడు.

2) తాకట్టు సొమ్మును విస్తారముగా పట్టుకొనినందున శ్రమపరచుచున్నాడు.

**7-11 వ. కల్దీయులపై మూడవ శ్రమ:** తమ కొరకు, తమ ఇంటివారి కొరకు అన్యాయముగా లాభము సంపాదించుకొనువారికి శ్రమ అని సెలవిచ్చుచున్నాడు. ఆది 12:3లోని 'నిన్ను శపించువారిని శపింతునని' దేవుడు అబ్రాహాముకు చేసిన వాగ్దానమును బట్టి ఇశ్రాయేలీయులను బాధించిన అష్షూరీయులను ఇప్పుడు శిక్షించాడు. అలాగే యూదా వారిని బాధించిన కల్దీయులను శిక్షించును.

**12-17 వ. కల్దీయులపై నాలుగవ, అయిదవ శ్రమలు:** 4) నరహత్య చేసి పట్టణమును కట్టించువారికి శ్రమయనియు, 5) దుష్టత్వము జరిగించి కోటను స్థాపించు వారికి శ్రమయనియు సెలవిచ్చుచున్నాడు. దేవుడు నెబుకద్నెజరుకు శిక్షగా ఏడు కాలములు పశువుగా గడ్డి మేయుటకు అడవిలోనికి పంపాడు (దాని 4:4-37).

**దాని 4:33-34 -** "ఆ గడియలోనే ఆలాగున నెబుకద్నెజరునకు సంభవించెను; మానవులలో నుండి అతని తరిమిరి, అతడు పశువుల వలె గడ్డిమేసెను, ఆకాశమందు అతని దేహమును తడపగా అతని తలవెంట్రుకలు పక్షిరాజు రెక్కల ఈకలవంటివియు అతని గోళ్లు పక్షుల గోళ్ళవంటివియు నాయెను. ఆ కాలము గడిచిన పిమ్మట నెబుకద్నెజరను నేను మరల మానవబుద్ధి గలవాడనై నా కండ్లు ఆకాశము తట్టు ఎత్తి, చిరంజీవియు సర్వోన్నతుడునగు దేవునికి స్తోత్రముచేసి ఘనపరచి స్తుతించితిని; ఆయన ఆధిపత్యము చిరకాలమువరకు ఆయన రాజ్యము తరతరములకునున్నవి."

**15-17 వ. కల్దీయులపై ఆరవ శ్రమ:** పొరుగువారి మానము చూడవలెనని ఉగ్రతను కలిపి త్రాగనిచ్చి మత్తులుగా చేయువారికి శ్రమ.

**18-20 వ. కల్దీయులపై ఏడవ శ్రమ:** కఱ్ఱను, మూగరాతిని ప్రార్థించువారికి శ్రమ అని చెప్పుచున్నాడు.

# 3వ అధ్యాయం

వచనముల విభజన – **3 + 3 + 3 + 4 + 3 + 3 = 19**

## అంశం : దేవుని మహిమ ప్రభావములను బట్టి ఆయన కార్యములనుబట్టి దేవుని స్తుతించుట

**1–3 వ. పీఠిక:** సంవత్సరములు గడుచుచుండగా నూతన కార్యముల కొరకై ప్రవక్త ప్రార్థన. ప్రవక్తయైన హబక్కూకు చేసిన ప్రార్థన (వాద్యములతో పాడదగినది). యెహోవా, నిన్ను గూర్చిన వార్త విని నేను భయపడుచున్నాను. యెహోవా, సంవత్సరములు జరుగు చుండగా నీ కార్యము నూతనపరచుము. సంవత్సరములు జరుగుచుండగా దానిని తెలియజేయుము. కోపించుచునే వాత్సల్యము జ్ఞాపకమునకు తెచ్చుకొనుము. సంవత్సరములు జరుగుచుండగా అనగా,

**యిర్మీయా 25:11 –** "ఈ జనులు డెబ్బది సంవత్సరములు బబులోను రాజునకు దాసులుగా ఉందురు. ఈ దేశమంతయు పాడుగాను నిర్జనముగాను ఉండును." **యిర్మీయా 29:10 –** "బబులోను రాజ్యమునకు డెబ్బది సంవత్సరములు గతించిన తరువాత మిమ్మునుగూర్చి నేను పలికిన శుభవార్త నెరవేర్చి యీ స్థలమునకు తిరిగి రప్పించునట్లు నేను మిమ్మును దర్శింతును అని దేవుడు చెప్పిన మాటలు జ్ఞాపకము చేయుచున్నాడు. దేవుడు నూతన కార్యములు చేయవలెనని ఎదురుచూచుచున్నాడు. యూదావారి పాపమును బట్టి దేవుడు కోపించిననూ ఆయన గుణమగు వాత్సల్యమును జ్ఞాపకము చేసికొనుమని ప్రార్థించుచున్నాడు. సంవత్సరములు జరుగుచుండగా మనలో జరుగవలసిన నాలుగు నూతన కార్యములు క్రింద చెప్పబడినవి. వ.4–6, 10–13, 15–16, 17–19).

**4–6 వ. దేవుని మహిమ ప్రభావములు జ్ఞాపకము చేసుకొనుట:** ఆకాశమందున్న ఆయన మహిమను (కీర్తన 113:4,5), భూమియందున్న ప్రభావమును (57:5), ఆయన ప్రభావమును, బలమును (సామెతలు 18:10) జ్ఞాపకము చేయుచున్నాడు. ఆయన పాదముల వెంటనున్న అగ్ని మెరుపులను బట్టి భూమి కంపించును. పర్వతములు బ్రద్దలైపోవును. ప్రవక్త వీటిని జ్ఞాపకము చేసుకొను చున్నాడు.

**కీర్తన 113:4–5 –** "యెహోవా అన్యజనులందరి యెదుట మహోన్నతుడు, ఆయన మహిమ ఆకాశ విశాలమున వ్యాపించియున్నది. ఉన్నతమందు ఆసీనుడైయున్న మన దేవుడైన యెహోవాను పోలియున్నవాడెవడు?"

**కీర్తన 57:5 –** "దేవా, ఆకాశముకంటె అత్యున్నతుడవుగా నిన్ను కనుపరచుకొనుము. నీ ప్రభావము సర్వభూమి మీద కనబడనిమ్ము."

**సామెతలు 18:10 –** "యెహోవా నామము బలమైన దుర్గము. నీతిమంతుడు అందులోనికి పరుగెత్తి సురక్షితముగా నుండును."

**7-9 వ. అన్యులపై, సృష్టిపై దేవుని కోపమును జ్ఞాపకము చేసికొనుట:** అన్యజనుల డేరాలు గజగజ వణకునని, నదులపైన సముద్రముపైన దేవుని ఉగ్రత కలుగునని సెలవిచ్చుచున్నాడు.

**10-13 వ. దేవుని శక్తిని జ్ఞాపకము చేసికొనుట:** దేవుని శక్తికి భూమి బ్రద్దలగునని పర్వతములు కంపించునని, సూర్యచంద్రులు తమ నివాసములతో ఆగిపోవునంతటి శక్తిగల దేవుడు జనులను రక్షించుటకు బయలుదేరుచున్నాడు. దుష్టులను ఖండించి నిర్మూలము చేయును. యెహోషువ 10:12-15 లో ఇశ్రాయేలీయులు అమోరీయులతో యుద్ధమందు సూర్యుని ఒక దినమంత అస్తమించకుండా ఆపెను. దేవుని శక్తి ఎంత గొప్పదో తలపోసుకోవాలి.

**యెహో 10:12-15–** "యెహోవా ఇశ్రాయేలీయుల యెదుట అమోరీయులను అప్పగించిన దినమున, ఇశ్రాయేలీయులు వినుచుండగా యెహోషువ యెహోవాకు ప్రార్థన చేసెను. సూర్యుడా, నీవు గిబియోనులో నిలువుము. చంద్రుడా, నీవు అయ్యాలోను లోయలో నిలువుము. జనులు తమ శత్రువుల మీద పగతీర్చుకొనువరకు సూర్యుడు నిలిచెను. చంద్రుడు ఆగెను. సూర్యుడు ఆకాశమధ్యమున నిలిచి యించుమించు ఒకనాడెల్ల అస్తమింప త్వరపడలేదు. యెహోవా ఒక నరుని మనవి వినిన ఆ దినము వంటి దినము దానికి ముందేగాని దానికి తరువాతేగాని యుండలేదు."

**14-16 వ. యూదులపై వచ్చిన శ్రమలు జ్ఞాపకము చేసికొనుట:** ప్రస్తుతము యూదులపైకి వచ్చిన శ్రమలనుబట్టి ప్రవక్త అంతరంగమందు, శరీరమందు కలవరపడుచున్న ప్రవక్త స్థితిని చూచుచున్నాము.

**17-19 వ. దేవునియందే నమ్మకము, ఆనందము కలిగియుండి స్తుతించుట:** దేవుని మహిమను, ప్రభావమును 4-6 వచనాలలోను, ఆయన శక్తిని 10-13 వచనాలలోను జ్ఞాపకము చేసికొనినందున ప్రస్తుతము రానున్న బబులోను చెరనుబట్టి యూదులు చెరకు పోయినప్పుడు అంజూరపు చెట్లు పూయకుండినను ద్రాక్షాచెట్లు ఫలింపకపోయినను, ఓలీవ చెట్లు కాపులేకపోయినను యెహోవా రక్షణకర్తయైనందున శిక్షించినను విమోచించునను నిరీక్షణ కలిగి యెహోవా దేవునియందు ఆనందించి సంతోషించునని, స్తుతింతునని తెలియజేయుచున్నాడు. ఆలాగే మనము శ్రమలలో నున్నపుడు దేవుడు విడుదల దయచేయునని విశ్వసించి, శ్రమలలోనే ముందుగానే స్తుతింతుట నేర్చుకొందము.

❊ ❊ ❊ ❊ ❊

# 9. జెఫన్యా

**గ్రంథకర్త : జెఫన్యా** **కాలం : క్రీ.పూ. 625-608**

**ముఖ్యాంశం : యూదావారి పాపములు - రానున్న శిక్ష, విడుదల**

**గ్రంథ ఉద్దేశం :** జెఫన్యా రాజైన హిజ్కియా కుమారుడగు గెదల్యాకు మనుమడు. జెఫన్యా అను పేరుకు 'యెహోవా దాచును' లేదా 'యెహోవా కాపాడును' అని అర్థము. దాని ప్రకారముగా 3:3 లో ఉగ్రత దినమున వారిని దాచునని దేవుడు సెలవిచ్చాడు. ఉగ్రత దినమునుగూర్చి సుమారు 16 పర్యాయములు ఈ గ్రంథమందు ప్రస్తావించి, జరుగబోవు వీటినిగూర్చి సెలవిచ్చాడు. యూదారాజగు యోషీయా దినములలో జెఫన్యా ప్రకటించాడు. యూదావారి పాపములు, రానున్న శిక్ష దేవుడు కాపాడుట ద్వారా కలుగబోవు విమోచన గ్రంథ సారాంశము. రాజైన హిజ్కియా కాలమందు అష్షూరురాజు యూదాపైకి దండెత్తి రాగా హిజ్కియా భక్తిని బట్టి దేవుడు దూతను (బహుశా యేసు) పంపి 1,85,000 మందిని సంహరించి (2రాజులు19:29-37) యూదావారిని కాపాడెను. కాని యూదావారి రాజులలో చివరి నలుగురు భక్తిహీనులు కనుక క్రమశిక్షగా బబులోను చెరకు పంపి, తదుపరి విమోచించాడు.

**అధ్యాయాల విభజన :**

**I. 1 అధ్యా. : యూదాపై దేవుని తీర్పును గూర్చిన హెచ్చరిక**

**II. 2 అధ్యా. : శత్రువులైన అన్యజనులపై దేవుని తీర్పును గూర్చిన హెచ్చరిక**

**III. 3 అధ్యా. : యెరూషలేము పట్టణమునకు రానున్న శ్రమ - ప్రభువు దినమును గూర్చిన హెచ్చరిక**

## 1వ అధ్యాయం

వచనముల విభజన - **6 + 6 + 6 = 18**

### అంశం : యూదాపై రానున్న దేవుని తీర్పు

**1-3 వ. ఏమి చేయనైయున్నాడో (1-3వ.), ఎందుకు చేయనైయున్నాడో దేవుడు వివరించుట (4-6వ.):** భూమి మీదనున్న సమస్త వ్యక్తులను (యూదాను), పశువులను, సముద్ర మత్స్యములను ఊడ్చి నిర్మూలము చేతునని సెలవిచ్చుచున్నాడు. రాజైన హిజ్కియా

భక్తినిబట్టి సుమారు 180 సంవత్సరముల క్రితము క్రీ.పూ. 720 లో అష్షూరీయుల నుండి కాపాడినాడు. ఇప్పుడు రాజులు, ప్రజలు యెహోవాను అనుసరింపక విసర్జించిరి.

**2 రాజులు 19:32-37 -** "అష్షూరురాజు ఈ పట్టణములోనికి రాడు; దానిమీద ఒక బాణమైన ప్రయోగింపడు; ఒక కేడెమునైన దానికి కనుపరచడు; దానియెదుట ముట్టడి దిబ్బ కట్టడు. ఈ పట్టణములోనికి రాక తాను వచ్చిన మార్గముననే అతడు తిరిగిపోవును; నా నిమిత్తమును నా సేవకుడైన దావీదు నిమిత్తమును నేను ఈ పట్టణమును కాపాడి రక్షించుదును. ఆ రాత్రియే యెహోవా దూత అష్షూరువారి దండుపేటలోజొచ్చి లక్ష యెనుబదియయిదు వేలమందిని హతముచేసెను. ఉదయమున జనులు లేచిచూడగా వారందరును మృతకళేబరములై యుండిరి. అష్షూరురాజైన సన్హెరీబు తిరిగిపోయి నీనెవె పట్టణమునకు వచ్చి నివసించిన తరువాత అతు నిస్రోకు అను తన దేవత మందిరమందు మ్రొక్కుచుండగా అతని కుమారులు ఖడ్గముతో అతని చంపిరి.

**4-6 వ.** యూదా వారిలో ఏడు రకములవారికి 1) బయలుదేవత భక్తులను, 2) అర్చకులను, 3) ఆకాశ సమూహములకు మ్రొక్కువారిని, 4) బయలును రాజను వారిని, 5) యెహోవాను అనుసరించనివారిని, 6) ఆయనను విసర్జించినవారిని, 7) ఆయన యొద్ద విచారణ చేయనివారిని నిర్మూలించెదనని సెలవిచ్చుచున్నాడు.

**7-12 వ. అధిపతులపైన (7-8వ.), ఆర్థిక నాయకులపైన (9-12వ.) రానున్న దేవుని తీర్పు:** రాజ్య సంబంధ అధిపతులను శిక్షింతునని (7-8వ.), బలత్కారులను శిక్షింతునని (9-10వ.), అన్యాయముగా ద్రవ్యము సమకూర్చుకొను వారందరిని నిర్మూలము చేయుదునని (11-12వ.) సెలవిచ్చుచున్నాడు. 2రాజులు 25:5-7 లో రాజైన సిద్కియాను అతని కుమారులు శిక్షించిరి.

**2రాజులు 25:5-7 -** "కల్దీయులు పట్టణము చుట్టు ఉండగా రాజు మైదానమునకు పోవు మార్గమున వెళ్ళిపోయెను; కల్దీయుల సైన్యము రాజును తరిమి, అతని సైన్యము అతనికి దూరముగా చెదరిపోయినందున యెరికో మైదానమందు అతని పట్టుకొనిరి. వారు రాజును పట్టుకొని రిబ్లా పట్టణమందున్న బబులోను రాజునొద్దకు తీసికొనిపోయి నప్పుడు రాజు అతనికి శిక్ష విధించెను. సిద్కియా చూచుచుండగా వారు అతని కుమారులను చంపించి సిద్కియా కన్నులు ఊడదీయించి యిత్తడి సంకెళ్లతో అతని బంధించి బబులోను పట్టణమునకు తీసికొనిపోయిరి."

**13-18 వ. రానున్న ప్రభువు దినము (13-16వ.)- నాశన వివరము (17-18వ):** ఆస్తులు, ఇండ్లు, తోటలు నాశనమగునని 13వ.లో చెప్పుచున్నాడు. 14-16వ.లలో ప్రభువు దినమును వివరించాడు. వ.17-18 లలో కలుగబోయే ఉపద్రవములను చెప్పుచున్నాడు. జనులు యెహోవా దృష్టికి పాపము చేసినందున ఆ నాశనము కలుగునని సెలవిచ్చుచున్నాడు.

# 2వ అధ్యాయం

వచనముల విభజన **– 3 + 4 + 4 + 4 = 15**

## అంశం : శత్రువులైన అన్యజనులపై దేవుని తీర్పును గూర్చిన హెచ్చరిక

**1–3 వ. పశ్చాత్తాపమునకై పిలుపు:** దేవుని ఉగ్రత కుమ్మరింపక మునుపే యూదా వారు వినయము గలవారై దేవుని వెదకుడని సెలవిచ్చుచున్నాడు.

**4–7 వ. ఫిలిష్తీయులపై రానున్న తీర్పు:** ఫిలిష్తీయుల ముఖ్య పట్టణములగు గాజా, ఎక్రోను, అష్కెలోను, అష్టోదు నాశనమగునని యూదా కటాక్షింపబడునని సెలవిచ్చు చున్నాడు.

**8–11 వ. మోయాబు, అమ్మోనీయులపై రానున్న తీర్పులు:** వీరు యూదా వారిని దూషించినందున వారి పట్టణములు సొదమ, గొమొఱ్ఱా పట్టణములవలె పాడగునని సెలవిచ్చుచున్నాడు.

**12–15 వ. కూషీయులు, అష్షూరీయులపై రానున్న తీర్పు:** కూషీయులను ఖడ్గముతో సంహరింతునని నీనెవె నిర్విచార స్థితినిబట్టి, పట్టణములను, ఇళ్లను, ప్రజలను నాశనము చేతునని సకల జాతిపక్షులు, జంతువులు, మందలు అక్కడ నివసించునని చెప్పుచున్నాడు.

# 3వ అధ్యాయం

వచనముల విభజన **– 7 + 6 + 7 = 20**

## అంశం : యెరూషలేముపై రానున్న శ్రమలు – ప్రభువు దినమును గూర్చిన హెచ్చరికలు

**1–7 వ. యెరూషలేముపై పాపమునుబట్టి రానున్న శ్రమలు:** 1,2వ. – యూదా ప్రజల గతకాల పాపములు చెప్పబడినవి : 1) దేవుని మాట ఆలకించలేదు, 2) శిక్షకు లోబడదు, 3) దేవునిలో విశ్వాసముంచదు, 4) దేవుని యొద్దకు రాదు.

**3–4 వ. ప్రస్తుతకాల పాపములు చెప్పబడినవి:** 1) **A.** దేశాధిపతులు – 1) అధిపతులు సింహాలవలె గర్జించుదురు, 2) న్యాయాధిపతులు భక్షించు తోడేళ్ళు. **B.** మతాధిపతులు – 3) ప్రవక్తలు గప్పాలు కొట్టువారు, 4) యాజకులు ధర్మశాస్త్రము నిరాకరించుదురు.

**5 వ.** వారి మధ్యనున్న న్యాయము తీర్చు దేవుని దేశాధిపతులు కానీ, మతాధిపతులు కానీ గుర్తించలేదు.

**6-7 వ.** దేవుడు శత్రువును నాశనము చేసిన విధమును చూసి (వ. 6) యూదా దేవుని శిక్షకు లోబడునని దేవుడు అభిలషించెను (వ. 7). కాని యూదావారు లోబడనందున క్రమశిక్షగా శ్రమలను పంపుదునని సెలవిచ్చుచున్నాడు.

**8-13 వ. రానున్న ప్రభువు దినమునుబట్టి ప్రభువు కొరకు కనిపెట్టుకొనవలెనన్న హెచ్చరిక:** రానున్న ప్రభువు దినమున దేవుడు తన ఉగ్రతను యూదాపై కుమ్మరించుటకు అన్యజనులను పోగుచేతునని వ. 8 లో చెప్పుచున్నాడు. అప్పుడు యెహోవా నామమున జనులు సేవించునట్లు వారికి పవిత్ర పెదవులనిత్తునని, దూరదేశములకు చెదరిపోయిన యూదావారు నైవేద్యము తీసుకొని వత్తురని వ. 9-10 లలో చెప్పుచున్నాడు. ఇశ్రాయేలు పాపము చేయకుండా నెమ్మది కలిగి విశ్రాంతిగా నుందురని వ. 11-13లలో చెప్పుచున్నాడు. ఏడేండ్ల శ్రమల మహాశ్రమల కాలమున (వ. 8), తదుపరి వెయ్యి ఏండ్ల కాలములో నెరవేరును (వ. 9-13).

**14-20 వ. యెహోవాయందు ఆనందించవలెనన్న హెచ్చరిక:** దేవుడు యూదాపై విధించిన శిక్షను కొట్టివేసినందున యెరూషలేము నివాసులు పూర్ణ హృదయముతో సంతోషించి గంతులు వేయవలెనని చెప్పుచున్నాడు. ఇకమీదట అపాయమేమి సంభవించదనియు, భూమి మీదనున్న జనులందరి మధ్య ఇశ్రాయేలుకు ఖ్యాతి, మంచిపేరు వెయ్యి తరముల వరకు కలిగింతునని చెప్పుచున్నాడు (కీర్తన 105:8).

**కీర్తన 105:7-9 –** "మన దేవుడైన యెహోవా తీర్పులు భూమియందంతట జరుగుచున్నవి. తాను సెలవిచ్చిన మాటను వెయ్యి తరముల వరకు అబ్రాహాముతో తాను చేసిన నిబంధనను ఇస్సాకుతో తాను చేసిన ప్రమాణమును నిత్యము ఆయన జ్ఞాపకము చేసికొనును."

❊ ❊ ❊ ❊ ❊

# 10. హగ్గయి

**గ్రంథకర్త : హగ్గయి** **కాలం : క్రీ.పూ. 520**

**మూఖ్యాంశం : యెరూషలేములోని మందిర నిర్మాణమును గూర్చిన నాలుగు యెహోవా వాక్కు ప్రత్యక్షతలు, పారశీకరాజైన దర్యావేషు ఏలుబడియందు రెండవ సంవత్సరమందు ప్రకటించుట**

**గ్రంథ ఉద్దేశం :** హగ్గయి అను పేరుకు 'పండుగ' అని అర్థము. యూదావారి పాపమునుబట్టి ప్రజలు క్రీ.పూ. 606, 597, 586 లలో బబులోను చెరకు వెళ్లుట మాత్రమే కాక క్రీ.పూ. 586 లో యెరూషలేము దేవాలయము పట్టణము పడగొట్టబడి నాశనమాయెను. ఎజ్రా 2 అధ్యాయములో జెరుబ్బాబెలు, యెహోషువల నాయకత్వమున సుమారు 50 వేలమంది ప్రజలు క్రీ.పూ. 536లో తిరిగి వచ్చిరి. క్రీ.పూ. 535 లో ఎజ్రా 3 అధ్యాయములో మందిర నిర్మాణము ప్రారంభమై వెంటనే 4వ అధ్యాయములో ఆగిపోయెను. కాని తమ ఇండ్లు కట్టుకొనిరి (ఎజ్రా 4:112-24). నాయకులను, ప్రజలను నిర్మాణముకై హగ్గయి, జెకర్యాలు ఎజ్రా 5:1-2 లలో ప్రకటించి క్రీ.పూ. 520 లో సహాయము చేయగా పని జరిగినది. హగ్గయి ద్వారా గద్దించుచూ, ప్రోత్సహించుచూ నున్న యెహోవా వాక్కు నాలుగు ప్రత్యక్షతలు ఈ గ్రంథమందు కలవు. 1) మందిర నిర్మాణముకై ప్రజలను పురికొల్పుట (1:1-15); 2) యెహోవా ప్రజలతో నున్నాడని ఆదరించుచు, కడవరి మందిర మహిమ మొదటి మందిర మహిమను మించునని దేవుడు సెలవిచ్చుట (2:1-9); 3) యెహోవా ఆశీర్వాదమును గూర్చిన వర్తమానము (2:10-19); 4) ముందున్న మహిమను గూర్చిన వర్తమానము (2:20-23).

**అధ్యాయాల విభజన :**

| | | |
|---|---|---|
| **I.** | **1:1-11** | **: యెహోవా వాక్కు మొదటి ప్రత్యక్షత – దేవుని మందిర నిర్మాణ అవసరతను గూర్చిన వర్తమానము** |
| **II.** | **1:12-15** | **: ప్రజలు విధేయతను చూపి మందిర నిర్మాణము ప్రారంభించుటను గూర్చిన వర్తమానము** |
| **III.** | **2:1-9** | **: రెండవ ప్రత్యక్షత – పని జరిగించుటకు ధైర్యము తెచ్చుకొనవలెనన్న హెచ్చరికతో కూడిన వర్తమానము** |
| **IV.** | **2:10-19** | **: మూడవ ప్రత్యక్షత – పరిశుద్ధతను గూర్చి, స్థిరతను గూర్చిన వర్తమానము** |
| **V.** | **2:20-23** | **: నాలుగవ ప్రత్యక్షత – భవిషత్తును గూర్చిన హెచ్చరికతో కూడిన వర్తమానము** |

# 1వ అధ్యాయం

వచనముల విభజన **- 3 + 3 + 3 + 4 + 4 = 17**

## అంశం : మందిర నిర్మాణ అవసరత - ప్రజల విధేయత

**1-6 వ. మందిర నిర్మాణ అవసరత (మొదటి ప్రత్యక్షత):** క్రీ.పూ. 586లో మందిరము పాడై క్రీ.పూ. 536 వరకు 50 ఏండ్లు గడిచిన పిదప కోరెషురాజు ఆజ్ఞ ద్వారా, యెహోషువ, జెరుబ్బాబెలుల నాయకత్వమున నిర్మాణము ప్రారంభమాయెను. ఎజ్రా 4:12 ప్రకారము ప్రజలు మందిరముతోపాటు, పట్టణమును అనగా తమ ఇండ్లు కట్టుకొనిరి. అందుచేత రాజు ఆటంకపరచుటనుబట్టి మందిరము పని ఆగిపోయెను. కొందరు తమ ఇండ్లు కట్టి అందు నివసించిరి. మరికొందరు కట్టుటకు త్వరపడిరి. బబులోను చెర 70 ఏండ్లని యిర్మీయా ద్వారా సెలవియ్యగా మందిరము కూడా 70 ఏండ్లు పాడుగా నుండవలెనని ప్రజలు తలంచిరి కాబోలు. సమయమింకా రాలేదు. యెహోవా మందిరమును కట్టుటకు సమయమింకా రాలేదని జనులు చెప్పుకొనుచుండిరి. కాని తమ ఇండ్లను కట్టుకొని నివసించిరి. మందిరము పాడై యుండగా మీ ఇండ్లలో నివసించుటకిది సమయమా అని దేవుడు ప్రశ్నించుచు మందిర నిర్మాణ అవసరతను తెలుపుచున్నాడు (5-6 వ.). అందుకే భోజనము చేసినను ఆకలి తీరకయున్నదని, దాహము తీరకయున్నదని, చలి ఆగకయున్నదని ఆశీర్వాదము లేదని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**7-8 వ. మందిరము నిర్మించవలెనన్న ఆజ్ఞ:** దేవుని ఆజ్ఞనుబట్టి పశ్చాత్తాపపడి మందిరమునకు అవసరమైన మ్రానులను పర్వతములెక్కి తీసికొని వచ్చి కట్టిన యెడల తాను సంతోషింతునని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**9-11 వ. ఆశీర్వాదము లేని కారణము:** మందిరము పాడైయుండగా ప్రజలంతా తమ తమ ఇంట్లు కట్టుకొనుటకు త్వరపడుచూ పంటలు కావలెనని ఎదురుచూచిరి. కాని మందిరమును గూర్చి మనసులేక యుండిరి.కాని దేవుడు ఆకాశపు మంచును కురిపింప నందున భూమి పండలేదు. దేవుడు పర్వతములకు అనావృష్టిని ధాన్య, ద్రాక్షారసము, తైలము, పశువుల విషయములోను, చేతిపనులన్నిటిలోను క్షామము పుట్టించినందున ఆశీర్వాదము లేని స్థితియందుండిరి. మనమందరము మన జీవితములో ఆశీర్వాదమున్నదో లేదో పరీక్షించుకొనాలి.

**12-15 వ. మందిర నిర్మాణ ప్రారంభం:** దేవుని ఆజ్ఞకు విధేయతగా 12వ. లో మొదటిగా, 1) యెహోవా మాటలాలకించి, 2) దేవుని యందు భయ భక్తులు పూనిరి. కావున వ.13లో దేవుడు హగ్గయి ద్వారా 3) వారికి తోడుగా నున్నాని సెలవిచ్చెను. యెహోవా జెరుబ్బాబెలు మనసును, యెహోషువ మనసును 4) ప్రజల మనసును ప్రేరేపించగా వ.14లో, అందరును కూడివచ్చి వ.15లో, 5) మందిరపు పని చేయ మొదలుపెట్టిరి. ఈ గ్రంథము చదువు ప్రతి ఒక్కరు తాము దేవుని ఆజ్ఞకు విధేయులై తమ జీవితములో ఆపివేసిన పనిని ప్రారంభించారో లేదో గమనించాలి.

# 2వ అధ్యాయం

వచనముల విభజన – **9 + 10 + 4 = 23**

## అంశం : పని జరిగించుటకు ధైర్యపరచుట – పవిత్రతను గూర్చి, భవిష్యత్తును గూర్చి వర్తమానములు చెప్పుట

**1-9 వ. పని జరిగించుటకు ధైర్యము తెచ్చుకొనవలెనన్న హెచ్చరిక (రెండవ ప్రత్యక్షత):** పూర్వకాలము సొలొమోను కట్టించిన మందిర మహిమను చూచినవారికి ఇది కొద్దివిగా కనిపించినట్లు ఎజ్రా 3:12లో చూతుము. ఎజ్రా 6:1-4లో చెప్పబడిన మందిరపు కొలతలనుబట్టి ఆలోచించినను ఇది చిన్న మందిరమే.

**ఎజ్రా 3:12–** "మునుపటి మందిరమును చూచిన యాజకులలోను లేవీయులలోను కుటుంబ ప్రధానులలోను వృద్ధులైన అనేకులు ఇప్పుడు వేయబడిన యీ మందిరము యొక్క పునాదిని చూచి గొప్ప శబ్దముతో ఏడ్చిరి.

**ఎజ్రా 6:3–** "రాజైన కోరెషు ఏలుబడిలో మొదటి సంవత్సరమందు అతడు యెరూషలేములో ఉండు దేవుని మందిరమును గూర్చి నిర్ణయించినది బలులు అర్పింప తగిన స్థలముగా మందిరము కట్టింపబడవలెను; దాని పునాదులు గట్టిగా వేయబడ వలెను; దాని నిడివి అరువది మూరలును దాని వెడల్పు అరువదిమూరలును ఉండ వలెను." సొలొమోను మందిరముతో ఏ మాత్రము పోలినది కాదని తోచు చున్నందున జెరుబ్బాబెలును, యెహోషువను, శేషించిన ప్రజలను ధైర్యము తెచ్చుకొని పనిజరిగించు మని దేవుడు సెలవిచ్చాడు. కడవరి మందిర మహిమ అనగా నేటి కాల ఆత్మీయ మందిర మహిమ మొదటి మందిర మహిమను మించునని సెలవిచ్చాడు. దీని నెరవేర్పు ప్రస్తుతమందలి ఆత్మీయ మందిరమందు దేవుని మహిమ మించుట నెరవేరుచున్నది.

**10-19 వ. పరిశుద్ధతను, స్థిరతను గూర్చిన హెచ్చరిక (మూడవ ప్రత్యక్షత):** ప్రజలు తమ క్రియలచేత అపవిత్రులైనందున వారు దేవునికి అర్పించు అర్పణలు అపవిత్రమైనందున వారి ధాన్య ద్రాక్షారసముల పంటలో ఆశీర్వాదము లేదని మందిర పని ప్రారంభించబడినది మొదలు దేవుని ఆశీర్వాదము వారికి కలుగునని చెప్పుచున్నాడు. పవిత్రతకు రెండు ఉదాహరణలు: 1) 11-12వ, 2) 13వ లలో చెప్పుచున్నాడు.

**20-23 వ. భవిష్యత్తును గూర్చిన హెచ్చరిక (నాలుగవ ప్రత్యక్షత):** అంత్యదినములో ఆకాశమును భూమిని కంపింపజేతునని రాబోవు అపాయకరమైన కాలములను గూర్చి అనగా ప్రకటన 6-19 అధ్యాయములలో చెప్పబడిన ఏడేండ్ల శ్రమల కాలమును గూర్చి వ.21-22లలో చెప్పుచున్నాడు. జెరుబ్బాబెలును ముద్ర ఉంగరముగా (అధికారిగా) చేసుకొన్నానని ప్రవచనముగా రాబోవు వెయ్యి ఏండ్ల కాలములోని రాజాధి రాజైన యేసు కలిగియుండు సర్వాధికారమును గూర్చి సెలవిచ్చుచున్నాడు. జెరు అనగా 'చిగురు' అని అర్థము. దేవుని చిగురు, యేసయ్య. క్రీస్తుకు జెరుబ్బాబెలు పోలికగా చూతుము.

# 11. జెకర్యా

**గ్రంథకర్త : జెకర్యా** **కాలం : క్రీ.పూ. 520-518**

**మూఖ్యాంశం : మందిరము కట్టబడుట - మెస్సీయ రాకడల గూర్చిన ప్రవచనములు**

**గ్రంథ ఉద్దేశం :** బబులోను చెరనుండి తిరిగి వచ్చిన యూదులు జెరుబ్బాబెలు, యెహోషువల నాయకత్వమున యెరూషలేము దేవాలయమును క్రీ.పూ. 535లో కట్టుటకు ప్రారంభించి ఆపివేసిరి. హగ్గయి, జెకర్యాలు ప్రోత్సహించగా (ఎజ్రా 5:1) తిరిగి ప్రారంభించిరి. ఈ కాలములో జెకర్యాకు కలిగిన 10 దర్శనముల ద్వారా దేవుని కృపను, తీర్పులను గూర్చి మొదటి 6 ఆధ్యాయములలో బోధించెను. 7-8 అధ్యాయములందు యూదావారి నాలుగు ఉపవాసముల గూర్చిన ప్రశ్నకు నాలుగు జవాబులు కలవు. చివరి 6 అధ్యాయాలలో మెస్సీయ రెండు రాకడలు కలవు. 9-11 అధ్యా.లలో మొదటి రాకడను, 12-14 అధ్యా.లలో రెండవ రాకడను వివరించాడు. మొదటి రాకడలో ప్రభువు 1) యెరూషలేము ప్రవేశమును (9:9) వివరించెను. 2) ప్రభువు వెండిరూకలకు అమ్మబడుటను గూర్చి చెప్పెను (11:13), 3) రెండవ రాకడలో ప్రభువు ఒలీవల కొండపైకి వచ్చుటను (14:4), 4) వెయ్యి ఏండ్ల పాలనను (14:9) వివరించెను. ఇందలి అనేక ప్రవచనములు అంత్యకాలమునకు చెందినవి. జెకర్యా బెరక్యా కుమారుడు. ఇతని పేరుకు 'యెహోవా చూచుకొనును' అని అర్థము. పారశీక రాజైన దర్యావేషు ఏలుబడియందు రెండవ సంవత్సరము నుండి నాలుగవ సంవత్సరము వరకు ప్రకటించెను.

**అధ్యాయాల విభజన :** 6 + 2 + 6 = 14

**A. I. 1-6 అధ్యా. : దేవుని కృప - తీర్పుల గూర్చిన 10 దర్శనములు**

**1-4 అధ్యా. : దేవుని కృపను గూర్చిన 7 దర్శనములు**

**1 అధ్యా. : 1) గొంజిచెట్ల మధ్యనున్న మనుష్యులు - గుర్రములు, 2) నాలుగు కొమ్ములు, 3) నలుగురు కంసాలుల దర్శనము**

**2 అధ్యా. : 4) కొలనూలు పట్టుకొనిన ఒకని గూర్చిన దర్శనము**

**3 అధ్యా. : 5) యెహోవా దూత ఎదుటనున్న యెహోషువను గూర్చిన ధర్శనము, 6) యెహోషువ ఎదుటనున్న రాయి, ఏడు నేత్రముల గూర్చిన దర్శనము**

**4 అధ్యా. : 7) సువర్ణ దీపస్థంభము, రెండు ఒలీవ చెట్లను గూర్చిన దర్శనము**

**II. 5-6 అధ్యా.: దేవుని తీర్పుల గూర్చిన 3 దర్శనములు**

5 అధ్యా. : 8) ఎగిరిపోవు పుస్తకము, 9) కొలతూము, అందులో కూర్చున్న స్త్రీని గూర్చిన దర్శనములు

6 అధ్యా. : 10) నాలుగు రథములను గూర్చిన దర్శనము

**B. III. 7-8 అధ్యా.: నాలుగు ఉపవాసములను గూర్చిన ప్రశ్నకు జవాబులు**

7 అధ్యా. : 1) అవిధేయతను (1-7వ.) బట్టియే, 2) నాశనము (8-14వ.)

8 అధ్యా. : 3) దేవుడు రోషము కలిగి (1-6వ.), జనులను రక్షించి (7-12వ.) ఆశీర్వదించును (13-17వ.), 4) ఉపవాసములు పండుగలగును (18-23వ.)

C. 9-11 అధ్యా.: ప్రభువు రెండు రాకడలు, యూదా విమోచన, శత్రునాశనమును గూర్చిన రెండు దేవోక్తులు

**IV. 9-11 అధ్యా.: ప్రభువు మొదటి రాకడలోని విషయాలను వివరించు మొదటి దేవోక్తి**

9 అధ్యా. : పొరుగు దేశాలపై తీర్పుల (1-9వ.) - మెస్సీయ రెండు రాకడలు, విమోచన (10-17వ.)

10 అధ్యా. : విమోచకుడగు క్రీస్తు (1-4వ.) - విమోచన (5-8వ.) - సమకూర్పు, విస్తరణ (9-12వ.)

11 అధ్యా. : మంద కాపరి మెస్సీయ అను క్రీస్తు తృణీకరించబడుట (1-4వ.), పనికిమాలిన కాపరులు (15-17వ.)

**V. 12-14 అధ్యా.: ప్రభువు రెండవ రాకడలోని విషయాలను వివరించు రెండవ దేవోక్తి**

12 అధ్యా. : మెస్సీయ రాకడ - విమోచన

13 అధ్యా. : మెస్సీయ కొట్టబడుట

14 అధ్యా. : మెస్సీయ విజయము

# 1వ అధ్యాయం

వచనముల విభజన – **6 + 5 + 6 + 4 = 21**

## అంశం : దేవుని కృపను గూర్చిన మూడు దర్శనములు

**1–6 వ. ఉపోద్ఘాతము:** దుష్టక్రియలు మాని దేవునితట్టు తిరుగుడని దేవుడిచ్చిన ఆజ్ఞను పితరులు తృణీకరించినందున దేవుడు కోపగించెనని యూదావారు దేవుని వైపు తిరిగిన యెడల దేవుడు వారి వైపునకు తిరుగుదునని మూడు దర్శనముల ద్వారా సెలవిచ్చు చున్నాడు.

**7–13 వ. 1) గొంజిచెట్ల మధ్యనున్న ఎఱ్ఱని గుఱ్ఱముపై కూర్చున్న మనుష్యుని గూర్చిన దర్శనము:** గొంజిచెట్ల మధ్య ఎఱ్ఱని గుఱ్ఱము నెక్కిన మనుష్యుడు ప్రభువు గాను, మిగిలినవారు సేవకులైన దూతలని తలంచగలము. లోయలోనున్న గొంజిచెట్లు అన్యుల పాలన క్రిందనున్న యూదా జనాంగము. సేవకులైన దూతలు భూలోకమంత తిరిగివచ్చి యూదావారిని చెరగొనిపోయిన బబులోనువారు. అప్పుడు పాలించుచున్న మాదీయ పారశీకులు నెమ్మదిగా నుండి యూదులను తమ ఆధీనమందుంచు కొన్నారని చెప్పిరి.

**12–17 వ. మెస్సీయ ప్రార్థన – యెహోవా జవాబు:** యూదాను 70 ఏండ్లు చెరకు పంపి కోపగించిన యెహోవాను ఇక ఎన్నాళ్ళకు కనికరింతువని మెస్సీయ ప్రార్థించెను. జవాబుగా యెహోవా ఇట్లు చెప్పెను, దేవుని కోపమునుబట్టి దిద్దుబాటుకై యూదాను బబులోనుకు చెరగా పంపగా వారు బహుగా కీడుచేసిరని, దేవుడిప్పుడు యెరూషలేముపై వాత్సల్యముతో తిరిగి మందిరమును, యెరూషలేము పట్టణమును మరల కట్టించునని యూదాను ఓదార్చి, తాను కోరుకొనిన ప్రజలుగా చేసికొందునని జవాబిచ్చాడు.

**18–19 వ. 2) నాలుగు కొమ్ముల దర్శనము:** ప్రవక్త తేరిచూడగా నాలుగు కొమ్ములు కనిపించెను. కొమ్ము అధికారమునకు శిక్షకు గురుతు. ఈ నాలుగు కొమ్ములగు 1) బబులోను, 2) మాదీయ – పారశీక, 3) గ్రీకులు, 4) రోమా అను నలుగురు రాజుల వశమునకు వరుసగా యూదావారు అప్పగింపబడిరి. వారిచే యూదులు శిక్షింపబడిరి.

**20–23 వ. 3) నలుగురు కంసాలుల దర్శనము:** 1) బబులోనువారిని పడగొట్టుటకు మాదీయ పారశీకులను, 2) పారశీకులను పడగొట్టుటకు గ్రీకులను, 3). గ్రీకులను పడగొట్టుటకు రోమీయులను, 4) రోము వారిని పడగొట్టుటకు మతపరమైన రోమా రాజ్యమును, లేదా క్రీస్తును కంసాలులుగా దేవుడు పంపాడు.

# 2వ అధ్యాయం

వచనముల విభజన **– 4 + 5 + 4 = 13**

## అంశం : కొలనూలు పట్టుకొన్న ఒకని గూర్చిన దర్శనము

**1-4 వ. 4) కొలనూలు పట్టుకొనిన యొకని గూర్చిన దర్శనము:** నీవెక్కడకు వెళ్ళు చున్నావని ప్రవక్త అతని నడుగగా యెరూషలేము పొడవును, వెడల్పును కొలువబోవుచున్నట్లు తెలిపెను. ఇంతలో మరొక దూత యెరూషలేము విస్తారమైన ప్రజలు, పశువులు కలిగి ప్రాకారములు లేని పట్టణమువలె నున్నదని మొదటి దూత ద్వారా ప్రవక్తకు తెలిపెను. ప్రాకారము లేకపోవుట అనగా దేవుని కాపుదలకు అప్పగించుకొనలేదు కనుక భద్రత లేదు.

**5-9 వ. దేవుని కృపగల కార్యము:** కృపగల దేవుడు ఇకమీదట యూదావారికి తానే ప్రాకారమై వారిమధ్య నివసించి మహిమపరుతునని సెలవిచ్చాడు. చెదరివున్న యూదావారినందరిని సమకూర్చుదునని అన్యజనులందరి మీద దేవుడు చేయి ఆడించి, వారిని యూదులకు దోపుడు సొమ్ముగా చేతునని సెలవిచ్చాడు. యూదావారికి కీడు చేయుటకు ముట్టినవాడు తన కనుగుడ్డును ముట్టుటతో సమానమని చెప్పుచున్నాడు.

**10-13 వ. యూదావారు సంతోషించవలెనన్న హెచ్చరిక:** దేవుడు తన పరిశుద్ధ నివాసము విడిచి, యూదావారి మధ్యకు వచ్చి నివసించెదనని, యూదా యెరూషలేమును స్వతంత్రించుకొనునని, అన్యజనులు అనేకులు యెహోవా వైపు తిరుగుదురని, యూదావారు సంతోషించి పాటలు పాడవలెనని సెలవిచ్చాడు. యూదాను దేవుడు తన స్వాస్థ్యముగా కోరుకొని తన పరిశుద్ధ స్థలమును విడిచి వచ్చుచున్నాడు. అనగా యేసుగా రక్షకుడుగా మొదటి రాకడలోను క్రీస్తుగా (తీర్పు తీర్చు అధికారిగా) రెండవ రాకడలో ప్రభువు వచ్చుటను సూచించును. అన్యజనులు అనేకులు యెహోవావైపు తిరుగుట నేటి కాల సంఘములలో నుండు అన్యులను సూచించును.

# 3వ అధ్యాయం

వచనముల విభజన – **5 + 3 + 2 = 10**

## అంశం : యెహోషువను గూర్చిన దర్శనము – యెహోషువ ఎదుటనున్న రాయి, దాని ఏడు కన్నుల గూర్చిన దర్శనము (దేశము యాజకత్వము పరిశుద్ధపరచబడుట)

**1–5 వ. 5) యెహోషువను గూర్చిన దర్శనము. యెహోషువ మైలబట్టలు తీసివేయబడి ప్రశస్థ వస్త్రములతో అలంకరించబడుట:** మైలబట్టలు ధరించుకొనిన యెహోషువ మీద సాతాను ఫిర్యాదుచేసి, యూదా ప్రజలలో పాపము కలదని, యెహోషువ యాజకత్వమునకు తగడని చెప్పెను. కాని ప్రభువు యెహోషువ అగ్నిలో నుండి తీయబడిన కొరివి, అనగా దేవుడు తన అగ్ని ద్వారా పవిత్రపరచెనని సెలవిచ్చి, మలిన వస్త్రములు తీసివేసి ప్రశస్థ వస్త్రములతో అలంకరించుట, తిరిగి యెహోషువను తన పనికి ప్రతిష్ఠించు చున్నానని సెలవిచ్చాడు. పనికి పవిత్రత ప్రాముఖ్యము.

**6–8 వ. యెహోషువకు దేవుడిచ్చిన సెలవు:** 1) దేవుని మార్గములలో నడవాలి. 2) అప్పగింపబడిన దానిని భద్రముగా గైకొనాలి. 3) మందిరము మీద అధికారిగా నుండాలి. 4) ఆవరణలను కాపాడాలి. 5) దేవుని సన్నిధిని నిలుచు భాగ్యమివ్వబడినది. 6) సహకారులుగా ఎదుట కూర్చుండువారి నిచ్చుచున్నాను. 7) వారు యెహోషువ మాటలను, దేవుని మాటలను ఆలకించాలి. ఇందులో యాజకులముగా మనము చేయవలసిన పనిని గుర్తించుదము గాక. చిగురు అను సేవకుని రప్పింపబోవు చున్నానని యేసు ప్రభువు సేవకుడుగా వచ్చు మొదటి రాకడను గూర్చి తెలిపెను.

**9–10 వ. 6) యెహోషువ ఎదుట నుంచిన రాతిని గూర్చిన దర్శనము:** ఈ రాయి యేసును సూచించును. చెక్కబడుట యేసు మొదటి రాకడలో సిలువ వేయబడిన అనుభవమును సూచించును. రాతియొక్క ఏడు నేత్రములు దేవుని ఏడు ఆత్మలకు గురుతు (ప్రకటన 5:6). ఒక దినములోగానే వారి దోషమును పరిహరించుట క్రీస్తు రెండవ రాకడలో ఒలీవల కొండపైదిగి అన్యులను సంహరించి ఇశ్రాయేలు దోషమును పరిహరించుటను రోమా 11:26; యెషయా 27:9; యెహెజ్కేలు 22:14; 36:24 వచనములు సూచించును. ఏడేండ్ల శ్రమల కాలము చివరలో జరుగు హర్మెగిద్దోను యుద్ధ సమయమున జరుగును (ప్రకటన 19:11–21). **ప్రకటన 19:19–21–** “మరియు ఆ గుఱ్ఱముమీద కూర్చున్నవానితోను ఆయన సేనతోను యుద్ధము చేయుటకై ఆ క్రూరమృగమును భూరాజులును వారి సేనలును కూడియుండగా చూచితిని. అప్పుడా మృగమును, దానియెదుట సూచక క్రియలు చేసి దాని ముద్రను వేయించుకొనినవారిని ఆ మృగపు ప్రతిమకు నమస్కరించినవారిని మోసపరచిన ఆ అబద్ధ ప్రవక్తయు, పట్టబడి వారిద్దరు కడమవారు గుఱ్ఱము మీద కూర్చున్న వాని నోటనుండి వచ్చిన ఖడ్గముచేత వధింపబడిరి; వారి మాంసమును పక్షులన్నియు కడుపార తినెను. **రోమా 11:26–27–**

“వారు ప్రవేశించునప్పుడు విమోచకుడు సీయోనులోనుండి వచ్చి యాకోబులో నుండి భక్తిహీనతను తొలగించును; నేను వారి పాపములను పరిహరించినప్పుడు నావలన వారికి కలుగు నిబంధన ఇదియే అని వ్రాయబడినట్లు ఇశ్రాయేలు జనులందరును రక్షింపబడుదురు. ద్రాక్షాచెట్ల క్రింద ఒలీవ చెట్ల క్రింద నిర్భయముగా కూర్చుండుట తదుపరి జరుగు వేయి ఏండ్లకాల పాలనను సూచించును.

# 4వ అధ్యాయం

వచనముల విభజన **– 5 + 5 + 4 = 14**

## అంశం : సువర్ణ దీపస్తంభం – రెండు ఒలీవ చెట్లను గూర్చిన దర్శనము

**1–5 వ. 7) సువర్ణ దీపస్థంభముల దర్శనము:** సువర్ణమయమైన దీపస్థంభము దానిపైనున్న ప్రమిదె (నూనె నిలుపు చేయుటకు) దాని నుండి ఏడు గొట్టములు, ఏడు దీపములకు కలపబడియుండెను. రెండు ఒలీవచెట్లు దీపస్తంభపు కుడి ఎడమ వైపున ఉండి నూనెను ప్రమిదెకు సరఫరా చేయును.

**6–10 వ. భావము:** దీపస్తంభము సంఘమునకు గుర్తు. కావున దేవుని మందిరము ఎవరి శక్తిని బట్టి గానీ, బలమును బట్టి గానీ కాక దేవుని ఆత్మచేతనే కట్టబడునని గొప్ప పర్వతము వంటి ఆటంకములైనను కార్యమును ఆపలేవని జెరుబ్బాబెలు చేతులు పునాది వేసినందున ఆ చేతులే ముగించునని జెరుబ్బాబెలు చేతిలో గుండు నూలుండుట వలన తన ద్వారా మందిర నిర్మాణము జరుగుననుటను తెలుపుచున్నారు. కృప కలుగునుగాక అనుట దేవుని కృపవలననే ఈ కార్యము జరుగును అని గ్రహించగలము.

**11–14 వ. ఒలీవ చెట్లను గూర్చిన భావము:** రెండు ఒలీవచెట్లు సర్వలోకనాధుని సన్నిధిని నిలుచుచు తైలము పోయువారైన యెహోషువను, జెరుబ్బాబెలును సూచించును. తైలము పోయబడుట అభిషేకించబడు రాజవంశీకుడైన జెరుబ్బాబెలును, యాజక వంశీయుడైన యెహోషువను సూచించును. ఆత్మచేత నింపబడుట అను అనుభవము సంఘ సేవజీవితమున కవసరమని చూడగలము. మూడవ అధ్యాయములో పరిశుద్ధత, నాలుగవ అధ్యాయములో పరిశుద్ధాత్మ పూర్ణత సంఘ అభివృద్ధికి అవసరమని చెప్పుచున్నాడు.

# 5వ అధ్యాయం

వచనముల విభజన **– 4 + 7 = 11**

## అంశం : ఎగిరిపోవు పుస్తకమును గూర్చిన ఎనిమిదవ దర్శనము – కొలతూము, అందులోనున్న స్త్రీని గూర్చిన తొమ్మిదవ దర్శనము

**1–4 వ. 8) ఎగిరిపోవు పుస్తకమును గూర్చిన దర్శనము:** 20 మూరల పొడుగు, 10 మూరల వెడల్పు గల ఎగిరిపోవు పుస్తకము శాపమని చెప్పబడినందున ఇది యూదావారి పాపమునుబట్టి కలుగు దేవుని తీర్పును సూచించును. ఒకవైపు దొంగిలువారు రెండవవైపు

అబద్ధ ప్రమాణము చేయువారు మానవులకు కలిగినది దొంగిలించుటను దేవునికి వ్యతిరేకముగా ప్రమాణము చేయుటను సూచించును. దేవునికి, మానవులకు వ్యతిరేకమైన పాపములను, పది ఆజ్ఞలు గల రెండు వేరు వేరు పలకలగాను చూడగలము. ఇండ్లలో చొచ్చి దూలములను, రాళ్ళను నాశనము చేయుట ప్రపంచమంతటికి అంత్యకాలములో జరుగు తీర్పును సూచించును.

**5-11 వ. 9) కొలతూము, అందులో కూర్చున్న స్త్రీని గూర్చిన దర్శనము:**
కొలతూము, అందులో కూర్చున్న స్త్రీ దోషమూర్తియని ఆ తూమును రెక్కలు గల ఇద్దరు స్త్రీలు షీనారు దేశమునకు కొనిపోయి సాలకట్టుదురని తెలుపబడెను. దీని భావముగా విగ్రహారాధన, ఐగుప్తు వ్యాపారము ఇక యూదాలో లేకుండా యూదావారు శిక్షించబడుదురని తెలుసుకొననగును. సంకుబుడి కొంగ అపవిత్రమైనదైనందున ఈ కొంగ వంటి రెక్కలు గల స్త్రీలగు అపవిత్రులైన బబులోను, అష్షూరు వారు యూదాను, ఇశ్రాయేలును చెరగొనిపోవుట ద్వారా విగ్రహారాధన ఇశ్రాయేలీయులలో నుండి తీసివేయదునను తలంపు గలదు. దీని నెరవేర్పుగా బబులోను చెర పిదప ఇశ్రాయేలు, వారి మధ్య నుండి విగ్రహారాధన పూర్తిగా తీసివేయబడినది.

# 6వ అధ్యాయం

వచనముల విభజన **- 8 + 7 = 15**

## అంశం : నాలుగు రథములను గూర్చిన దర్శనము

**1-8 వ. 10) నాలుగు రథములను గూర్చిన దర్శనము:** జెకర్యా నాలుగు రథములను, వాటికి కట్టిన ఎర్రని, నల్లని, తెల్లని చుక్కలు గల గుర్రములను రెండు ఇత్తడి పర్వతముల మధ్య బయలుదేరుట చూచెను. వాటి వివరము తెలుపు దూత అవి యెహోవా సన్నిధి నుండి బయలుదేరు చతుర్వాయువులని (ఆత్మలని) తెలిపెను. ఉత్తర, దక్షిణ దిక్కునకవి వెళ్ళి, ఉత్తరమందు దేవుని ఆత్మకు నెమ్మది కలిగించెను. ఉత్తర దిక్కు, దక్షిణ దిక్కు ఇశ్రాయేలుకు శత్రువులైనందున ఉత్తర దిక్కునుండి వచ్చు శత్రువగు బబులోనువారు నాశనమగుదురని ఇదంతయు క్రీస్తు భూలోక రాజ్యపాలనకు ముందు ప్రకటన 17,18 అధ్యాయములలో చూడగలము.

**9-15 వ. యెహోషువ తలపై కిరీటముంచుట, పనికై పంపబడుట:** బబులోను నుండి వచ్చిన ముగ్గురు యూదావారి యొద్ద నుండి వెండి బంగారములు తీసికొని కిరీటము చేసి యెహోషువ తలపై నుంచుమని జెకర్యాకు సెలవిచ్చాడు. చిగురు అను ఒకడు కలడు. అతడు చిగురించి ఆలయము కట్టి ఏలును. సింహాసనాసీనుడై యాజకత్వము చేసి ఆ ఇద్దరికి సమాధానకరమైన యోచనలు చేయును. ఇది యేసుక్రీస్తు మొదటి రాకడ ద్వారా భూమి మీద సంఘము కట్టబడుచుండుటను, రెండవ రాకడలో రానున్న రారాజు, ప్రధాన యాజకుడైన క్రీస్తుకు, ఆయన చేయబోవు వెయ్యి ఏండ్ల పాలనకు సూచనగా ఉన్నది.

# 7వ అధ్యాయం

వచనముల విభజన - **7 + 7 = 14**

## అంశం : ప్రతి సంవత్సరమున యూదావారు నాలుగవ నెల, అయిదవ నెల, ఏడవ నెల, పదియవ నెలలో చేయు నాలుగు ఉపవాసముల గూర్చిన ప్రశ్నకు రెండు జవాబులు: 1) యూదావారి అవిధేయత వివరము, 2) రానున్న నాశన వివరము

**1-7 వ. మొదటి జవాబు - యూదావారి అవిధేయత:** 70 ఏండ్ల చెర కాలము ముందు నామకార్థముగా ఉపవాసముండిరని, భక్తిలేక జీవించిరని, ఆహారము పుచ్చు కొనినను, మోసము చేసినను స్వప్రయోజనమునకే చేసిరని (1కొరింథీ 10:31) పూర్వము ప్రవక్తల ద్వారా దేవుడు ప్రకటన చేసిన ఆజ్ఞలను మనసుకు తెచ్చుకొనక అవిధేయులైనందుననే దేవుని కోపము వారిమీదికి వచ్చెనని దేవుడు సెలవిచ్చుచున్నాడు.

**8-14 వ. రెండవ జవాబు - రానున్న నాశనము:** సత్యము, కరుణ కలిగి ఎవరిని బాధపెట్టక, కీడుచేయక యుండుడని దేవుడు సెలవియ్యగా ప్రజలు ఆలకింపకపోయినందున దేశము నుండి వారిని చెదరగొట్టుదునని, దేశమును బబులోను రాజు ద్వారా పాడుచేయుదునని సెలవిచ్చి చివరకు దేశమును నాశనము చేసెను.

# 8వ అధ్యాయం

వచనముల విభజన - **6 + 6 + 5 + 6 = 23**

## అంశం : మందిర నిర్మాణ అవసరత - ప్రజల విధేయత

**1-17 వ. మూడవ జవాబు:** దేవుడు రోషము కలిగి (1-6వ.) తన జనులను రక్షించి (7-12వ.) ఆశీర్వదించును (13-17వ.).

**1-6 వ.** 70 ఏండ్ల చెర తరువాత దేవుడు రోషము కలిగి యూదావారి మధ్య నివసించి పిల్లలు సంతోషముగా ఆడుకొనునట్లును, వృద్ధులు సహితము వీధులలో నెమ్మదిగా కూర్చుండునట్లు చేతునన్నాడు.

**7-12 వ.** తన జనులను రక్షించి యెరూషలేముకు నడిపించి మందిరమును నిర్మింపజేసి, పైరులనిచ్చి కాపాడుదునన్నాడు.

**13-17 వ.** ఇకమీదట యూదావారిని ఆశీర్వాదమునకు కారణముగా చేతునని, వారు భయపడక ఉండవలెనని, సత్యము చెప్పుచూ సమాధానకరమైన న్యాయము తీర్చవలెనని చెప్పుచున్నాడు.

**18-23 వ. నాలుగవ జవాబు:** ఉపవాసములు పండుగలగును. నాలుగవ నెలలోను, అయిదవ నెలలోను, ఏడవ నెలలోను, పదియవ నెలలోను వారు చేయు ఉపవాసములు పండుగలై సంతోషమును ఉత్సాహమును పుట్టించునని చెప్పుచున్నాడు.(fasts will become feasts) అందును బట్టి సత్యము, సమాధానము ప్రియముగా ఎంచుకొనుడని సెలవిచ్చుచున్నాడు.

# 9వ అధ్యాయం

వచనముల విభజన - **8 + 9 = 17**

## అంశం :పొరుగు దేశాలపై తీర్పులు - మెస్సీయ రెండు రాకడలు, విమోచన

**1-8 వ. పొరుగు అన్యదేశాలపై దేవుని తీర్పులు:** వ.1-4లలో పొరుగు అన్యదేశములైన సిరియా, ఫెనికయను గురించి, తూరు, సీదోను పట్టణములను గూర్చి సెలవిచ్చుచున్నాడు. తమ జ్ఞానమునుబట్టి, ఇసుక రేణువులంత విస్తారమైన బంగారమును బట్టి అతిశయించినందున దాని బలమును నాశనము చేసి, వారి ఆస్తి ఇతరులకప్పగించి అగ్నిచే కాల్చుదునన్నాడు. దీనిని చూచి భయపడు ఫిలిష్తీయులను నాశనము చేతుననెను. చివరకు వారి నుండి ఒక శేషమును ప్రత్యేకించి వారినుండి విగ్రహారాధనను తీసివేసి పవిత్రపరచి నమ్మకమైన వారినిగా చేసెదనన్నాడు. దేవుడు తానే తన ప్రజలను, తన మందిరమును కాపాడుకొందునని సెలవిచ్చుచున్నాడు.

**9-10 వ. మెస్సీయ రెండు రాకడలు - విమోచన:** 9వ వచనము మొదటి రాకడలో రాజు దీనుడై గాడిదనెక్కి వచ్చుటను మత్తయి 21:5; యోహాను 12:14లలో ఆయన మొదటి రాకడ చివరలో యెరూషలేములోనికి ప్రవేశించు సందర్భమును గూర్చి చెప్పబడినది.

**మత్తయి 21:4-5 -** "ప్రవక్త వలన చెప్పబడినది నెరవేరునట్లు ఇది జరిగెను, అదేమనగా, ఇదిగో నీ రాజు సాత్వికుడై గాడిదను భారవాహక పశువు పిల్లయైన చిన్న గాడిదను ఎక్కి నీ యొద్దకు వచ్చుచున్నాడని సీయోను కుమారితో చెప్పుడి అనునది."

10వ వచనము రెండవ రాకడలో అనగా మహిమగల ప్రభువు రాకడలో యెరూషలేములో యుద్ధాయుధముల అవసరత లేకుండా తానే చేయును. సుస్థిరమైన పాలనను సముద్రము నుండి సముద్రము వరకు చేయును. చెరపట్టబడిన తనవారిని విడిపించును. యెషయా 2:11-14 లలో దీని వివరములు గలవు.

**10-12 వ. బబులోను చెరనుండి విమోచన:** బంధకములు అనగా బబులోను చెర నుండి వారిని విడిపించుట మాత్రమే కాక మరల వారి కోటయగు యెరూషలేమునకు పంపుదునని సెలవిచ్చుచున్నాడు. దీని సమీప నెరవేర్పు క్రీ.శ. 536లో నెరవేరెను. అంత్యకాల

నెరవేర్పుగా ఈ ప్రవచనము అంత్యకాలమందు ఇశ్రాయేలీయులందరు యెరూషలేమునకు తిరిగి వచ్చుటను కూడా సూచించును.

**13 వ. గ్రీకులపై యూదుల జయము:** గ్రేకీయులపై విజయమును క్రీ.పూ. 175–163 లో మక్కబీయులు పొందుటను సమీప నెరవేర్పుగా చరిత్రలో గమనింతుము. అంత్యకాలములో నెరవేర్పుగా అన్యజనులపై హర్‌మెగిద్దోను యుద్ధములో ఇశ్రాయేలే జయము పొందును (ప్రకటన 16:16; 19:20–21).

**14–17 వ. అంత్యకాల విడుదల:** ప్రకటన 19:11–21లలో ఉన్నట్లు ప్రభువు సీయోను కొండపైకి దిగివచ్చి (వ. 14) తన నోట నుండి వచ్చు ఖడ్గముతో శత్రువులందరిని సంహరించి (వ. 15) కాపరి మందను రక్షించునట్లు హర్‌మెగిద్దోను యుద్ధము చివర కాపాడి (వ. 16) వెయ్యి ఏండ్ల వృద్ధినిచ్చును (వ. 17). హర్‌మెగిద్దోను యుద్ధ వివరము ప్రకటన 19:11–21 లోను, వెయ్యి ఏండ్ల పాలన గూర్చి ప్రకటన 20వ అధ్యాయములోను చూతుము.

# 10వ అధ్యాయం

వచనముల విభజన – **4 + 4 + 4 = 12**

## అంశం : విమోచకుడగు క్రీస్తు, విమోచన, విస్తరణ, సమకూర్పు

**1–4 వ. విమోచకుడు:** విమోచకుడగు క్రీస్తు సీయోనులో నుండి వచ్చి, ఇశ్రాయేలునకు విగ్రహములకు కాక. తనకు ప్రార్థించు మనసునిచ్చును. ప్రార్థనకు జవాబిచ్చి కాపాడును. దానికి ముందుగా యూదులకు, శ్రమల కాలములో (ప్రకటన 6–9 అధ్యా.) సహాయము చేయని మేకలైన అన్యజనులను మత్తయి 25:41–42లో ఉన్నట్టు శిక్షించును. ఇశ్రాయేలుకు క్షేమమిచ్చును. మేకు, విల్లు, యూద్ధాయుధములన్నియు క్రీస్తును సూచించును. ఈ మూలరాయి విమోచకుడు క్రీస్తు అని ఎఫెసీ 2:20; 1పేతురు 2:5లలో చూడగలము.

**ఎఫెసీ 2:20 –** "క్రీస్తుయేసే ముఖ్యమైన మూలరాయియై యుండగా అపొస్తలులును ప్రవక్తలును వేసిన పునాదిమీద మీరు కట్టబడియున్నారు. ప్రతి కట్టడమును ఆయనలో చక్కగా అమర్చబడి, ప్రభువునందు పరిశుద్ధమైన దేవాలయమగుటకు వృద్ధిపొందుచున్నది."

**1పేతురు 2:5 –** "మనుష్యులచేత విసర్జింపబడినను, దేవుని దృష్టికి ఏర్పరచబడినదియు అమూల్యమును సజీవమునైన రాయియగు ప్రభువునొద్దకు వచ్చినవారై, యేసుక్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మసంబంధమైన బలులనర్పించుటకు పరిశుద్ధ యాజకులుగా ఉండునట్లు, మీరును సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మసంబంధమైన మందిరముగా కట్టబడు చున్నారు."

**5–8 వ. విమోచన:** యూదావారికి ప్రభువు బలమిచ్చి వారికి తోడుగా నున్నందున శత్రువులు సిగ్గుపడుదురు. విమోచకుని బట్టి శత్రువులను యూదావారు త్రొక్కుదురు. "నేను వారిని విమోచించితిని" (8వ.).

**9-12 వ. విస్తరణ (సమకూర్పు):** ఈలవేసి దూరదేశమందుండు వారిని ప్రభువు పిలువగా ఇశ్రాయేలు తమ బిడ్డలతో కలిసి అష్షూరు నుండి, ఐగుప్తు నుండి వచ్చెదరు. అష్షూరీయులు, ఐగుప్తువారు యెహోవా నామమును స్మరించువారగుదురు. వెయ్యి ఏండ్ల కాలములో ఇది నెరవేరును. ప్రస్తుత కాలమందు కూడా ప్రపంచమంతటి నుండి యూదులు తిరిగి ఇశ్రాయేలు దేశమునకు వచ్చుచున్నది.

# 11వ అధ్యాయం

వచనముల విభజన **- 3 + 5 + 6 + 3 = 17**

## అంశం : మందకాపరి మెస్సీయ తృణీకరింపబడుట - పనికిమాలిన కాపరులు

**1-3 వ. దేశము పాడగుట - కాపరులు:** లెబానోనునందలి దేవదారు చెట్లు, వృక్ష రాజ్యములు, సరళవృక్షములు కూలుట, పాడగుట, అంగలార్చుట యూదావారి కాపరుల పతనమును సూచించును. క్రీ.శ. 70లో రోమ్‌వారు యూదా దేశమంతటిని పాడుచేయగా అది క్రీ.శ. 1948 వరకు అనగా ఈ మధ్యకాలము వరకును యూదావారు స్వాతంత్ర్య పరిపాలన లేని ప్రజలుగా ఉండిరి.

**4-8 వ. మంచి కాపరి మెస్సీయ:** వధకు సిద్ధముగా నున్న మందలకు మెస్సీయ మంచి కాపరిగా రానున్నాడు. ముందున్న కాపరులు క్రూరులైనందున దేవుడు వారిని శత్రువులకప్పగించెను. సౌందర్యము అను నొక కఱ్ఱను, బంధమను మరొక కఱ్ఱను తీసుకొని గొఱ్ఱెలను మేపుచు ముగ్గురు కాపరులను చంపెను. దీని నెరవేర్పుగా క్రీ.పూ. 586 లో యూదా నుండి 1) రాజరికము తీసివేయబడెను, 2) యాజకత్వము, 3) ప్రవచనమును తీసివేసెను. ఒక నెల, అనగా మలాకీ తరువాత క్రీస్తు మరణము వరకు ప్రవక్తలు గాని, నిజమైన యాజకులు గాని యూదా వారికి లేరు.

**9-14 వ. మెస్సీయ తృణీకరింపబడుట:** సౌందర్యమను కఱ్ఱ విరువబడుట క్రీస్తు తృణీకరింపబడి చంపబడుటకు గుర్తు. బంధమను కఱ్ఱ దేవునికి, యూదావారికి మధ్యనున్న నిబంధన. క్రీస్తును సిలువ వేయుటలో బంధమను కఱ్ఱ విరువబడి అనగా దేవుని నిబంధన విరవబడి యూదులందరు చెదరిపోయిరి.

**15-17 వ. పనికి మాలిన కాపరి:** వ. 14,15ల మధ్య ప్రస్తుతపు సంఘకాలమున్నది. సంఘకాలమునకు తదుపరి క్రీస్తు విరోధి చేతికి (పనికిమాలిన కాపరి) యూదా వారప్పగింపబడుటను, నేనొక పనికిమాలిన కాపరిని నియమించుచున్నానను మాట నెరవేర్పును

చూడగలము. అతడు సరిగా కాపుకాయకుండుట శ్రమల, మహా శ్రమల కాలములో క్రీస్తు విరోధి యూదులను కష్టపెట్టుటను సూచించును. వ. 17లో ఉన్నట్లు చివరికి అతడు హర్‌మెగిద్దోను యుద్ధములో సంహరింపబడును (ప్రకటన 19:20-21).

## 12వ అధ్యాయం

వచనముల విభజన - **4 + 5 + 5 = 14**

### అంశం : మెస్సీయ రెండవ రాకడ - యెరూషలేము విమోచన

**1-4 వ. రెండవ రాకడలో అన్యజనులకు కలుగు శ్రమలు:** యెరూషలేమును ప్రభువు హెచ్చించి, అన్యజనులపై బరువైన రాయినిగా చేయగా, ఎత్తి మోయు వారందరు గాయపడుదురు. యెరూషలేము పైకి వచ్చువారి గుఱ్ఱములకు బెదురును, అంధత్వమును ప్రభువు కలిగించగా అన్యులు అందరు శ్రమలపాలగుదురు.

**5-9 వ. యూదులు ప్రభువును గుర్తించుట - యూదులు జయము పొందుట:** యూదావారు తాము ప్రభువు ద్వారా సహాయము పొందుచున్నామని గుర్తించెదరు. యూదా అధికారులు కట్టెల క్రింద నిప్పులుగా నుందురు. నలుదిక్కుల అన్యజనులను అందరిని దహించును. అనగా అన్యజనులపై యుద్ధములో యూదావారు జయమును పొందుదురు. యెహోవాయే యూదావారికి సంరక్షకుడుగా నుండును.

**10-14 వ. యూదులపై ఆత్మ కుమ్మరింపు - మెస్సీయను గుర్తించి ప్రలాపించుట:** తన జనులపై కరుణ నొందించు ఆత్మను, విజ్ఞాపన చేయు ఆత్మను కుమ్మరించగా వారు తాము పొడిచిన క్రీస్తువైపు చూచి గుర్తించి ప్రలాపింతురు. ఒక్కొక్క గోత్రమువారు వేరు వేరుగా వారిభార్యలు వేరుగా ప్రలాపింతురు.

## 13వ అధ్యాయం

వచనముల విభజన - **3 + 3 + 3 = 9**

### అంశం : కొట్టబడిన మెస్సీయను గుర్తించుట

**1-3 వ. పాపమును పరిహరించుటకై తీయబడిన ఊట - యూదానుండి పాపము ఎత్తివేయబడుట:** యూదావారు, ఇశ్రాయేలువారు పశ్చాత్తాపపడిన పిదప ప్రాయశ్చిత దినము (యూదుల పండుగలలో ఆరవది) వారి మధ్య ప్రారంభమగును. కలువరి సిలువలో ఊట తీయబడినను ఇశ్రాయేలీయులు దానిని నమ్ములేదు. ప్రభువు రెండవ రాకడలో తాము పొడిచిన యేసే మెస్సీయ అని గుర్తించగా వారి పాపములు తీసివేయబడును. విగ్రహములు దేశములో నుండకుండా కొట్టివేయబడును.

**4-6 వ. మోసపుచ్చు ప్రవక్త స్థితి:** మోసపుచ్చు ప్రవక్తలు దీనిని చూచి సిగ్గుపడి వారు ప్రవచనములు చెప్పుట మానివేయుదురు. తాము ప్రవక్తలమే కాదని చెప్పుకొందురు. గతకాలములో శరీరములపై వారు చేసికొనిన గాయములేమని ఎవరైనా అడిగిన యెడల స్నేహితుల యింట వారికి గాయములు కలిగినవని వారు చెప్పుకొందురు.

**7-9 వ. హతమైన కాపరి (మొదటి రాకడ) - పరిశుద్ధపరచబడిన కాపరి (రెండవ రాకడ):** మొదటి రాకడలో హతము చేయబడిన క్రీస్తును (7వ.), శ్రమల మహాశ్రమల కాలములోనున్న ఇశ్రాయేలును (8వ.), మహా శ్రమల అంతమందు మెస్సీయ రెండవ రాకడ ద్వారా శుద్ధిపరచ బడిన యూదా (9వ.) (హెబ్రీ 9:28 చూడండి).

# 14వ అధ్యాయం

వచనముల విభజన - **5 + 6 + 4 + 6 = 21**

## అంశం : మెస్సీయ విజయము

**1-5 వ. ప్రభువు దినమున యూదులకు, అన్యజనులకు జరుగు యుద్ధము - ఒలీవల కొండపై ప్రభువు ప్రత్యక్షత:** ప్రభువు దిననునబడు రెండవ రాకడలో యెరూషలేముకు ప్రభువు వచ్చు సమయమున అన్యజనులు సమకూడి యెరూషలేముపై యుద్ధము చేయబూని పట్టణమును పట్టుకొని కొల్లపెట్టి సగముమందిని చెరపట్టుదురు. శేషించినవారు పట్టణములో నుండగా యెహోవా ఒలీవల కొండపైకి దిగివచ్చి పాదము పెట్టగా కొండ నడిమికి విడిపోవును. మధ్య ఒక పెద్ద విశాలమేర్పడును. అందరు అందు లోనికి పరుగెత్తిపోగా దేవుడు ప్రత్యక్షమగును.

**6-11 వ. ప్రకృతిలో మార్పులు - యెరూషలేము క్షేమము: A.** ప్రకృతిలో మార్పులు: 1) అస్తమయమున వెలుగు కలుగుట, 2) జీలజలము యెరూషలేము నుండి పారి సముద్రమునకు దిగుట. **B.** యెరూషలేము క్షేమము: యెరూషలేము మరల ఎత్తుగా కట్టబడి, క్రీస్తు రాజై ఉండగా జనులు నిర్భయముగా నివసించుచూ వెయ్యి ఏండ్ల పాలనలో నుందురని సెలవిచ్చెను.

**12-15 వ. శత్రు నాశనము - ఇశ్రాయేలు సమకూర్పు:** యెరూషలేముపై యుద్ధము చేసిన జనులందరిని యెహోవా మొత్తును. వారి శరీరములు కుళ్ళిపోవును. దేవుడు వారిలో కలవరము పుట్టింపగా వారందరు ఒకరినొకరు చంపుకొందురు.

**16-21 వ. అన్యుల శేషము యూదులు కలిసి ఆరాధించుట:** మిగిలిన అన్యజనుల శేషము యూదులతో కలిసి యెహోవాను ఆరాధింతురు. దీనిని యూదుల ఏడవ పండుగయగు పర్ణశాలలో పండుగగా చూతము. ఆరాధింపని అన్యులను యెహోవా మొత్తును. మందిరము పవిత్రముగా నుండును. వ్యాపారము చేయవారెవరును అందుండరు. యూదుల పండుగల నెరవేర్పు గమనింతము.

**1. పస్కా పండుగ** (క్రీస్తు మరణము - మనకు రక్షణ).

**2. ఏడు దినములు పులియని రొట్టెల పండుగ** (ఏడు దినములు అనగా సంపూర్ణ కాలము. రక్షించబడిన మనము జీవించు సంపూర్ణ కాలము పాపము లేని పరిశుద్ధ జీవితము జీవించుట): **1కొరింథీ 5:7-8** "మీరు పులిపిండి లేనివారు గనుక క్రొత్తముద్ద అవుటకై ఆ పాతదైన పులిపిండిని తీసిపార వేయుడి. ఇంతేకాక క్రీస్తు అను మన పస్కాపశువు వధింపబడెను. గనుక పాతదైన పులిపిండితోనైనను దుర్మార్గత దుష్టత్వమునను పులిపిండి నైనను కాకుండ నిష్కాపట్యమును సత్యమునను పులియని రొట్టెతో పండుగ ఆచరింతము."

**3. ప్రథమ ఫలముల పండుగ** (క్రీస్తు పునరుత్థానము): **1కొరింథీ 15:20-23 -** "ఇప్పుడైతే నిద్రించినవారిలో ప్రథమఫలముగా క్రీస్తు మృతులలో నుండి లేపబడి యున్నాడు. మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింపబడుదురు. ప్రతివాడును తన తన వరుసలోనే బ్రదికింపబడును; ప్రథమఫలము క్రీస్తు; తరువాత క్రీస్తు వచ్చినప్పుడు ఆయనవారు బ్రదికింపబడుదురు."

**4. పెంతెకొస్తు పండుగ (భూలో**కమునకు పరిశుద్ధాత్మ అనుగ్రహము): **అపొ.కా. 2:1-4-** "పెంతెకొస్తు పండుగ దినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడి యుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొక ధ్వని ఆకాశము నుండి అకస్మాత్తుగా వారు కూర్చుండియున్న యిల్లంతయు నిండెను. మరియు అగ్ని జ్వాలల వంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించినకొలది అన్యభాషలతో మాటలాడసాగిరి." పై నాలుగు పండుగలు నెరవేరినవి. 5,6,7 పండుగలు నెరవేరవలసి యున్నది.

**5. బూరల పండుగ** (ప్రభువు రాకడ, సంఘము ఎత్తబడుట): **1థెస్స 4:16-17 -** "ఆర్భాటముతోను, ప్రధాన దూతశబ్దముతోను, దేవుని బూరతోను, పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును; క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితోకూడ ఏకముగా ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశ మండలమునకు మేఘముల మీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ నుందుము."

**6. ప్రాయశ్చిత్త దినము** (ఇశ్రాయేలీయులు యేసును క్రీస్తుగా గుర్తించుట): ఇది ఇంకను జరుగవలసియున్నది. **జెకర్యా 12:10; 13:1 -** "ఇశ్రాయేలీయులు తమ కొరకు సిలువ వేయబడిన క్రీస్తును గుర్తించుటయే ప్రాయశ్చిత్త దినము." ఇది శ్రమలకాలము. తరువాత ప్రభువు భూమిపైకి వచ్చునపుడు నెరవేరును.

**7. పర్ణశాలల పండుగ** (ప్రభువుతో సదాకాలము పరలోకములో నివసించుట): జెకర్యా 14:19 లో పర్ణశాలల పండుగ నెరవేర్పును గూర్చిన ప్రవచనము కలదు. ఇది అంతములో నెరవేరును.

# 12. మలాకీ

**గ్రంథకర్త : మలాకీ** **కాలం : క్రీ.పూ. 397**

**ముఖ్యాంశం : మార్గము తప్పిన ప్రజలు రానున్న తీర్పులు - మెస్సీయ రెండు రాకడలు**

**గ్రంథ ఉద్దేశం :** మలాకీ అను పేరుకు 'నా దూత' అని అర్థము. యెహోవా దూతగా రానున్న మెస్సీయను సూచించును. ఈ చివరి గ్రంథమందు ప్రజల, యాజకుల జీవితములు ప్రభువు రెండు రాకడలను, చివరిదిగా వారి జీవితములు దిద్దబడుటను చూడగలము.

**అధ్యాయాల విభజన :**

**I. 1 అధ్యా : దేవుని ప్రేమను గుర్తించుటలో దారితప్పిన ప్రజలు, యాజకులు.**

**II. 2 అధ్యా : దేవుని ఆజ్ఞలు అనుసరించడంలో దారితప్పిన ప్రజలు, యాజకులు**

**III. 3 అధ్యా : దారితప్పిన వారి కొరకై రెండు రాకడలలో రానున్న ప్రభువు**

**IV. 4 అధ్యా : రెండు రకముల ప్రజలకు మెస్సీయ రెండవ రాకడలో జరుగు తీర్పులు**

## 1వ అధ్యాయం

వచనముల విభజన - **5 + 5 + 4 = 14** వచనాలు

### అంశం : ప్రేమను గుర్తించుటలో దారితప్పిన ప్రజలు, యాజకులు

### 1-5 వ. దేవుడు చూపిన ప్రేమను గుర్తించుటలో దారితప్పిన ప్రజలు

**1-2 వ.** దేవుడు తాను ఇశ్రాయేలును ప్రేమించితినని చెప్పుచు ఏ విషయమందు మా యెడల ప్రేమ చూపితినని వారను మాటను జ్ఞాపకము చేయుచు మోసగాడైన యాకోబును ప్రేమించి, ఇశ్రాయేలుగా మార్చి దీవించిన సంగతిని జ్ఞాపకము చేయుచున్నాడు.

**3-4 వ.** పాపము చేసిన ఎదోమీయులను బబులోనువారిచే శిక్షించి పాడైన స్థలములను మరలా కట్టుకొందుమని వారు తలంచినను వారికి విడుదలనివ్వక నిత్యాగ్నికి వారినప్పగించెను. కాని యూదావారు పాపము చేయగా బబులోనీయులతో శిక్షించి, తదుపరి విడిపించి, పాడైన స్థలములను మరలా కట్టించాడు. ఇంకనూ కట్టించుచున్నాడు. ఇదియే ప్రేమ.

**5 వ.** వీటినిబట్టి ఇశ్రాయేలు (యూదా) దేవుని ప్రేమను గుర్తించి యెహోవా బహు ఘనుడైయున్నాడని ఎరుగుదురు. ఇందులో పాఠముగా ఆయన బిడ్డలమైన మనము దేవుని ప్రేమను గుర్తించి, నిత్యము తలపోయుచు ఆయన నామమును ఘనపరచవలెనని సెలవిచ్చు చున్నాడు.

## 6-10 వ. దేవునికి భయపడుటలోను, ఘనపరుచుటలోను దారితప్పిన యాజకులు

**6 వ.** దేవుడు వారికి తండ్రియై యుండగా దేవుని నామమును యాజకులు ఘనపరచ నందున దేవుడు వారిని ప్రశ్నించగా ఏమి చేసి నీ నామమును నిర్లక్ష్య పెట్టితిమని దేవునిని ప్రశ్నించిరి.

**7-8 వ.** జవాబుగా బలిపీఠముపై అపవిత్రమైనవాటిని, అనగా కుంటిదానిని, గ్రుడ్డిదానిని, రోగము గలదానిని అర్పించి నిర్లక్ష్యపెట్టితిరని దేవుడు యూదాకు సెలవిచ్చుచున్నాడు.

**9-10 వ.** దేవుని యూదావారు శాంతిపరచవలెనని, లేనియెడల బలిపీఠముపై అగ్ని రాజబెట్టక యుండునట్లు మందిరపు వాకిండ్లు మూయబడవలెనని దేవుడు కోరుచున్నాడు. ఇందులో పాఠముగా దేవుని యాజకులమైన మనము ఘనుడైన దేవునికి అయోగ్యమైన అర్పణ కాక, ఘనమైన రీతిగా అర్పణలు చెల్లించుట, సజీవయాగముగా మనలను అర్పించు కొనుటను దేవుడు కోరుచున్నాడు.

## 11-14 వ. దేవుని నామమును ఘనముగా ఎంచుటలో దారితప్పినవారు:

అన్యజనులు యెహోవా నామమును ఘనముగా ఎంచుదురు. దేవుడు తాను ఘనమైన మహారాజని, ఆయన నామము ఘనమైనదిగా అన్యజనులలో ఎంచబడుచుండగా యూదావారు కుంటిదానిని, తెగులు గలదానిని, చెడినదానిని బలిగా అర్పించి దేవుని బల్లను నీచపరచినందున దేవునిని నీచపరచిరని, ఆయన నామమును ఘనముగా ఎంచ వలెనని సెలవిచ్చుచున్నాడు. యెహోవా నామము బలమైనదని (సామెతలు 18:12), రక్షణకరమైనదని (అపొ.కా. 4:11-13) గుర్తింతము. ఆయన బిడ్డలమైన మనము ఈ లోకములో యెహోవా నామమును ఘనమైనదిగా ఎంచవలెనను పాఠము నేర్చుకొను చున్నాము.

# 2వ అధ్యాయం

వచనముల విభజన - **9** + **8** = **17** వచనాలు

## అంశం: దేవుని ఆజ్ఞలు అనుసరించడంలో దారితప్పిన యాజకులు, ప్రజలు

**1-9 వ. దారితప్పిన యాజకులు - దేవుని ఆజ్ఞలను అనుసరించుటలో మార్గము తప్పిన యాజకులు - రానున్న తీర్పు:** యాజకుల నోట నుండి ప్రజలు ధర్మశాస్త్ర విధులను నేర్చుకొందురు. వారు జ్ఞానమును బట్టి ప్రజలకు బోధించవలెను. కాని యాజకులు ధర్మశాస్త్ర విషయములో అవిధేయులై అనేకులను అభ్యంతరపరచి, పక్షపాతులైనందున దేవుడు వారిని అందరి దృష్టికి నీచులనుగా చేసియున్నాడు. ప్రజలు దారితప్పిరి.

**10-17 వ. దారితప్పిన ప్రజలు :** 10-11 వ.- ఒకరి యెడల ఒకరు ద్రోహము చేయుచు దారితప్పిన ప్రజలు: దేవుడు పితరులతో చేసిన నిబంధనను మీరి ప్రజలు ఒకరి యెడల ఒకరు దారితప్పిరి. ద్వితీ 28 అధ్యాయములో చెప్పబడినట్లు దేవుని మాటలు శ్రద్ధగా విని వాటి చొప్పున నడుచుకొనలేదు. ఆలాగుండక దేవుని మాటలు వినవలెనని చెప్పుచున్నాడు.

**12-16 వ.** అన్యుల పిల్లలను పెండ్లి చేసుకొనుచు, పెండ్లి చేసికొనిన భార్యను విసర్జించుట ద్వారా దారితప్పిన ప్రజలు: యూదావారు ద్రోహులై యెరూషలేములో హేయక్రియలను చేయుచు అన్య స్త్రీలను పెండ్లి చేసుకొనుచున్నారు. అలాగే యవ్వనకాలమందు పెండ్లియాడిన పెండ్లి భార్యలను విసర్జించుచున్నారు. వారు దేవుని సన్నిధిలో చేసిన ప్రమాణము మరచి దారితప్పినందున దేవుడు ఈ కార్యములు తనకు అసహ్యమైనదని వారిని నిర్మూలము చేతునని అందులకై వారు విశ్వాస ఘాతకులు కాకుండా ఉండవలెనని సెలవిచ్చుచున్నాడు.

**17 వ.** మాటలచేత యెహోవాను ఆయాసపెట్టిన ప్రజలు: దుర్మార్గులు యెహోవా దృష్టికి మంచివారని, దేవుడు వారియందు సంతోషించునని, న్యాయకర్తయగు దేవుడు ఏమాయెనని ప్రజలు మాటలాడుట ద్వారా దేవుని ఆయాసపెట్టి దారితప్పిరి.

# 3వ అధ్యాయం

వచనముల విభజన – **6 + 6 + 6 = 18** వచనాలు

## అంశం : దారితప్పిన వారికొరకై రెండు రాకడలలో రానున్న ప్రభువు

### 1–6 వ. పవిత్రపరచు దూతగా ప్రభువు రెండు రాకడలు

**1 వ.** క్రీస్తు మొదటి రాకడలో ప్రజలతో నిబంధన చేయుటకై వచ్చునని ఆయన ముందుగా బాప్తిస్మమిచ్చు యోహాను వచ్చునని సెలవిచ్చుచున్నాడు. కాని వచ్చిన ప్రభువుతో యూదులు సంతోషించక సిలువవేసిరి.

**2–5 వ.** ఆయన వచ్చు దినము అను మాట ప్రభువు యొక్క రెండవ రాకడను తెలుపుచున్నది. ఆయన కంసాలివలె, చాకలివలె శుద్ధిపరచి, పాపమును తీసివేయుటకై వచ్చునని సెలవిచ్చుచున్నాడు. పాపము తీసివేయబడిన పిదప యూదావారి నైవేద్యము యెహోవాకు ఇంపుగా నుండును. అన్యాయస్తులకు తీర్పు తీర్చుదునని సెలవిచ్చుచున్నాడు.

**6 వ.** దేవుడు తాను మార్పులేని వాడనని అందులకే యాకోబు సంతతిని నేటివరకు లయపరచక కాపాడితినని సెలవిచ్చుచున్నాడు.

**7–12 వ. అర్పణలు, దశమ భాగములు ఇవ్వక దారితప్పిన ప్రజలు – ఇచ్చువారికి ఆశీర్వాదములు:** ప్రజలు అర్పణలు, పదియవ భాగము దేవునికిచ్చుట దేవుని కట్టడ. అలాగివ్వక దారితప్పి దేవునికి దూరముగా నుండి ఏ విషయములో దేవుని వైపు తిరుగుదుమని ఎదురు ప్రశ్న వేయుచున్నారు. జవాబుగా దేవుడు ప్రజలు దేవునిది దేవునికివ్వక దేవుని భాగమును దొంగిలించుచున్నారని దేవుని భాగము దేవునికిచ్చి ఘనపరచిన యెడల ఏడు విధములుగా ఆశీర్వదించునని సెలవిచ్చుచున్నాడు. 1) ఆకాశపు వాకిండ్లు విప్పబడును, 2) పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించబడును, 3) పంటను తినివేయు పురుగులు గద్దింపబడును, 4) భూమి పంట నాశనము చేయబడదు, 5) ద్రాక్షాచెట్లు అకాల ఫలములు రాలకయుండును, 6) ఆనందకరమైన దేశములో నివసించెదరు, 7) అన్యజనులందరిచేత ధన్యులని పిలువబడెదరు.

### 13–18 వ. మాటలయందు (13–15 వ.), సేవించుటయందు (16–18 వ.) దారితప్పిన ప్రజలు, మెస్సీయ రెండవ రాకడ, ఇశ్రాయేలు సమకూర్పు

**13–15 వ.** మాటలయందు దారితప్పిన ప్రజలు: దేవుని సేవచేయుట నిష్ఫలమనియు, ఆయన ఆజ్ఞలను గైకొనుట వలన ప్రయోజనము లేదనియు గర్విష్ఠులు, దుర్మార్గులు వర్ధిల్లుదురని సంరక్షణ పొందుదురని బహు గర్వముగా మాటలాడుచు, నిన్ను గూర్చి ఏమి చెప్పితిమని దేవునికి ప్రశ్న వేయుచున్నారు.

**16-18 వ.** దేవుని సేవించుటయందు దారితప్పిన ప్రజలు: యెహోవాయందు భయ భక్తులు కలిగి ఆయన నామమును స్మరించుచు ఉండవలెనని, అప్పుడు తండ్రి తన్ను సేవించు కుమారుని కనికరించునట్లు వారిని కనికరింతునని దేవుడు సెలవిచ్చుచున్నాడు. నీతి గలవారెవరో, దేవుని సేవించువారెవరో, సేవించక దారితప్పిన వారెవరో ప్రభువు రెండవ రాకడలో తెలియబడును.

# 4వ అధ్యాయం

వచనముల విభజన **- 3 + 3 = 6** వచనాలు

## అంశం : రెండు రకములైన ప్రజలకు మెస్సీయ రెండవ రాకడలో జరుగు తీర్పులు

### 1-3 వ. రెండు రకములైన ప్రజలకు మెస్సీయ రెండవ రాకడలో జరుగు తీర్పులు:

**1 వ.** నియమించబడిన ఈ దినము ప్రభువు రెండవ రాకడను సూచించుచున్నది. ప్రభువును నమ్మని పాపులు ఆ దినమున తీర్పుతీర్చబడి అగ్నిచేత కాల్చ బడుదురు.

**2-3 వ.** ప్రభువును నమ్మినవారు నీతిసూర్యుడుగా ప్రభువు ఉదయించినందున, ఆయన రెక్కల క్రింద ఆరోగ్యము గలవారై క్రొవ్విన దూడలవలె గంతులు వేయుచు ఆనందింతురని సెలవిచ్చుచున్నాడు (యెషయా 30:26).

### 4-6 వ. సేవకుడైన మోషే, ప్రవక్తయైన ఏలీయా

**4 వ.** ప్రస్తుత కాలమందు ప్రజలు ధర్మశాస్త్ర గ్రంథ విధులను, కట్టడలను జ్ఞాపకము చేసికొనుటలేదు. ప్రభువు రెండవ రాకడలో మోషే ద్వారా ప్రభువు ఆజ్ఞాపించిన ధర్మశాస్త్రమును గైకొనవలెనని హెచ్చరించుచున్నాడు. అందులకే ప్రకటన 11:3-11 లో సాక్ష్యమిచ్చు ఇద్దరు సాక్షులలో ఒకరు మోషేవంటివాడుగా నున్నట్లు మనము చూడగలము.

**5 వ.** ఏలీయా వచ్చుటను గూర్చి క్రీస్తు మత్తయి 11:14; 17:10-13 లలో రాబోవు ఏలీయా బాప్తిస్మమిచ్చు యోహాను అని సెలవిచ్చెను. కానీ ఈ ప్రవచన పూర్ణ నెరవేర్పుగా ప్రకటన 11:3-13లో ఉన్న రెండవ సాక్షి ఏలీయాయై యుండవచ్చునని తలంచగలము.

**6 వ.** ఈ దినాలలో ఆత్మ కలిగించు ఐక్యత తండ్రులు, పిల్లల మధ్య కలుగునని నేర్చుకొను చున్నాము.

❊ ❊ ❊ ❊ ❊